భండారు అచ్చమాంబ

సచ్చరిత్ర

కొండవీటి సత్యవతి

భండారు అచ్చమాంబ

సచ్చరిత్ర

కొండవీటి సత్యవతి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : 50/-
తొలి ముద్రణ : జూన్, 2012
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126, శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

విషయ సూచిక

1.	ఈ పుస్తకం రాయడం వెనుక...	iv
2.	తెలుగు సాహిత్యంలో ధృవతార భండారు అచ్చమాంబ	1
3.	తొలి కథకురాలు	18
4.	అచ్చమాంబ రాసిన వ్యాస సముదాయం	28
5.	స్త్రీల సమాజ స్థాపనము/బృందావన సమాజం	36
6.	అక్కాతమ్ముళ్ళ అనుబంధం	42
7.	అచ్చమాంబ మరణం	46
8.	ముగింపు	48

అనుబంధం

1.	కృతి విమర్శనము -1 (సమీక్షావ్యాసం)	56
2.	కృతి విమర్శనము-2 (పుస్తకసమీక్ష)	58
3.	కీర్తి శేషురాలగు అచ్చమాంబ (స్మరణ)	60
4.	అచ్చమాంబ మరణించినపుడు	64
5.	వేమవర్పు మహాలక్ష్మమ్మ-ఆహ్వానపత్రిక	68
6.	ఏలూరు పట్టణంలో అచ్చమాంబ ప్రసంగం	70
7.	కాకినాడలో అచ్చమాంబ ఇచ్చిన ఉపన్యాసం	76
8.	బందరులో బృందావన సమాజ స్థాపనసందర్భంగా ఇచ్చిన ఉపన్యాసం	85
9.	ఉపయుక్త గ్రంథాలు, వ్యక్తులు	92

ఈ పుస్తకం రాయడం వెనుక...

భండారు అచ్చమాంబ గురించి నేను మొదటిసారి చదివింది 1991లో సూసీతారు, కె. లలితల సంయుక్త సంపాదకత్వంలో వెలువడిన " Women Writing in India: 600 BC to the present, Volume I, 600 BC to the early 20th century, Volume II" పుస్తకంలో. ఈ పుస్తకంలో తొలిసారి భండారు అచ్చమాంబ జీవితం గురించి రాసారు. అచ్చమాంబ అసమాన ప్రజ్ఞాపాటవాల గురించి, ఆమె రచనల గురించి చాలా విపులమైన వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. 1901 సంవత్సరంలో అచ్చమాంబ రాసిన "అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథం కందుకూరి వీరేశలింగంగారి 'చింతామణి' పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైందని, ఆమె మూడు భాగాలుగా ఈ పుస్తకాన్ని రాయదలిచిందని పేర్కొన్నారు.

చరిత్ర చీకటిలో మినుకు మినుకుమంటున్న భండారు అచ్చమాంబను తెరమీదకు తెచ్చి, తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన సేవల మీద వెలుగును ప్రసరించిన పుస్తకం "వుమెన్ రైటింగ్ ఇన్ ఇండియా". ఈ పుస్తకం కోసం, తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా చదివి, పరిశీలించిన కె.లలిత, తెలుగులో తొలి కథ రాసింది భండారు అచ్చమాంబేనని ప్రమాణపూర్వకంగా ప్రకటించింది. అంతేకాదు భారతీయ స్త్రీల చరిత్రలను అబలాసచ్చరిత్ర రత్నమాలగా గుదిగుచ్చిన అచ్చమాంబే ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణి అని, స్త్రీలను ఐక్యపరుస్తూ, స్త్రీల కోసం మొట్టమొదటిసారి "బృందావనం స్త్రీల సమాజాన్ని" స్థాపించిన ఘనత కూడా అచ్చమాంబకే దక్కుతుందని ఈ పుస్తకం నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

అచ్చమాంబను ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా ప్రకటిస్తూ స్త్రీవాద పత్రిక భూమిక జనవరి-మార్చి 1993 సంచికలో కె. లలిత వ్యాసం రాసింది. 1998 సంవత్సరంలో భూమిక, అన్వేషి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు కథ, నిర్మాణం, పరిధి, వైవిధ్యం" మీద మూడు రోజుల వర్క్‌షాప్ జరిగింది.ఆ వర్క్‌షాప్‌లో కాళీపట్నం రామారావు మాస్టారు, కేతు విశ్వనాథరెడ్డి, వాసిరెడ్డి సీతాదేవి, పి. సత్యవతి, అబ్బూరి ఛాయాదేవి, అల్లం రాజయ్య,

ఓల్గా, వల్లంపాటి వెంకటసుబ్బయ్యలాంటి హేమా హేమీలందరూ పాల్గొన్నారు. ఎందరో కొత్త కథకుల్ని తెలుగు సాహిత్యానికి అందించిన, పరిచయం చేసిన వర్క్‌షాప్ అది. ప్రతిమ, శిలాలోలిత, తుర్లపాటి లక్ష్మి, అనిశెట్టి రజిత లాంటి రచయిత్రుల్ని భూమికకు దగ్గర చేసిన సమావేశాలవి.

ఆనాటి రెండోరోజు కార్యక్రమంలో కె.లలిత "సంఘ సంస్కరణోద్యమం – స్త్రీల కథలు" అనే అంశం మీద మాట్లాడుతూ 1910లో వచ్చిన గురజాడ 'దిద్దుబాటు' మొదటి ఆధునిక కథ అంటున్నారు విమర్శకులు, కానీ 1902లో భండారు అచ్చమాంబ రాసిన "ధనత్రయోదశి"ని ఎందుకు మొదటి కథగా పరిగణించడం లేదు? అని ప్రశ్నించారు. ఆ రోజు దాని మీద ఏమి చర్చ జరిగిందో నాకు గుర్తు లేదు కానీ ఈ వర్క్‌షాప్ రిపోర్ట్‌ను అద్భుతంగా రాసిచ్చిన అబ్బూరి ఛాయాదేవిగారు లలిత మాటల్ని యధాతథంగా రాసారు. 1998 మార్చి భూమికలో ఈ రిపోర్ట్‌ను ప్రచురించినపుడు అచ్చమాంబ మళ్ళీ నా ఆలోచనల్లోకి వచ్చి చేరింది. 'ధనత్రయోదశి' కథలో ఏముందో చూడాలన్పించింది. అన్వేషి లైబ్రరీలో వెతికాను. వేటపాలెం లైబ్రరీ నుంచి సేకరించి తెచ్చి, అన్వేషి లైబ్రరీలో భద్రపరిచిన అలనాటి స్త్రీల పత్రికలు హిందూసుందరి, తెలుగు జనానా, గృహలక్ష్మి, సావిత్రి, సతీహితబోధిని మొదలైన పత్రికలు తిరగేస్తుంటే హిందూసుందరి 1903 నాటి సంచిక నా కళ్ళబడింది. అందులోనే 'ధనత్రయోదశి' కథ ప్రచురితమైంది. ఆ కథని చదివినపుడు నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో 'కథ' అనే ప్రక్రియ తెలియక ముందే అచ్చమాంబ అంత అద్భుతమైన కథ ఎలా రాయగలిగిందా? అనే ఆసక్తితో ఆమె జీవితం గురించి తెలుసుకోవాలని, అసలీ అచ్చమాంబ ఎవరు? అంటూ తవ్వనారంభించి, ఆవిడ రాసిన భారతీయ స్త్రీల చరిత్ర గ్రంథం "అబలా సచ్చరిత్ర రత్నమాల' చూసి మరింత ఆశ్చర్యానికి గురయ్యాను.

అచ్చమాంబకు సంబంధించి అన్వేషి లైబ్రరీలో అందుబాటులో వున్న సమస్తాన్ని ఫోటోకాపీ చేయించి తెచ్చుకుని నా లైబ్రరీలో భద్రపరుచుకున్నాను. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ "ఆంధ్ర కవయిత్రులు", 'అబలా సచ్చరిత్ర రత్నమాల", హిందూసుందరి పత్రికలు అన్నీ సేకరించుకుని ఎప్పటికైనా భండారు అచ్చమాంబ గురించి రాయాలనుకున్నాను. తర్వాత చాలాకాలం ఆ విషయం మర్చిపోయాను. 2003లో ఓ రోజు కాత్యాయనీ విద్మహే ఫోన్ చేసి "తెలుగు సాహిత్యంలో జండర్ స్పృహ" మీద జాతీయ స్థాయి యుజిసి సెమినార్ పెడుతున్నామని ఏదైనా పేపర్ స్త్రీల అంశం మీద రాయమని కోరినపుడు నేను అచ్చమాంబ మీద రాస్తానని చెప్పాను.

రిసెర్చి స్టూడెంట్స్ శోధించిన తరహాలో మళ్ళీ అచ్చమాంబ మీద దొరికిన సమాచారమంతా చదివాను. ఇంత అద్భుత, ప్రతిభామూర్తిని తెలుగు సాహిత్యం ఎంత

నిర్లక్ష్యంగా పక్కకు పెట్టేసిందో అర్ధమై ఆవేశంతో పాటు ఆవేదన కూడా కలిగింది. "తొలి తెలుగు కథకురాలు భండారు అచ్చమాంబ" పేరుతో చాలా పెద్ద వ్యాసం రాసి వరంగల్‌లో ఆనాటి యుజిసి సెమినార్‌లో చదివాను. ఆ వ్యాసం రాస్తున్నపుడు నేను అనుకోలేదు, భండారు అచ్చమాంబని, గురజాడకు పోటీగా నిలబెడతానని. గురజాడ రాసిన అన్ని కథలూ చదివాను. అచ్చమాంబ కథలూ చదివాను. ఈవిడ పన్నెండు కథలు రాసింది. ఆయన ఐదో, ఆరో రాసారు. గురజాడ 1910లో దిద్దుబాటు రాసారు. అచ్చమాంబ1902 ధనత్రయోదశి రాసింది. ఈ వాస్తవాన్ని అంగీకరించడంవల్ల గురజాడ ఖ్యాతికొచ్చిన నష్టం ఏమి లేదు. ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది అని చెప్పిన మహాకవి గురజాడ, అచ్చమాంబను కథకు ఆద్యురాలుగా ఒప్పుకోవడానికి సంశయం చూపి వుండేవాడు కాదు అన్నది వాస్తవం. ఆయనంతటి విశాలభావాలున్నవాడు.

అయితే తెలుగు సాహిత్య విమర్శకులకు అంత విశాల మనస్తత్వం లేదన్నది ఇప్పటి విషాదం. తొలి తెలుగు కథ మీద పది, పదిహేను సంవత్సరాలుగా తీవ్రమైన చర్చ జరుగుతున్నది. ఎండ్లూరి సుధాకర్ ప్రయత్నంవల్ల తొలి కథకురాలుగా తెలుగు యూనివర్సిటీ తెలుగు ఎమ్.ఏ పాఠ్యాంశంగా చేరగలిగింది అచ్చమాంబ. దీనికి సహకరించిన వారు అప్పటి తెలుగు యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆవుల మంజులతగారు.

అచ్చమాంబ ఒక్క కథలోనే కాదు మరెన్నింటిలోనో ప్రథమురాలుగా కీర్తినందుకోవలసివున్నది. ఆమె జీవించిన 30 సంవత్సరాల అతి తక్కువ కాలంలో ఆమె సాధించిన విజయాలు చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. అప్పటివరకు స్త్రీల చరిత్రలను ఎవ్వరూ గ్రంథస్థం చెయ్యలేదు. ఆమె కేవలం తెలుగు స్త్రీల చరిత్రలనే కాక,ఎన్నో కష్టాలకోర్చి వివిధ భాషల్లోని భారతీయ స్త్రీల అద్భుత చరిత్రలను సేకరించి, తెలుగీకరించి "అబలాసచ్చరిత్ర రత్నమాల" పేరుతో గ్రంథం రాసింది. తెలుగులో స్త్రీ చరిత్రలతో నిండిన మొట్టమొదటి పుస్తకమిదే. అచ్చమాంబే ప్రథమ స్త్రీల చరిత్రకారిణిగా చరిత్రలో నిలిచిపోయింది.

భారత స్వాతంత్రోద్యమం నడుస్తున్న రోజుల్లోనే అచ్చమాంబ బతికింది. అప్పటివరకు స్త్రీలకోసం సంఘాలు ఏర్పడిన దాఖలాలు లేవు. ఆ పనికి కూడా అచ్చమాంబే పూనుకున్నది. బందరులో తొలి స్త్రీ సమాజం "బృందావనం స్త్రీ సమాజం" ఏర్పాటు చేసింది. స్త్రీలను ఐక్యపరిచి, వారు ఇంటి నుండి బయటికొచ్చి ఈ సంఘాల్లో పనిచేసేలా స్ఫూర్తినిచ్చిన ఘనత అచ్చమాంబదే. ఆయా సమావేశాల్లో ఆమె యిచ్చిన ఉపన్యాసాలు చదివితే ఆమె ఎంత జ్ఞానాన్ని సంపాదించిందో, ఎన్ని విషయాల గురించి మాట్లాడేదో, 'స్త్రీవిద్య' ఆమెకు

ప్రియమైన విషయంగా ఎలా మారిందో అర్థమౌతుంది. ఈ ఉపన్యాసాలన్నింటిని హిందూసుందరి పత్రిక ప్రచురించింది. వీటన్నింటిని పుస్తక రూపంలో తీసుకురావల్సిన అవసరం ఎంతైనా వుంది.

ముఖ్యంగా అచ్చమాంబ కథల్ని సంకలనం చేసిన శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు మాత్రమే చాలదు. బోలెడన్ని ధన్యవాదాలు. ఎందుకంటే ఆయన యిచ్చిన సమాచారం ప్రకారమే జితేంద్రబాబుని కలిసాను. ఆయన ఎన్నో పుస్తకాలను ఇచ్చారు. ముఖ్యంగా నిడదవోలు వెంకట్రావుగారి అచ్చమాంబ జీవితకథ (అముద్రితం), కొమర్రాజు లక్ష్మణరావుగారి మీద వేసిన "తెలుగుతల్లి" ప్రత్యేక సంచిక, "లక్ష్మణరాయవర్ధంతి" సంచికలు నాకు ఈ పుస్తక రచనలో ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ పుస్తకం ద్వారానే రాచమళ్ళ సత్యవతీదేవి అనే సంపాదకురాలు గురించి, ఆవిడ నడిపిన తెలుగుతల్లి పత్రిక గురించి, ఆవిడ దగ్గర అడివి బాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి ప్రముఖులు సహసంపాదకురాలుగా పనిచేసారనే అపురూప విషయం తెలిసింది. శ్రీ జితేంద్రబాబుగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

ఇక అన్వేషి లైబ్రరీలో భద్రపరిచిన పాతపత్రికలు లేకపోతే ఈ పుస్తక రచన జరిగేదే కాదు. అసలు అచ్చమాంబే రంగం మీదికి వచ్చేది కాదనడం అతిశయోక్తి కాదు. అన్వేషిలో పనిచేసే రవీందర్ ఎప్పుడు కావాలంటే అప్పుడు జిరాక్స్ చేసి ఇచ్చేవారు. ఆయనకి కృతజ్ఞతలు. అలాగే లైబ్రేరియన్‌లు లక్ష్మి, కనీజ్‌లకు ధన్యవాదాలు. పుస్తకాలు ఎలా చాప్టర్లుగా విడగొట్టాలో, ఎలాంటి శీర్షికలు పెట్టాలో సూచనలిచ్చిన మిత్రురాలు శిలాలోలితకి, అచ్చమాంబ ఎంతవరకు వచ్చింది, రాస్తున్నావా? లేదా అంటూ వెంటబడిన నేస్తం గీతకి, అది వాళ్ళ స్నేహధర్మం కాబట్టి థాంక్స్ చెప్పడం లేదు. ఈ పుస్తకాన్ని డి.టి.పి. చేసిన మాధవికి, పేజీలను సక్రమంగా అమర్చి ఇచ్చిన ప్రసన్నకి థాంక్స్. డ్రాఫ్ట్ ప్రతిని పరిశీలించిన అబ్బూరి ఛాయాదేవిగారికి, మేలు ప్రతిగా నేను భావించిన దానికి ఎన్నో మార్పులు, చేర్పులు సూచిస్తూ, చక్కటి సలహాలు ఇచ్చిన కె.లలితకి మనఃపూర్వక కృతజ్ఞతలు.

చివరగా ఒక ముఖ్య విషయం గురించి రాయాలి. అది అచ్చమాంబ ప్రాంతీయతకు సంబంధించిన అంశం. అచ్చమాంబ తెలంగాణా ప్రాంతానికి చెందిన రచయిత్రి అని సంగిశెట్టి శ్రీనివాస్, ముదిగంటి సుజాతారెడ్డి, జితేంద్రగార్లతో పాటు చాలామంది కూడా భావిస్తున్నారు. దీనితో నాకేమీ అభ్యంతరం లేదు. అచ్చమాంబ పుట్టి, పెరిగిన మునగాల సంస్థానం వాస్తవంగా కృష్ణాజిల్లాలో వుండేది. ఆ తరువాత నల్గొండ జిల్లా దేవరకొండ

ప్రాంతంలో కలిసింది. అచ్చమాంబకి అయిదారేళ్ళ వయస్సున్నపుడే తల్లి ఆమెను నాగపూర్ తీసుకెళ్ళిపోయింది. మళ్ళీ ఎపుడూ ఆమె ఆంధ్రదేశం వచ్చిపోవడం తప్ప ఎక్కడా నివసించలేదు. ఆమె రచనల్లో హైదరాబాద్ ప్రస్తావన వుంది కానీ మరే తెలంగాణ ప్రాంతం గురించి రాయలేదు. ఆంధ్ర ప్రాంతాల గురించిన ప్రస్తావన ముఖ్యంగా గోదావరి తీరప్రాంతం గురించి, గౌతమి, గోదావరి గురించి రాసింది.

అచ్చమాంబ రచనలు అచ్చయిన ఆనాటి పత్రికలు హిందూసుందరి, తెలుగు జనానా, సావిత్రి మొదలైనవి ఆంధ్రప్రాంతం నుండే వెలువడడంవల్ల కూడా ఆమె ఆ ప్రాంతానికి ఎక్కువసార్లు ప్రయాణాలు చెయ్యడం, వాటిని గురించి తన రచనల్లో ప్రస్తావించడం చేసి వుండవచ్చు. తండ్రి మరణం తర్వాత. ఆయన దివాన్‌గిరీ చేసిన మునగాల సంస్థానానికి అచ్చమాంబ మళ్ళీ వెళ్ళిన దాఖలాలు ఎక్కడా లేవు.

పుట్టుక ప్రాతిపదికగా తీసుకుంటే భండారు అచ్చమాంబ తెలంగాణాకు చెందిన గొప్ప రచయిత్రి. దీనికి రెండో అభిప్రాయం లేదు. అయితే ఆమెను ప్రాంతాలకు అతీతంగానే చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆమె పుట్టుక మాత్రమే తెలంగాణలో. పెరిగింది, జీవించింది,రచయిత్రిగా రాణించింది మహారాష్ట్రలో, అక్షరబద్ధం చేసింది భారత స్త్రీల చరిత్రలు. అందుకే నా ఉద్దేశ్యంలో అచ్చమాంబ అసమాన ప్రజ్ఞావంతురాలైన భారతీయ రచయిత్రి. నిజానికి ఆమెకు జాతీయస్థాయి గుర్తింపు రావాల్సిన అవసరం వుంది. ఈ పుస్తకాన్ని అన్ని భారతీయ భాషల్లోకి, ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువదించాల్సివుంది. ఆమెను ఎవరైనా సొంతం చేసుకోవచ్చు. ఆంధ్రప్రాంతం వాళ్ళు ఆంధ్ర రచయిత్రి అని, తెలంగాణావారు తెలంగాణా రచయిత్రి అని భావించుకోవచ్చు. ఎవరేం అనుకున్నా అచ్చమాంబ మాత్రం అనితరసాధ్యమైన మార్గంలో పయనించి, తొలి స్త్రీల చరిత్రకారిణిగా, కథకురాలుగా, స్త్రీల సమాజాల స్థాపకురాలుగా ముప్పేటహారాన్ని రీవిగా ధరించి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన దార్శనికురాలు భండారు అచ్చమాంబ.

కొండవీటి సత్యవతి
ఏప్రిల్ 2012

తెలుగు సాహిత్యంలో ధృవతార
భండారు అచ్చమాంబ

భండారు అచ్చమాంబ నూటపది సంవత్సరాల క్రితం 'అబలా సచ్చరిత్ర రత్నమాల' (భారత వీరనారీమణుల జీవిత సంగ్రహము) పుస్తకరచనకు పూనుకుంటూ, తాను ఆ పుస్తకాన్ని ఎందుకు రాయాలనుకున్నదో ఉపోద్ఘాతంలో ముఖ్యఉద్దేశ్యంగా రాసింది.

"స్త్రీలు అబలలనియు, బుద్ధిహీనులనియు, వివేకశూన్యులనియు, సకల దుర్గుణములకు నివాస స్థలమనియు గొందరు నిందింతురు. స్త్రీల పయిన మోపబడిన యీ దోషారోపణములన్నియు నబద్ధములనియు స్త్రీలలో నత్యంతశౌర్య ధైర్యవంతులు, అసామాన్య విద్యావిభూషితలును, జ్ఞానవతులును, రాజ్యకార్యదురంధురత్వము గలవారును, స్వదేశాభిమానులును, సకల సద్గుణ విభూషితలును, బూర్వముండిరనియు నిప్పుడున్నవారనియు స్థాపించుట నా మొదటి యుద్దేశ్యము."

"స్త్రీలకు విద్య నేర్పిన యెడలను, వారికి స్వాతంత్ర్యమొసగిన యెడలను వారు చెడిపోవుదురనియు, బతుల నవమానించెదరనియు, గుటుంబ సౌఖ్యమును నాశము చేసెదరనియు గొందరు మహానుభావులు వక్కాణించెదరు. ఈ యారోపణములన్నియు నిరర్థకములనియు స్త్రీవిద్య దురాచార ప్రతీకారానుకూలమగునేగాని దురాచార ప్రవృత్వనుకూలము గానేరదనియు, స్త్రీవిద్యాస్వాతంత్ర్యముల వలన మనదేశమునకు లాభమే గానీ నష్టము గలుగనేరదనియు స్త్రీవిద్య యత్యంతావశ్యకంబనియు సోదాహరణపూర్వకముగా నిరూపించుట నా ద్వితీయోద్దేశ్యము".

అచ్చమాంబ ఈ మాటలు రాసింది 1900 సంవత్సరంలో అన్నది గుర్తుపెట్టుకోవాలి. దాదాపు నూటపది సంవత్సరాల క్రితం భండారు అచ్చమాంబ స్త్రీలకోసం ఆలోచించినతీరు మిక్కిలి ఆశ్చర్యం గొలుపుతుంది. అప్పటివరకు ఎవ్వరూ పూనుకోని స్త్రీల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టి, ఆ చరిత్ర రాయడానికి గల కారణాలను చాలా స్పష్టంగా ప్రకటించింది 'అబలా సచ్చరిత్ర రత్నమాల' పుస్తకంలో.

"మనదేశంలోని స్త్రీవాద చరిత్రకారులలో ప్రథమస్థానం ఎవరిది అనే ప్రశ్నకు సమాధానం భండారు అచ్చమాంబ అని చెప్పటంలో అతిశయోక్తి లేదు." [1] స్పష్టమైన ఆలోచనలతో, ఒక రాజకీయ కారణంతో తొలి స్త్రీల, చరిత్ర రచనకు పూనుకున్న అచ్చమాంబ చదువుకున్నది అంతంత మాత్రమే. పదవఏటవరకు అక్షరం ముక్కరాని భండారు అచ్చమాంబ తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి కథ రాయడమేకాక ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా వినుతికెక్కింది. 1902-1903 మధ్యకాలంలో అచ్చమాంబ ఎన్నో వ్యాసాలను, కథలను రాసింది. అవన్నీ హిందూసుందరి, సరస్వతి, సావిత్రి, తెలుగు జనానా పత్రికలలో ప్రచురితమయ్యాయి. స్త్రీ విద్యకోసం ఆమె పడిన తపన అంతా ఇంతా కాదు. ఈ అంశమై ఎన్నో వ్యాసాలు రాసింది. ఏ ఊరు వెళ్ళినా ఆ ఊరి మహిళలను కలిపి సమావేశాలు నిర్వహించేది. స్త్రీవిద్య ఆవశ్యకత గురించి ఉపన్యాసాలు యిచ్చేది. స్త్రీలకోసం సంఘాలు ఏర్పాటు చేసింది.

"ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధించబడిన స్త్రీలు రక్షితురాండ్రు కారు. ఏ స్త్రీలు, తమ యాత్మను తామే కాపాడుకుందురో వారే సురక్షితురాండ్రు" [2] అనే అర్థమొచ్చే సంస్కృత శ్లోకంతో తన అబలా సచ్చరిత్ర రత్నమాల పుస్తకాన్ని ప్రారంభించిన అచ్చమాంబ ఎంత పురోగామి దృక్పథంతో ఆలోచించేదో, స్త్రీస్వేచ్ఛను తనదైన పద్ధతిలో ఎలా ప్రతిపాదించిందో పై పద్యం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

అచ్చమాంబ జననం, బాల్యం

భండారు అచ్చమాంబ కృష్ణా జిల్లాలోని నందిగామ గ్రామంలో 1874లో జన్మించింది. అచ్చమాంబ తాత, అమ్మమ్మలు నందిగామలో నివసించారు. ఆమె తాతగారు ఆ ప్రాంతంలోని జమిందారు పనిమీద నందిగామలో నివసించేటపుడు అచ్చమాంబ జన్మించింది. ఆమె తాతగారి స్వంత గ్రామం కంచెల. ఆమె తండ్రి తరఫు, తాత, నానమ్మల గ్రామం పెనగంచిప్రోలు.

అచ్చమాంబ పెనగంచిప్రోలు గ్రామం గురించి తన 'అబలా సచ్చరిత్ర రత్నమాల'లో వివరంగా రాసింది. పెనగంచిప్రోలు పూర్వం చాలా పెద్ద పట్టణంగా విలసిల్లిందని, అక్కడ భూమిని తవ్వినపుడు గుళ్ళరాళ్ళు, మేడల స్తంభాలు, దూలాలు, శిలాశాసనాలు బయటపడి, ఆ పట్టణం ఒకప్పుడు గొప్ప పట్టణంగా వుండేదని రాసింది. అంతేకాక కొమర్రాజుగారు

1. *ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణి - భండారు అచ్చమాంబ (1874-1904) కె. లలిత స్త్రీవాద పత్రిక భూమిక జనవరి-మార్చి 1993.*
2. *అబలా పచ్చరిత్ర రత్నమాల - భారత వీర నారీమణుల జీవిత సంగ్రహములు గ్రంథ కర్త కీ.శే. శ్రీమతి భండారు అచ్చమాంబగారు*

పూర్వకాలమునుంచీ ఆ పట్టణమే నివాసస్థలంగా కలిగి వుండేవారనికూడా అచ్చమాంబ రాసింది.

అచ్చమాంబ తండ్రి పేరు కొమర్రాజు వెంకటప్పయ్య, తల్లి గంగమాంబ. విజ్ఞాన చంద్రికా మండలిని నడిపిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు ఈమె సోదరుడు.

అచ్చమాంబ తండ్రి వెంకటప్పయ్య కృష్ణామండలంలోని మునగాల సంస్థానంలో 1880 వరకు దివాన్‌గిరి చేసారు. ఈయన పన్నెండు సంవత్సరాల పాటు దివాన్‌గిరి నిర్వహించి, గొప్ప పరోపకారిగా పేరుపొందారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి పరులకు ఉపకారం చేయాలనే సద్గుణం అచ్చమాంబకు తన తండ్రినుండి సంక్రమించిందనడంలో ఎలాంటి సందేహము లేదు. ఆమె దుఃఖాన్ని తనలోనే దాచుకోవడం చిన్నప్పటినుండే అలవరుచుకుందా అన్నట్టు - బాల్యంలో జరిగిన ఈ ఉదాహరణ చెబుతుంది.

అచ్చమాంబకి ఆరేడు ఏళ్ళ వయసపుడు ఒకరోజు ఆమెను తేలుకుట్టింది. తేలు కుట్టినపుడు నొప్పి ఎంత తీవ్రంగా వుంటుందో అందరికీ తెలుసు. అచ్చమాంబ మాత్రం దుఃఖాన్ని లోలోపలే అణుచుకుందిగానీ ఎవ్వరికీ చెప్పలేదు. పెడబొబ్బలు పెట్టి ఏడ్వకుండా లోలోపలే దుఃఖిస్తున్నప్పుడు, ఎలాగోలా యింట్లోనివారు కనిపెట్టి ఎందుకు బాధపడుతున్నావని అడిగినపుడే ఆమె తేలు కుట్టిందని చెప్పింది.

"ఇట్టి సహిష్ణుతను అప్పుడింటివారు దుర్గుణములుగా నెంచుచుండిరి గానీ యిట్టి సామర్థ్యముల వలననే యీమె తరువాత పుత్రవిహారాది సంసారిక దుఃఖములను సహింపగలిగినదని నా తాత్పర్యము" అని హిందూసుందరి సెప్టెంబరు-అక్టోబరు 1903 సంచికలో బాలాంత్రపు శేషమ్మగారు అచ్చమాంబ మీద రాసిన సంపాదకీయంలో పేర్కొన్నది.

అచ్చమాంబ చిన్నప్పటినుండే అనేక పనులు చేయడంలో చాలా ఉత్సాహం కనపరిచేది. పెద్దవాళ్ళు చేసే పనుల్లో తాను చేరి ఆయాపనులు చేయడానికి ప్రయత్నిస్తూ పెద్దల దండనలకు కూడా గురయ్యేది.

"చిన్ననాటినుండియు నిట్లు పనులయందు ఉత్సాహము గలది గనుకనే విద్యనేర్చియు గృహసంబంధమగు పనులయందును, ఉన్ని సంబంధమయిన అల్లికల పనులయందును అన్ని విధములగు పనియందును ప్రవీణయై యున్నది. ప్రస్తుతమాంధ్రమహారాష్ట్ర దేశములలో వాడుకలో నున్న పక్వాన్నములలో గానీ పిండివంటలలో గానీ యీమెకు రానిదొక్కటియు లేదని చెప్పిన స్వభావోక్తియగునేగాని యతిశయోక్తి కానేరదు." (హిందూసుందరి 1903)

అచ్చమాంబకు ఆరుసంవత్సరాల వయసపుడు ఆమె తండ్రి కొమర్రాజు వెంకటప్పయ్య మరణించారు. అపుడు ఆమె తల్లి గంగమ్మ మునగాలలో బ్రతికే వీలులేక పిల్లలిద్దరిని

తీసుకుని తన అన్న పనిచేస్తున్న గ్రామానికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది. గంగమ్మ సవతి అన్న భండారు మాధవరావు అప్పటి నైజాము రాజ్యంలోని దేవరకొండ గ్రామంలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి అప్పటికే వివాహమై భార్య చనిపోయింది. కూతురు మీనాక్షితో దేవరకొండలో వుంటున్న మాధవరావు దగ్గరికి గంగమ్మ తన ఇద్దరు పిల్లలతో చేరింది. అచ్చమాంబ బాల్యం దేవరకొండలోనే గడిచింది. అయితే బాల్యం తీరకముందే గంగమ్మ అచ్చమాంబకు వివాహం చెయ్యాలని నిశ్చయించింది. పదేళ్ళు కూడా నిండని పసిపిల్ల అయిన అచ్చమాంబకు అప్పటికే భార్య చనిపోయి, ఒక బిడ్డను కూడా కలిగివున్న మేనమామ భండారు మాధవరావుతో దేవరకొండ గ్రామంలోనే అచ్చమాంబ వివాహం జరిగిపోయింది. బాల్యం వీడని పసిమొగ్గ కొమర్రాజు అచ్చమాంబ, వివాహితయై భండారు అచ్చమాంబగా మారిపోయింది.

నాగపూర్ పయనం

వివాహానంతరం మాధవరావుకు దేవరకొండ నుండి, మహారాష్ట్రలోని నాగపూర్‌కు బదిలీ అయింది. నైజాం రాజ్యం నుండి మధ్య పరగణాకు భర్తతో కలిసి వెళ్ళింది. తల్లి, తమ్ముడు కూడా ఆమెతోపాటు బయలుదేరారు. అప్పటినుండి అచ్చమాంబ జీవనం నాగపూర్‌లోనే సాగింది. అప్పుడప్పుడు ఆంధ్రదేశానికి రావడం, మీటింగ్‌లలో పాల్గొనడం తప్ప అచ్చమాంబ ఎప్పుడూ ఇక్కడ నివసించలేదు.

చదువు : అచ్చమాంబను తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించలేదు. ఆమెకు పదిపన్నెండేళ్ళు వచ్చేవరకు అక్షరజ్ఞానమే లేదు. చిన్నవయస్సులోనే తండ్రి చనిపోవడం, ఉన్న ఊరు వొదిలిపెట్టాల్సిరావడం, అతిచిన్నవయస్సులోనే వివాహం జరగడం అచ్చమాంబను చదువుకు దూరంచేసాయి. నిజానికి ఆమెకు చదువుపట్ల అమితాసక్తి వుంది. తల్లిదండ్రులు అక్షరాలు దిద్దించకపోయినా అచ్చమాంబలో వున్న విద్యాభిలాష ఆమెను అక్షరాలకు దగ్గర చేసింది.

మగపిల్లవాడైనందున కొమర్రాజు లక్ష్మణరావుకు విద్య హక్కుగా అందుబాటులోకి వచ్చింది. ఉపాధ్యాయుడిని ఇంటికి పిలిపించి మరీ అతను చదువుకొనేలా ప్రోత్సాహమిచ్చింది తల్లి గంగమ్మ. అచ్చమాంబ తమ్ముడి చదువును, ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను శ్రద్ధగా గమనిస్తుండేది. తనంతట తాను ప్రేరణ పొందినదే గానీ ఎవ్వరి ప్రోత్సాహం ఆమెకు లేదు. వినికిడి ద్వారానే పాఠాలు నేర్చుకుని అచ్చమాంబ తమ్మునికంటే ముందే వాటిని వప్పచెబుతూండేది. లక్ష్మణరావును మించిన తెలివితేటలు ప్రదర్శించేది. కొన్నిరోజులు గడిచేటప్పటికి తెలుగు, హిందీ భాషలు నేర్చుకొంది. క్రమక్రమంగా సంస్కృతం, మరాఠి, గుజరాతీ భాషలను నేర్చుకోగలిగింది.

"ఆమెయంత బుద్ధిసూక్ష్మము గలదయిన మన పద్ధతులను బట్టి యింగ్లీషు మొదలగు గొప్ప విద్యను నేర్చుకొనలేకపోయెను. తమ్ముడు ధనవంతుడగుటచే ఎం.ఏ. పట్టమునందెను." అని అచ్చమాంబ మరణించి నపుడు హిందూసుందరి సంపాదకీయంలో రాసింది.

తమ్ముడితో కలిసి చదువుకునే అవకాశం కూడా లేకుండా పోయింది అచ్చమాంబకు. భర్త ఉద్యోగరీత్యా ఆమె అతనితోపాటు తిరుగుతూ వుంటే లక్ష్మణరావు నాగపూర్‌లోనే వుంటూ తన చదువును కొనసాగించాడు. ఎం.ఏ. పాస్ అయ్యాడు. అచ్చమాంబ సంసార జీవితంలో మునిగిపోయింది. ఈ విషయాల గురించి తన అబలా సచ్చరిత్ర రత్నమాలలో ఈ విధంగా రాసింది.

స్త్రీలు నైసర్గిక మూర్ఖురాండ్రని చెప్పుట కంటే నేటివరకు స్త్రీలకు బాల్యము నుండియు విద్యాగణితమునించుక సోకనియ్యనందున వారు మూర్ఖురాండ్రుగా గానుపించెదరని చెప్పవచ్చును. బాలురకంటె బాలికలెప్పుడును బుద్ధిహీనులుగా నుండరు. బాల్యమునందాడుపిల్లయెట్టి బుద్ధి వైభవము గలదయినను తలిదండ్రులు దానికెంత మాత్రమును విద్యనేర్పక జ్ఞానాభివృద్ధికిందగిన యుపాయములేవియు జేయనందున నది వివేకహీనురాలగుచున్నది. బాలుడు చిన్నతనమునందెంత మందబుద్ధియైనను వానికైదేండ్లు రాగానే తలిదండ్రులు విద్య నేర్పి వానికి గల మాంద్యమును వదిలించి జ్ఞానాభివృద్ధి కొరకు శాస్త్రములు చదివింతురు. కాన వాడు మిక్కిలి ప్రజ్ఞావంతుడయి ప్రసిద్ధుడగును. చిన్ననాడు వానికంటే విశేషప్రజ్ఞగలవానియనేక్క మాత్రము విద్యాగంధమేమియు లేనందున మహా మూర్ఖశిరోమణియై యుండును. ఇట్లు తలిదండ్రుల పక్షపాతముచే బురుష సంతతిలోను స్త్రీసంతతిలోను జ్ఞానమును గురించి మహదంతరము పడినదే గానీ స్త్రీల స్వాభావిక మూర్ఖమువలన కాదు. కాన స్త్రీలకును బక్షపాతరహితులయి పురుషులు విశేషవిద్య నేర్చినచో స్త్రీలును అసామాన్య బుద్ధిచాతుర్యములను జూపి పురుషులకనేక విషయములలో సహాయముచేసి యర్ధాంగులన్న నామమును సార్థకపరుతురని నొక్కివక్కాణించుటకు సందేహము లేదు."

'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథం రాస్తూ అచ్చమాంబ ప్రకటించిన పై అభిప్రాయాలు ఎంత పురోగామి దృక్పథంతో వున్నాయో అర్థమౌతుంది. స్త్రీల వెనుకబాటుతనానికి, వారి అజ్ఞానానికి మూలకారణం వారికి జ్ఞానాన్ని అందివ్వకపోవడమేనని, తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల కనబరిచే వివక్షే దీనికి కారణమని చాలా స్పష్టంగా ప్రకటించింది. తాను విద్యకు దూరమై తన తమ్ముడు ఉన్నతవిద్య చదువుకోగలగడం వెనకవున్న కుటుంబ వివక్షను ఇంత సూటిగా విశ్లేషించిన అచ్చమాంబ బతికిన కాలాన్ని

పరిగణనలోకి తీసుకుంటే (పందొమ్మిదో శతాబ్దం) ఆమె ఆలోచనలు ఎంత తీక్షణమైనవో గమనించవచ్చు. ఆడపిల్లల్ని వివక్షతో పెంచవద్దని, వారికి విద్యాబుద్ధులు చెప్పించాలని, బాల్యవివాహాలు చెయ్యొద్దని తాను బతికినంత కాలం రాస్తూనో, చెబుతూనో వుంది అచ్చమాంబ. ఆనాడు అచ్చమాంబ అంత అభ్యుదయకరంగా ఆలోచించి, స్త్రీవిద్య గురించి గళమెత్తినా ఈనాటికీ అవే పరిస్థితులు కొనసాగడం, వందేళ్ళు గడిచినా మహిళల నిరక్షరాస్యత నిర్విఘ్నంగా కొనసాగడం గొప్ప విషాదం.

తిరిగి అచ్చమాంబ చదువులోకి వద్దాం. తమ్ముడి చదువు సమయంలో నేర్చుకున్న భాషల్ని వృథా పోనీయకుండా, తానుండే నాగపూర్ ప్రాంతంలో హిందీ, మరాఠీ భాషలు మాట్లాడే స్త్రీలతో కలిసి మరాఠీలో వుండే భక్తిసాహిత్యాన్ని చదివేది. చుట్టుపక్కలుండే మహిళల్ని ఇంటికి పిలిచి ఆయా భక్తికథల్ని వారికి చదివి వినిపించేది. ఆమె చుట్టూ ఎలాంటి తెలుగు వాతావరణం లేకున్నా, హిందీ, మరాఠీ మాట్లాడేవారే వున్నప్పటికీ అచ్చమాంబకు తెలుగుపట్ల వల్లమాలిన ప్రేమవల్ల మంచి తెలుగు వచనం రాయడం నేర్చుకుంది. తన తల్లికి భారత భాగవత రామాయణాలు చదివి వినిపించగలిగినంత భాషాజ్ఞానాన్ని అచ్చమాంబ సంపాదించింది. తెలుగు మాట్లాడని ప్రాంతాల్లో వుంటూనే చక్కటి వచనంలో పన్నెండు కథలు రాయగలిగిందంటే ఆమె పట్టుదల ఎలాంటిదో అర్థమవుతుంది. "హిందూ సుందరి" పత్రికకి తరచూ వ్యాసాలు పంపిస్తుండేది. ఆ వ్యాసాల నిండా స్త్రీవిద్య గురించి, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి చర్చించేది అచ్చమాంబ.హిందూసుందరి, సావిత్రి, సరస్వతి, తెలుగు జనానా పత్రికల్లో అచ్చమాంబ కథలు ప్రచురితమయ్యేవి.

అచ్చమాంబ చదువు నేర్చుకోవడం సాంప్రదాయభావాలుండే భర్త మాధవరావుకు నచ్చేది కాదు. ఆమె చదువుకోరాదని అభ్యంతరాలు పెట్టేవాడు. చదువుకుంటే స్త్రీలు చెడిపోతారని అతని నిశ్చితాభిప్రాయం. అతనింట్లో లేనపుడు, క్యాంపులకు వెళ్ళినపుడు పుస్తకాలు చదువుతుండేది. మాధవరావుకు ధార్మిక విషయాల పట్ల వుండే ఆసక్తి వల్ల ఆర్యసమాజానికి సంబంధించిన అనేక గ్రంథాలు ఇంట్లో వుండేవి. ధర్మం, తత్త్వం గురించి ఆ పుస్తకాలలో చాలా సమాచారముండేది. ఆ పుస్తకాలను చదివేది. మరాఠీ భాష నేర్చుకున్నందున సంఘ సంస్కరణకు సంబంధించిన మరాఠీ గ్రంథాల నెన్నింటినో అచ్చమాంబ చదివింది. ముఖ్యంగా మరాఠీలో ప్రముఖ గ్రంథమైన, ఒక స్త్రీ రాసిన 'ఆనందీబాయి చరిత్రము' అచ్చమాంబ మీద చాలా ప్రభావం చూపింది. ఈ గ్రంథం చదివిన తర్వాత అచ్చమాంబ ఆలోచనల్లో కొట్టొచ్చిన మార్పు కనిపిస్తుంది. స్త్రీవిద్య, స్త్రీ

స్వాతంత్ర్యాలను గురించి చాలా ఆలోచించేది. ఈ పుస్తక ప్రభావం అబలా సచ్చరిత్ర రత్నమాలలో ప్రస్ఫుటంగా కనబడుతుంది. మరాఠీ సాహిత్య అధ్యయనం వల్ల అక్కడి సంస్కరణవాదం, జనజాగరణ ఉద్యమ ప్రభావం అచ్చమాంబ మీద బలంగానే పడింది.

తన చదువును వ్యతిరేకించిన భర్తను నొప్పించకుండానే అతని పరోక్షంలో తన గ్రంథపఠనం కొనసాగించిన అచ్చమాంబ భర్తతో సామరస్యంగానే వుండేది. అతనికి కావలసిన సేవలు చేసేది. అతని వ్యతిరేకతని సహనంతోనే ఎదుర్కొని అతనిలో మార్పు వస్తుందని ఆశించేది. తన ప్రవర్తనతో మాధవరావు మనస్సును మార్చింది కూడా. ఈ మార్పువల్లనే ఆ తరువాత ఆమె చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. శెలవుల్లో ఆంధ్రాకి వచ్చినపుడు ఆమె సమావేశాలు, ఉపన్యాసాల్లో మునిగి తేలుతుండేది. స్త్రీలకోసం సంఘాలను స్థాపించింది.

చిన్నవయసులోనే వివాహం చెయ్యడం వల్ల, కుటుంబంలో ఆడ, మగపిల్లల మధ్య వ్యత్యాసం చూపడం వల్ల తాను చదువుకొనలేకపోయాననే అవగాహన అచ్చమాంబకు స్పష్టంగానే ఏర్పడింది. పైగా సంసారభారం, భర్త నుంచి వుండనే వున్నాయి. అయినప్పటికీ విద్యపట్ల గొప్ప వ్యామోహంతో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుండేది అచ్చమాంబ. చదివిన విషయాల ప్రభావంతో ఏదో ఒకటి రాస్తూ వుండేది. వేసవి శెలవుల్లో లక్ష్మణరావు తమ ఇంటికి వచ్చినపుడు ఎన్నో పుస్తకాలు తెచ్చేవాడు. అతనిని కొత్త కొత్త విషయాలు చెప్పమని అడుగుతుండేది. తమ్ముడు చెప్పే కొత్త సంగతుల ద్వారా తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేది. ఈ విధంగా అచ్చమాంబ తన కృషి, ప్రయత్నాల ద్వారా విద్యను అభ్యసించింది గాని ఎవరి ప్రోత్సాహం వల్లను కాదు. భర్త తన చదువును అభ్యంతరపెట్టినప్పటికీ అచ్చమాంబ తన గ్రంథం "అబలా సచ్చరిత్ర రత్నమాల"ను తననెంతో ప్రోత్సహించిన వాడిగా పేర్కొంటూ అతనికే అంకితమిచ్చింది.

"అటు ప్రాచీనమైన సతీధర్మమును ఇటు నవీనమైన పాశ్చాత్య విద్యాసంస్కారమును నీరెండింటిని అత్యద్భుతముగా అనుపమానముగా ప్రదర్శించి ఆదర్శ మహిళ అయినది" అని "సావిత్రి" పత్రికను నడిపిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ ప్రశంసించింది.

సాహితీవ్యాసంగం

అచ్చమాంబ ఎప్పుడు రచనావ్యాసంగం చేపట్టిందో తెలిపే స్పష్టమైన ఆధారాలేమీ లేవు. ఆమె తన 24వ ఏట నుండే రచనలు ప్రారంభించినట్టు కొన్ని రచనలవల్ల అర్థమవుతోంది. ఈమె రచనలు ఎక్కువగా హిందూసుందరి పత్రికలో ప్రచురితమవుతూండేవి. అచ్చమాంబ రాసిన కథలు తెలుగు జనానా, హిందూసుందరి, సావిత్రి పత్రికలలో కూడా ప్రచురితమవుతూండేవి. అచ్చమాంబ రాయడం ఎప్పుడు మొదలుపెట్టిందో చెప్పలేము

కానీ 1898-99 మధ్య మొదలుపెట్టినట్టు కనిపిస్తోంది. దాదాపు ఆరు సంవత్సరాలపాటు ఆమె వివిధ ప్రక్రియల్లో రచనలు చేసింది. కథలు, వ్యాసాలు, ఒక శతకం కూడా రాసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె రాసిన పది కథలు మాత్రమే లభ్యమవుతున్నాయి. హిందూసుందరి ప్రతి సంచికలోను ఆమె రచనలు వుండేవి. ఆమె రాసిన శతకం మాత్రం దొరకడం లేదు. అచ్చమాంబ క్రోషో అల్లిక మీద, ఊలు అల్లికమీద రెండు పుస్తకాలు రాసింది. అవి కూడా లభ్యమవ్వడం లేదు.

'అబలా సచ్చరిత్ర రత్నమాల' పుస్తకం రాయడం వెనక ఎంతో విషాదభరితమైన చరిత్ర వుంది. అచ్చమాంబకు అత్యంత యిష్టురాలైన మాధవరావు మొదటి భార్య కూతురు మీనాక్షి భర్త చనిపోవడం ఆమెనెంతో బాధించింది. ఆ దుఃఖంలో వుండగానే అతిచిన్న వయసులోనే ఆమెకు పుట్టిన కొడుకు, కూతురు అకాల మరణం పాలవ్వడం ఆమెను శోకసముద్రంలో ముంచేసింది. తానే ఇంకా చాలా పిన్నవయస్కురాలు. అలాంటిది తన కడుపున పుట్టిన పసివాళ్ళ మరణం ఆమెను కుంగదీసింది. అయితే అచ్చమాంబ గర్భశోకం నుంచి బయటపడటానికి చేసిన ప్రయత్నం మాత్రం చాలా అపూర్వమైంది. మరొకరైతే ఎంతోకాలం ఆ దుఃఖాన్నే మోస్తూ మానసికంగా కూడా కుంగిపోయి వుండేవారు.

మన అచ్చమాంబ ధీరురాలు. పట్టుదల కలిగింది. తన శోకం నుండి బయటపడటానికి గ్రంథరచనను సాధనంగా ఎంచుకుంది. అప్పటికే కథలు, వ్యాసాలు విరివిగా రాస్తూ వుంది. అవేవీ పుస్తకరూపంలో రాలేదు. స్త్రీల చరిత్రను రాయడానికి సంకల్పించింది. నిజానికి అచ్చమాంబకు ముందు స్త్రీల చరిత్ర ఎవ్వరూ రాసిన దాఖలాలు లేవు.

"చరిత్ర రచనయనిన మగవారికే మిక్కిలి కష్టతరము కదా. అట్టియెడ స్త్రీలలో ప్రథమముగా చరిత్ర రచించి చక్కగా రచనను నిర్వహించినదనుఖ్యాతి పొందినది. స్త్రీలలో చరిత్ర రచించిన ప్రథమ గౌరవమీమెదే."[3] చరిత్ర రచన ఎంత కష్టమో అందరికీ తెలిసిన విషయమే. రవాణా సదుపాయాలు, కమ్యూనికేషన్స్ సరిగ్గాలేని ఆ రోజుల్లో అచ్చమాంబ ఎంత కష్టపడి సమాచారాన్ని సేకరించిందో అంచనాకు దొరకదు.

"అచ్చమాంబ గారు పుత్రపుత్రికా వియోగదుఃఖమున నుండగా నీమె ప్రాణతుల్యుడగు సోదరుడు లక్ష్మణరావు గారొకనాడొక ప్రసంగ వశమున నాగోజీభట్టు కృతకమగు "శబ్దేందు శేఖరః పుత్రో మంజూషా మమ కన్యకా" అను శ్లోకమును జదివి నాగోజీభట్టుగారు తనకు పుత్రపుత్రికా వియోగము గలుగగా దను రచించిన "శబ్దేందు శేఖర"యను గ్రంథమును తన పుత్రుడుగాను, "మంజూష"యను గ్రంథము తన పుత్రికగాను నుండునని మనస్సమాధానము చేసికొనునట్లు చెప్పగా, నాటినుండియు అచ్చమాంబగారు

3 అబలా సచ్చరిత్ర రత్నమాల - భండారు అచ్చమాంబ

నాగోజిభట్టుగారివలెనే తానును మనస్సమాధానము పొందవలెనని కోరి 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రచనకు గడగిరట."[4]

అచ్చమాంబ తన ప్రబల ప్రయత్నంతో దుఃఖం నుండి బయటపడడమేకాక తొలి స్త్రీలచరిత్రను గ్రంథస్థం చేయడానికి నడుం కట్టింది. అప్పటికి ఆమె వయస్సు 25 సంవత్సరాలు కూడా వుండవు. ఇంత చిన్నవయస్సులో చరిత్ర రచనకు పూనుకున్న అచ్చమాంబ కృషి అపూర్వం, అపురూపంగా అర్థం చేసుకోవాలి. ప్రయాణసౌకర్యాలు సక్రమంగా లేని 19వ శతాబ్దంలో సమాచారసేకరణ చాలా కష్టంతో కూడుకున్నది. పైగా అచ్చమాంబ తెలుగుదేశానికి వెలుపల నివసిస్తోంది. 1903లో కుటుంబంతో సహా దేశమంతా తిరిగినపుడు, అవకాశం దొరికినపుడల్లా పండితులతో చర్చలు చేసేది. వారినుండి పురాణకాలంలో స్త్రీల గురించిన సమాచారాన్ని సేకరించింది. మేధావులనుండి సేకరించిన మొత్తం సమాచారంతో మూడు భాగాలుగా స్త్రీల చరిత్రను రాయాలనేది అచ్చమాంబ సంకల్పం.

ఆ మూడు భాగాలను ఈ క్రింది విధంగా రాయాలని ప్రణాళిక వేసుకుంది.

"నేను వ్రాసెడి ఈ చరిత్రములలో ననేకములు మహారాష్ట్రభాష నుండియు, హిందీభాషనుండియు నాంధ్రీకరింపబడును. కనుక, నీ చరిత్రములయందలి యుత్తమ భాగములకయి యాయా భాషలలోని గ్రంథకర్తలను మెచ్చవలయునేగానీ నన్ను శ్లాఘింపవలసిన పని యెంత మాత్రమును లేదు" అంటూ ఎంతో వినయంతో 'అబలా సచ్చరిత్ర' ముందుమాటలో రాసుకుంది. మరాఠి నుండి, హిందీ నుండి ఎంతో సమాచారాన్ని అనువాదం కూడా చేసిన అచ్చమాంబ తనను శ్లాఘించవలసిన పనిలేదని, మూలరచయితలే అందుకు తగినవారని చెప్పడం ఆమెలోని వినయసంపదను తెలియచేస్తుంది. తాను చేసిన ఈ ప్రయత్నం ఎంతో విలువైందని, అంతవరకు తెలుగుసాహిత్యంలో ఎవ్వరూ స్త్రీల చరిత్రను గ్రంథస్థం చెయ్యలేదనే విషయం అచ్చమాంబకు తెలుసు. అయినాసరే ఆమె ఎక్కడా తన గొప్పతనాన్ని గురించి రాసుకోలేదు.

ఆమె రాయాలని తలపెట్టిన మూడుభాగాల గురించి తానే ఇలా రాసుకుంది.

"ఇట్టి రత్నమాలలు మూడుగుచ్చి జనులకు సమర్పింపవలయునని నేదలచితిని. అవియేమి యనిన :-

అబలా సచ్చరిత్ర రత్నమాల యొక్క మొదటిభాగము :

ఇందు హిందూ దేశమునందు బుట్టిన యైతిహాసిక స్త్రీల చరిత్రములుండును. ఐతిహాసిక కాలమనగా వేయిసంవత్సరములనుండి నేటివరకు జరిగిన కాలము. ఈ

4 శ్రీమతి పులుగుర్త లక్ష్మీనరసమాంబగారి ఆధ్వర్యంలో నడిచిన 'సావిత్రి పత్రిక'

భాగమునందు పద్మావతి, సంయుక్త మొదలైన ప్రాచీన స్త్రీలు మొదలుకొని, ఆనందీబాయి మొదలైన యర్వాచీన స్త్రీల వరకునయిన యుత్తమ స్త్రీల చరిత్రములు రాగలవు.

రెండవభాగము : ఇందు వైదిక, పౌరాణిక, బౌద్ధ స్త్రీల యొక్కచరిత్రములు రాగలవు. వైదిక స్త్రీలనగా వేదమందు వర్ణింపబడిన గార్గి, మైత్రేయి మొదలైన స్త్రీలు, పౌరాణిక స్త్రీలనగా పురాణాదులలో వర్ణింపబడిన పార్వతి, సీత, తార, దమయంతి, ద్రౌపది మొదలయిన స్త్రీలు.

మూడవభాగము : ఇందు ఇంగ్లండు మొదలయిన పరదేశములలోని స్త్రీల చరిత్రములుండగలవు.

అచ్చమాంబ ఎంతో పకడ్బందీ ప్రణాళికతో 'అబలా సచ్చరిత్ర రత్న మాల'ను మూడుభాగాలుగా రాయడానికి సంకల్పించుకుని అందుకవసరమైన సమాచారాన్ని ఎంతో కష్టపడి సంపాదించింది. మొదటిభాగం పూర్తిచేసి 1901లోనే పుస్తకరూపంలో ప్రచురించింది. రెండవభాగంలో కొంత 'సావిత్రి' పత్రికలో ప్రచురింపబడింది. రెండవభాగం రాస్తున్నపుడే వేదాలనుండి, పురాణాలనుండి సమాచారం సేకరించడం చాలా కష్టమైంది అచ్చమాంబకు. "ఏ గ్రంథమును వ్రాసినను బూర్తిగా సంగతులు గనుగొని వ్రాయవలయుననియు, వ్రాసిన సంగతులు విశ్వాసార్హములుగా నుండవలయుననియు నీమె యుద్దేశ్యము. కావున, నీమె యే వేదవాక్యమునుదహరించినను, ఏ పురాణ శ్లోకములనుదరించినను బ్రత్యక్షముగా నాయా వేదముల యందు, నాయా బురాణములయందు జూడనిది వ్రాయునది కాదు. ఒక్కొక్క వేదవాక్యమును సంపాదించుట కెన్నియో నెలలు పట్టుచుండెను." – పులుగుర్త లక్ష్మీనరసమాంబ, అబలా సచ్చరిత్ర రత్నమాల గ్రంథం ముందుమాటలో రాసింది. అంత కష్టపడి అచ్చమాంబ సమాచార సేకరణ చేసేది.

1903 వ సంవత్సరంలో పుణ్యక్షేత్రాలు చూడటానికి కాశీ వెళ్ళింది. అటునుంచి తన స్నేహితురాళ్ళను చూడడానికి కృష్ణా, గోదావరి జిల్లాలకు వచ్చింది. అలా ప్రయాణాలు చేసేటప్పుడు, ముఖ్యంగా కాశీలో కొన్ని రోజులుండిపోయి, వేదకాలస్త్రీల సమాచారాన్ని అక్కడి పండితులతో చర్చలు జరపడం ద్వారా సంపాదించింది. పండితుల నుండి నేర్చుకొన్నదానిని అలాగే రాయకుండా మరికొన్ని పరిశీలనలను చేసేది. ఉదాహరణకు ఋగ్వేద సంహితలోని కొన్ని మంత్రాల గురించి రాయాలనుకుంది. అలా రాసేముందు ఆ మంత్రాల నిజానిజాలు కనుక్కోవడానికి ఏకంగా ఋగ్వేద సంహిత కోసం వెదకడం మొదలుపెట్టింది. చివరికి హైదరాబాదు నుండి ఋక్‌సంహితను బోలెడు డబ్బు ఖర్చుపెట్టి తెప్పించుకున్నది. రెండోభాగం రాస్తున్న సమయంలోనే తెలుగుప్రజల దురదృష్టంవల్ల ఆమె మరణం పాలయ్యింది.

అబలా సచ్చరిత్ర రత్నమాల మొదటిభాగంలో ఆమె ముప్పైనాలుగుమంది చారిత్రక స్త్రీల చరిత్రలను రాసింది. వీరందరూ భారతదేశంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు. ఎన్ని కష్టాలుపడి వీరి చరిత్రలు సంపాదించిందో, తెలుగుదేశంలో కూడా నివసించని ఆమె ఎంత కష్టపడిందో మనం అంచనా వేయలేం. ఒక్కొక్కస్త్రీమూర్తి చరిత్రను ఎంతో వివరంగా, ఎంతో ఆర్ద్రంగా రాసింది.

ఈ పుస్తకాన్ని 'వీరమతి' చరిత్రతో ప్రారంభిస్తూ అచ్చమాంబ "పురుషులవలె ధైర్యము నవలంబించి, భీతిచెందక సర్వకార్యములను నిర్వహించునటుల స్త్రీలకు విద్య నేర్పవలయును." (స్త్రీయ స్తథా పాఠనీయా యథాతాः కార్యవస్తుని, పుంవత్ ప్రవృత్తి మాథాయ సాధయేయు రనాకులాः) స్త్రీవిద్య ఆవశ్యకతను నొక్కిచెబుతూ ప్రారంభించిన చరిత్ర రచన ఎన్నో అంశాలను స్పృశిస్తూ ముందుకు సాగింది.

బెంగాలీ కవయిత్రి తోరుదత్తు చరిత్రను కడు రమ్యంగా రాసిన అచ్చమాంబ మధ్యమధ్య తన అభిప్రాయాలను జోడించడం కనబడుతుంది. తోరుదత్తను తండ్రి పెంచిన విధం గురించి రాస్తూ....

"పుత్రికలను పుత్రులవలె జూచుటయే శాస్త్రధర్మము, కన్యా వివాహసమయమునందు తండ్రి 'పుత్రవత్పాలితామయా' 'పుత్రునివలె నాచే పెంచబడిన కన్య' యని చెప్పుట సర్వప్రసిద్ధమే కదా. 'యథా వాత్మా తథా పుత్రः పుత్రేణ మహితా సమా' తనతో సమానుడు పుత్రుడు. పుత్రునితో సమానము కూతురు" అని మనువు రాసాడని చెబుతూ

"శాస్త్రములిటుల ఘోషించుచుండగా మనదేశమునందు బాలికలను బాలురకంటే నతినీచముగా జూచుట చూడ కడు బాధాకరముగా నుండక మానదు. కుటుంబంలో ఆడపిల్లల్ని ఎంతోవివక్షతో పెంచుతారనే విషయాన్ని, ఆడపిల్ల పుట్టుకని సంకటంగా భావిస్తారని అచ్చమాంబ ఎన్నోసార్లు, ఎన్నో రచనల్లో చాలా ఆవేదనతో రాసింది.

అచ్చమాంబ స్త్రీలకు సంబంధించిన ప్రతి అంశం గురించి రాస్తూ, వెనక వున్న శాస్త్రాలను, శాస్త్రసమ్మతుల గురించి లోతుగా అధ్యయనం చేసింది. తాను రాయదలుచుకున్న విషయాలకు దన్నుగా శాస్త్రాలను పేర్కొనడం ద్వారా తన వాదనకు బలాన్ని చేకూర్చుకునేది.

'విద్యాసాగరజనని భగవతీ దేవి' అనే వ్యాసంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తల్లి గురించి రాస్తూ ఆమె బాలవితంతువుల అంశాన్ని లేవనెత్తింది. స్త్రీపునర్వివాహం శాస్త్రసమ్మతమని నిరూపించే పరాశరస్మృతిలోని ఒక శ్లోకాన్ని వెతికి పట్టుకుంది.

"న షే మృతే సుప్రజతే క్లీచె చ పతితే పతే
పంచ స్వాపత్సు దారణాం పతి రన్యో విధేయతే"

స్త్రీ పునర్వివాహము తప్పక జరుపవలెనని ఈ శ్లోకంలో పరాశరుడు పేర్కొన్నాడని, స్త్రీలను నిర్బంధ వైధవ్యానికి బలిచేయడం అన్యాయమని అచ్చమాంబ ఈ వ్యాసంలో ప్రస్తావించింది.

ప్రాచీనకాలంలో ఆర్యులకంటే అనార్యులే జ్యోతిషశాస్త్రమందు విశేష పాండిత్యం కలిగి వుండేవారని చెబుతూ 'ఖనా' అనే జ్యోతిశ్శాస్త్ర పండితురాలి చరిత్రను అచ్చమాంబ రాసింది. ఆమె జ్యోతిష్యంలో వరాహమిహిరుడి కన్నా ఎక్కువ ప్రతిభ కనబరిచింది. కేవలం స్త్రీగా పుట్టినందువల్ల, తన అసమాన ప్రజ్ఞను సహించలేనితనం వల్ల ప్రాణాలను కోల్పోయింది ఖనా. గణితంలో పండితురాలైన ఖనా గురించి ఇలా రాసింది అచ్చమాంబ.

"ఖనా యొక్క బుద్ధి యిట్టి గహన విషయమునందింత సులభముగా ప్రవేశించుట జూడగా స్త్రీల బుద్ధి పురుషుల బుద్ధి కంటే మందమనియు, నాడువారి మెదడు (మస్తిష్కము) మగవారి మెదడుకంటే బలహీనమనియు, తక్కువ తూగుననియు నందువలన పురుషులకు తెలిసినంతటి జ్ఞానము నతివలకు తెలియుట సంభవింపదనియు జెప్పువారి మాటలన్నియు బక్షపాత వచనములని నిర్వివాదముగా చెప్పవచ్చును."

సమాజంలో స్త్రీల పట్ల వ్యక్తమయ్యే చులకన భావాలను, వివక్షాపూరిత దృక్పథాలను అచ్చమాంబ తీవ్రంగా ఖండించిన తీరు మిక్కిలి ప్రశంసనీయం. స్త్రీలకు మెదడు చిన్నగా వుంటుందని, వారిలో పురుషులకుండేంత మేధస్సు వుండదనే తప్పుడు అభిప్రాయాలను 'ఖనా' చరిత్ర రాయడం ద్వారా అచ్చమాంబ ఖండించింది.

అంతేకాకుండా బాలికలను చిన్నప్పటినుంచి విద్యాగంధము సోకనీయకుండా ఇంటికే పరిమితం చేసి పెంచడంవల్ల వారిలో జ్ఞానం ప్రకాశించే వీలు వుండదని, అదే బాలురైతే విద్యను హక్కుగా పొందడంవల్లను, అనేక శాస్త్రములను చదివే వీలు కల్పించడం వల్లను జ్ఞానం పొందుతున్నారని నిక్కచ్చిగా చెబుతుంది. దీనికి బిడ్డల పెంపకంలో తల్లిదండ్రులు చూపించే వివక్షే కారణం తప్ప ఆడపిల్లలు స్వాభావిక మూర్ఖులు కాదని గట్టిగా వాదిస్తుంది అచ్చమాంబ.

'ఖనా' చరిత్రలో స్త్రీల బుద్ధికుశలత గురించి, మేధస్సు గురించి వర్ణించిన అచ్చమాంబ, తరిగొండ వెంగమాంబ జీవితచరిత్రలో ఆమె పాండిత్యం గురించి రాసింది. బాలవితంతువైన వెంగమాంబ జీవితాంతం తన జుట్టును తీయనీయలేదని 'పరమేశ్వరుడిచ్చినవి మనుజులేల తీయవలెనని వాదించేదట. ఈ జుట్టు తీసివేసే దురాచారాన్ని అచ్చమాంబ తీవ్రంగా దుయ్యబట్టింది. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో వుండే భార్యను అందవిహీనం కావించి, ఆమెకు తెల్లబట్టలు కట్టి, జుట్టు కత్తిరించడం అన్యాయమని, ఈ దురాచారం సహగమనం కంటే క్రూరమైనదని విమర్శిస్తుంది.

"మనదేశములోని స్త్రీలకు గలుగుచుండిన యీ వ్యసనకరమగు అవమానమును తొలగింప బ్రయత్నింతురు గాత" అని ఆశిస్తుంది.

అచ్చమాంబ స్త్రీల పక్షపాతి. ఎక్కడ వీలు దొరికితే అక్కడ స్త్రీలు, పురుషులకంటె దేనిలోను తక్కువకాదని నొక్కి చెబుతూ వుండేది. చరిత్ర పొడవునా ధైర్యవంతులు, శౌర్యవంతులు, ప్రతిభావంతులు వివిధ రంగాలలో విలసిల్లారని వారిని గుర్తించకుండా స్త్రీలు హీనులనే ప్రచారాన్ని పురుషులు చేస్తూ వచ్చారని చెబుతూ, రుద్రమదేవి చరిత్రలో ఇలా రాసింది.

"ఈమె మన యాంధ్రదేశంబునకు శిరోరత్నమని చెప్పుటకెంతమాత్రము సందియము లేదు. స్త్రీలలో నిట్టివారుందురని ప్రత్యక్ష ప్రమాణము వలన నెరిగియు మనవారు స్త్రీలను హీనముగా జూచుట మిగుల శోచనీయము" అంటుంది.

అచ్చమాంబ మీద అమితమైన ప్రభావం చూపిన డాక్టర్ ఆనందీబాయి జోషి జీవితచరిత్రను ఎంతో ఉద్వేగంతో రచించినట్టు కనబడుతుంది. అచ్చమాంబలాగానే ఆనందీబాయి కూడా చిన్నవయస్సులో మరణించింది. భర్త సహకారంతో ఉన్నత విద్యనభ్యసించిన ఆనందీబాయి, వైద్యవిద్య చదవడానికి అమెరికా వెళ్ళాలని నిశ్చయించుకుంది. దీనికి భర్త తోడ్పాటు చాలా వుంది. అయితే ఒక బ్రాహ్మణ స్త్రీ అమెరికాలాంటి దేశానికి వెళ్ళడం ఆమె బంధుమిత్రులకు ఇష్టంలేదు. తాను అమెరికా ఎందుకు వెళ్ళాలనుకుంటున్నదో ఒక మీటింగ్ పెట్టి వివరించడం అద్భుతం. అన్ని అడ్డంకులను ఎదిరించి ఆనంది అమెరికా వెళ్ళి వైద్యవిద్య పూర్తిచేసి రావడం ఆ రోజుల్లో ఎంతో అపూర్వమైన విషయం.

"చూచితిరా! యీ ధైర్యవతి సాహసము. ఇట్టి రత్నములనేకములు మనదేశమునందు గలవు. కాని యా రత్నములను సానబెట్టి ప్రకాశింపచేయుటకు గోపాలరావు (ఆనందీబాయి భర్త) వంటివారు లేనందున నా రత్నములును రాళ్ళవలె కానిపించుచున్నవి..... ఇట్లే యుత్తమ సతి దేశదేశాంతరములయందు గీర్తిగాంచి విద్యచే స్త్రీలు బాగుపడుదురేగానీ చెడిపోరనియు, దుర్గుణములకు విద్య విరోధమేగాని విడలేని మైత్రిలేదనియు, స్వచరిత్రమువలన స్థాపించి విద్య నేర్చిన స్త్రీలందరు ధర్మము విడుతురనియు, పతిని మన్నింపరనియు, స్వచ్ఛందలగుదురనియు గొందరు చెప్పిన మాటలు ద్వేషజన్యములయిన యసత్యవాక్యములనియు స్థిరపరిచినందున ఆనందీబాయి చరిత్రమునకు నేను 'స్త్రీవిద్యా విజయ దుందుభి' అని పేరు పెట్టితిని."

స్త్రీవిద్య గురించి అచ్చమాంబ ఎంతో నిబద్ధతతో పట్టుదలతో తాను రాసిన తన ప్రతి రచనలో కనిపిస్తుంది. సహజంగా తెలివితేటలు, ప్రతిభతో ప్రకాశించే స్త్రీలు, విద్యాగంధం అంటక, విజ్ఞానం అందక తెలివిహీనులుగా తయారుచేయబడుతున్నారని చాలాచోట్ల

రాస్తుంది. ఝాన్సిలక్ష్మీబాయి చరిత్రను తొలిసారిగా తెలుగులో రాసిన ఘనత అచ్చమాంబదే. ఝాన్సీలక్ష్మీబాయి వీరత్వం, ధైర్యసాహసాల గురించీ, గణితశాస్త్ర పండితురాలు, భాస్కరాచార్యుల కూతురు లీలావతి గురించీ చాలా వివరంగా రాసింది.

ఆదిశంకరుడి సమకాలికురాలు, అసమాన ప్రజ్ఞావంతురాలు అయిన సరసవాణి చరిత్రను అందరూ తప్పక చదవాలి. 'స్త్రీలతో గొప్పవారు వాదము చేయరు' అని గొప్పలు పోయిన ఆదిశంకరునితో సరసవాణికి పదిహేడు దినములు సాగిన వాదనలో ఓడించడమే కాక తానడిగిన ప్రశ్నకు అతడు సమాధానం చెప్పలేక, నాలుగునెలలు వ్యవధి అడిగి, మరికొంత విద్యనభ్యసించివచ్చి ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పిన అద్భుత ఘటనను అచ్చమాంబ సరసవాణి కథలో రికార్డు చేసింది.

"అప్పటి సంఘస్థితిని బట్టి చూడగా నప్పటి స్త్రీలత్యంతోచ్చ దశయందుండినట్లు తోచుచున్నది. కానీ ఆ కాలమునందంత యుచ్చపదవి నందుండిన హిందూసుందరులు ప్రస్తుత మత్యంత హీనస్థితికి వచ్చి తమ దుర్దశనే తెలుసుకోజాలనంతటి యజ్ఞానినులగుట మిక్కిలి దుఃఖకరము."

"ఆ కాలమునందు స్త్రీలు పురుషులవలెనే గౌరవింపబడుచుండిరి గాని యిప్పటివలె గదులలో మూసిపెట్టబడుచుండుటలేదు."

"మానవ దేహమునకలంకారమయిన విద్యాభూషణము వారికి లేకుండజేసి లోహపు నగలను మాత్రము పెట్టి తమ వేడుక నిమిత్తమయి వారిని తోలుబొమ్మలవలె చేయుచున్నారు. పురుషులు స్త్రీల విషయమున చేసిన యిట్టి యన్యాయము వలన స్త్రీలను మూఢురాండ్రనుగా చేసి చెడగొట్టుటయేకాక తామును వారి తోడుపాటుగా మూర్ఖశిరోమణులయి చెడిపోతున్నారు. ఏ యింట జూచినను ఐకమత్యమునకు మారుగా కలహములును, మనస్తాపములు పెరుగుచున్నవి. ఈ స్థితియంతయు పురుషుల లోపమువలనను, స్వప్రయోజనతత్వము వలనను గలుగుచున్నదే కాని స్త్రీల దోషము వలనను మాత్రము గాదు. ఏ కాలమందును, ఏ దేశమందును తమ స్త్రీలను మంచి దశకు తీసుకొనిరాక తాము బాగుపడిన పురుషులు లేరు."

"కాబట్టి పురుషులు తమ స్త్రీలను మూఢదశయందుంచి యీ దేశమున కేమో మహోపకారమును చేయుదమన్న దురహంకారమును విడిచి వారి తోడ్పాటును బొందియే సత్కార్యములను చేయ జూడవలెను."

సరసవాణి చరిత్రను రాసే క్రమంలో అచ్చమాంబ స్త్రీల వెనుకబాటు తనానికి సమాజం, పురుషులు ఎలా కారకులయ్యారో చాలా స్పష్టంగా, సూటిగా రాసింది. విద్యాభూషణములివ్వకుండా తుచ్ఛమైన లోహపు నగలిచ్చి స్త్రీలను ఎలా తోలుబొమ్మలుగా

చేస్తున్నారో ఘాటుగా రాస్తూ దీనికంతటికి పురుషుల స్వార్థం, స్వప్రయోజనాలే కారణమని చెబుతుంది. అభివృద్ధిపథంలోకి స్త్రీలను రానీయకుండా వెనక్కి నెట్టేస్తే, ఇంటిగదులకే పరిమితం చేస్తే ఈ దేశమూ బాగుపడదని హెచ్చరిస్తుంది. చివరికి పురుష దురహంకారం గురించి కూడా రాయడం చూస్తే అచ్చమాంబ ఎంత గొప్ప స్త్రీవాదో అర్థమౌతుంది. పురుషులు తమ అహంకారాలను వదిలేసుకుని స్త్రీ అభివృద్ధికి పాటుపడాలనే హితవు పలుకుతుంది.

భండారు అచ్చమాంబ ఈ మాటలు రాసి వంద సంవత్సరాలైంది. ఆమె పేర్కొన్న పురుషాహంకారం పెరిగిందే కానీ తగ్గలేదు. ఇంటా బయటా ఈనాటి స్త్రీ విపరీతమైన హింసను ఎదుర్కొంటోంది. స్త్రీలను వెనకే వొదిలేసిన అభివృద్ధి ఏ రూపం తీసుకుందో ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది. ఈనాటికి విద్య చాలామందికి గగనకుసుమమే. అచ్చమాంబలాంటి ద్రష్టల దార్శనికత ఎంత స్పష్టమైందో ఈనాటి నేపథ్యంలోంచి చూడాలి.

ఈ విధంగా అచ్చమాంబ "అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథరచన ద్వారా స్త్రీలు అబలలు, మూర్ఖులు, వివేకహీనులు కారని, సమాజం, పురుషులే వారిని అలా తయారుచేసారని, దానికి కారణం వారి స్వార్థమేనని నిరూపించింది. దీనిని రుజువులతో సహా నిరూపించడానికి చరిత్ర చీకటిలో కలిసిపోయిన గొప్ప ప్రతిభావంతులైన స్త్రీల చరిత్రలు సేకరించి ఈ పుస్తకంలో నిక్షిప్తం చేసింది. ఈ సమాచారం సేకరించడానికి అచ్చమాంబ ఎంతో శ్రమపడి వుంటుంది. ఈ పుస్తకం రాసేనాటికి ఆమెకి పట్టుమని ఇరవై అయిదు సంవత్సరాలు కూడా లేవు. స్త్రీల జీవితాల్లో వెలుగు రావాలని, వారు విద్యావంతులు, సాహసవంతులు కావాలని ఆమె అనుక్షణం తపన పడినట్లు ఈ పుస్తకం నిండా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో ప్రథమ స్త్రీచరిత్రకారిణి అచ్చమాంబేనని తిరుగులేకుండా నిరూపిస్తుంది ఈ గ్రంథం. స్త్రీ దృష్టికోణాన్ని అద్భుతంగా ఆవిష్కరించడం వల్ల అచ్చమాంబ ప్రథమ స్త్రీవాద చరిత్రకారిణిగా కూడా నిలిచిపోతుంది.

అబలా సచ్చరిత్ర రత్నమాల మొదటి భాగంలో ఆమె పొందుపరిచిన వివిధ భాషలకు చెందిన స్త్రీల చరిత్రలను ఈ కింది విధంగా విడదీయవచ్చు.

ఆంధ్ర దేశం

కాకతీయ రుద్రమదేవి
చానమ్మ (ఖడ్గతిక్కన భార్య)
మొల్ల (కవయిత్రి)
తరిగొండ వెంగమాంబ
మదిన సుభద్రమ్మ
నాచి గణపాంబ
కొమర్రాజు జోగమాంబ

గుజరాత్

వీరమతి
ఖానా
లీలావతి

మహారాష్ట్ర

డా. ఆనందీబాయి జోషి
జిజియాబాయి
రాణి అహల్యాబాయి

వింధ్య ప్రదేశం

సికందరు బేగం
సుభద్ర (భోపాల్)

ఉత్కళ దేశం

సరస్వతి

మైసూరు

నానావతి

రాజస్థాన్

పద్మిని
పన్నా
మీనాబాయి
తారాబాయి
కృష్ణకుమారి

ఉత్తరప్రదేశ్

మాసుల విజ్జిక (కవయిత్రి)
రాణి దుర్గావతి
రాణి సంయుక్త
రాణి ఝాన్సీలక్ష్మి
విమలాదేవి
సులభ
హోత్తి విద్యాలంకార్

వంగదేశం

తోరుదత్తు (కవయిత్రి)
భాగవతీదేవి (ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తల్లి)
రూపమంజరి
పద్మావతి

"ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధింపబడు స్త్రీలు రక్షితురాండ్రు కారు. ఏ స్త్రీలు, తమ యాత్మను తామే కాపాడుకొందురో వారే సురక్షితురాండ్రు" అనే అర్థం వచ్చే సంస్కృత శ్లోకంతో "అబలా సచ్చరిత్రమాల"ను మొదలుపెట్టిన అచ్చమాంబ ఉద్దేశ్యమేమిటో స్పష్టమే. పురుషులు స్త్రీలను ప్రేమతో, గృహాల్లో నిర్బంధిస్తారని, స్త్రీలు ఈ సంగతి నెరిగి తమను తామే రక్షించుకునే విధంగా ఎదగాలని పిలుపునిస్తూ రాసిన అచ్చమాంబ నిజమైన స్త్రీస్వేచ్ఛావాది. స్త్రీవాది.

తొలి కథకురాలు

అచ్చమాంబ రచనాయాత్ర కేవలం ఆరు సంవత్సరాలే సాగింది. 1898 నుంచి 1904 వరకు ఆమె దాదాపు పన్నెండు కథలు, అనేక వ్యాసాలు, ఒక శతకం రాసింది. 1898 సంవత్సరంలో అచ్చమాంబ తొలిరచన "తెలుగు జనానా" పత్రికలో అచ్చు అయినట్లు రాయసం వెంకటశివుడు పేర్కొన్నారు.

"1898వ సం॥ ఆగష్టు నెల 'జనానా' పత్రికలో, అచ్చమాంబ గారు "మహారాణి స్వర్గమయి గారి చరిత్ర వ్రాసిరి. ఆ డిసెంబరు సంచికలోను, పిమ్మట నెల పత్రికలోను "జోనుకుమారి" గురించి వ్రాసిరి. ఇంగ్లీషు పుస్తకములందలి సంగతులిట్లు తర్జుమా చేయుటయందు చేయితిరిగి, ఆమె మెలమెల్లగా చిన్న సొంత కథలల్లుట నారంభించిరి. 1898 జూలై నెల పత్రికలో "ప్రేమపరీక్షణ" యను కథను వ్రాసిరి. ఆ సెప్టెంబరు సంచిక కీమె వ్రాసిన "ఎఱువు సొమ్ము బరువు చేటు" అను కథ మిగుల రమ్యమైనది. (లక్ష్మణరాయవర్ధంతి సంచిక తెలుగుతల్లి మాసపత్రిక : సంపాదకురాలు రాచమళ్ళ సత్యవతీదేవి, సహాయ సంపాదకులు అడవిబాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, వట్టికోట ఆళ్వారు స్వామి.)

ఆ రోజుల్లో స్త్రీ విద్యాభ్యున్నతికై "తెలుగు జనానా" పత్రికను నడిపిన రాయసం వెంకటశివుడు ప్రకారం అచ్చమాంబ తొలికథను 1898లోనే రాసింది. అంతకుముందు ఇంగ్లీషు నుండి అనేక రచనల్ని తెలుగులోకి అనువాదం చేసింది. అచ్చమాంబ 1898లోనే అతిచిన్నవయసులోనే తెలుగు సాహిత్యంలో తొలికథ రాసింది.

చదువుకోలేకపోయిన అచ్చమాంబ తన 24వ ఏట కథారచనకు శ్రీకారం చుట్టడం ఎంతైనా ఆశ్చర్యం కలిగించే విషయం. అయితే 1898లో ఆమె రాసిన రెండు కథలు ఇప్పటికీ అందుబాటులో లేవు. తెలుగు జనానా పత్రికాధిపతి రాయసం వెంకటశివుడు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు గురించి రాసిన వ్యాసంలో ఈ అంశాన్ని పేర్కొనడం వల్ల ఈ విషయం తెలిసింది. కొంత ప్రయత్నిస్తే ఆనాటి తెలుగు జనానా కాపీలు దొరకవచ్చు.

అప్పటి వరకు 1902లో ఆమె రాసిన, హిందూసుందరి పత్రిక ప్రచురించిన "ధనత్రయోదశి" కథనే ఆధునిక తెలుగు సాహిత్యంలో మొదటి కథగా చెప్పుకోవాల్సి వుంటుంది.

"ధనత్రయోదశి" కథలో ఇతివృత్తం ఆధునికమైంది. కథానాయకి విజయలక్ష్మమ్మ. కథాస్థలం బొంబాయి. ఆమె భర్త వెంకటరత్నం. ఒక బట్టల కొట్టులో పనిచేస్తూ వుంటాడు. నెలకు పదిరూపాయల జీతం. ఆ చిన్నమొత్తంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వుంటుంది. దీపావళి రోజు దీపాలు పెట్టుకోడానికి కూడా గతిలేని స్థితి. ఈ అసహాయస్థితిని ఆసరా చేసుకుని బట్టలో కొట్టులోని పెద్ద గుమాస్తా విజయలక్ష్మి భర్తని ప్రలోభపెట్టి, ఇనప్పెట్టెలోంచి దొంగతనం చేద్దామని చెప్పి వందరూపాయలు తీసి ఇతనికిస్తాడు. ఆ డబ్బుతో ఇంటికొచ్చిన అతను దిగులుగా వుండడం చూసి విజయలక్ష్మి విషయం అడిగి తెలుసుకుని, భర్తను మందలించి వందనోటు వెనకకు ఇప్పించేస్తుంది. ఇదంతా తామాడిన నాటకమని చెప్పి బట్టలషాపు యజమాని వెంకటరత్నం జీతం పెంచుతాడు. ఇది ధనత్రయోదశిలోని కథ టూకీగా. తెలుగులో తొలి కథగా ప్రచారంలో వున్న గురజాడ "దిద్దుబాటు" కథలో కథాంశం కూడా భర్తను సంస్కరించడమే. గురజాడ ఈ కథను 1910లో రాశాడు. అంటే అచ్చమాంబ కంటే దాదాపు తొమ్మిదేళ్ళ తరవాత వచ్చిన గురజాడ కథను ప్రథమకథగా సాహిత్య చరిత్రకారులు ప్రచారం చెయ్యడం వెనక బలంగా పనిచేసింది మాత్రం పితృస్వామ్య, పురుషాధిక్య భావజాలం. "దిద్దుబాటు" కథ ఆదర్శపూరితంగాను, హాస్యంగానూ వుంటుంది. అచ్చమాంబ కథ గంభీరంగా, వాస్తవికంగా వుంటుంది.

"నా అభిప్రాయంలో నమ్మదగ్గ దిద్దుబాటు కథ ఇది. ఈ కథలో జరిగింది చిన్న దొంగతనం. భర్తకు తాను తప్పుచేసేనన్న బాధవుంది. ఆ సమయంలో భార్య చెప్పిన మాటలు విని ఆ తప్పు దిద్దుకోవడానికి అంగీకరించడం నమ్మదగ్గదిగా, వాస్తవానికి దగ్గరగా ఉంది.

"చిన్న సమస్యలు పరిష్కారమయినంత తేలిగ్గా పెద్ద సమస్యలు పరిష్కారం కావు. పరిష్కారానికి అవసరమైన సన్నివేశాలు కూడా సమస్యకి తగిన స్థాయిలో ఉన్నపుడే కథ రాణిస్తుంది. చిన్న సమస్యలు మాటలతో పరిష్కారం అయిపోవచ్చు. పెద్ద సమస్యలు ఆవిష్కరించినపుడు పరిష్కారానికి మార్గం అంత బలంగానూ ఉండాలి".

అచ్చమాంబగారు ప్రధాన సమస్యని పరిచయం చెయ్యడంలో, తదనుగుణంగా వాతావరణం, సన్నివేశాలూ చిత్రించడంలో, వర్ణనలలో చెప్పుకోదగ్గ ప్రతిభ చూపించారు ఈ కథలో.[5]

---

5. అచ్చమాంబ కథల్లో ఏముంది? – నిడదవోలు మాలతి

"ఇక తెలుగులో 'మొదటి కథలు' అనే సమస్యరాదు. ఆ కథలకన్న భండారు అచ్చమాంబ 1901–1904 సంవత్సరాల్లో రచించిన కథలు మంచి సందేశంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసేవిగా సంఘ సంస్కరణ భావాలను చిత్రిస్తూ గొప్పగా వున్నాయి. అచ్చమాంబ కథల తర్వాతనే గురజాడ దిద్దుబాటు (1910), మాడపాటి హనుమంతరావు హృదయశల్యము (1912) కథలు రచింపబడి అచ్చయినాయి. కాబట్టి అచ్చమాంబ కథలనే తెలుగులో "తొలికథలు"గా చెప్పటం అన్ని విధాల సమర్థనీయంగా వుంది.[6]

అచ్చమాంబ కథని తొలికథగా ఒప్పుకోకపోవడానికి విమర్శకులు చెబుతున్న కారణాలు రెండు. ఒకటి కథ గ్రాంథిక భాషలో వుంది. రెండు ఆధునిక కథకుండాల్సిన లక్షణాలు లేవు. గురజాడ దిద్దుబాటు కథను మొదట గ్రాంథిక భాషలోనే రాసి తర్వాత సరళగ్రాంథిక భాషలోకి మార్చినట్టుగా తెలియచెప్పే ఆధారాలు మన ముందున్నాయి. 'కమలిని' పేరుతో గురజాడ రాసిన ఈ కథని అవసరాల సూర్యారావు "ఆణిముత్యాలు" కథాసంకలనంలో చేర్చారు. ఇది గ్రాంథిక భాషలోనే వుంది.

రెండోది ఆధునిక కథకుండాల్సిన లక్షణాలు లేవనేది. ఈ కథ రాసిన నాటి చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకుంటే ఈ మాటరాదు. ప్రపంచ సాహిత్యంలో సాహిత్య ప్రక్రియగా 'కథ' పుట్టిందే 19వ శతాబ్దంలో. కథకు ఉండాల్సిన లక్షణాలు స్థిరపడుతున్న సందర్భం. అచ్చమాంబ కథను ఈ నేపథ్యంలోంచి చూడాల్సిన అవసరం వుంది. అయితే ఒక స్త్రీని ఒకానొక నూతన సాహిత్య ప్రక్రియకి ఆద్యురాలుగా అంగీకరించలేకపోయిన తెలుగు సాహిత్య విమర్శకులు చాలా తెలివిగా పై రెండు అంశాలను చూపించి అచ్చమాంబ తొలికథకురాలు కాదు పొమ్మన్నారు. లేదా పట్టించుకోకుండా వదిలేసారు. మరింత లోతుగా తరచిచూస్తే ఆనాటి సాహిత్య సమాజానికి బహుశ అలాంటి స్పృహ కూడా వుండి వుండకపోవచ్చు. ఆధునిక విమర్శకులు మాత్రం అచ్చమాంబను వెనక్కినెట్టేసే ప్రయత్నాలతోనే "వందేళ్ళ తెలుగు కథ" అంటూ సంబరాలు చేస్తున్నారు.

"కథాశిల్పం"[7] పేరుతో కథ మీద సిద్ధాంతగ్రంథం రాసిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య అచ్చమాంబ కథని కనీసం స్పృశించకుండా చాలా స్ట్రాటజిక్‌గా "తెలుగులో మొట్టమొదటి కథ ఏది అన్న వివాదాన్ని కథాసాహిత్య చరిత్రకారులకు వదిలిపెట్టి గురజాడ 'దిద్దుబాటు' మొదటి కథ అన్న పరికల్పనతో తెలుగుకథాపరిణామాన్ని గురించి ఆలోచిద్దాం" అంటూ దాటవేశారు. ఎవరి కథ ముందుది అనే అంశాన్ని పక్కకు పెట్టినా 'ధనత్రయోదశి' కథలోని మంచి చెడ్డల్ని, శిల్ప, వస్తు, రూపాల గురించి ప్రస్తావించడం కూడా ఆయనకు ఇష్టం లేకపోయింది.

"తొంభైఏళ్ళ తెలుగుకథ"[8] పుస్తకంలో కూడా పెద్దిభొట్ల సుబ్బరామయ్య, భమిడిపాటి జగన్నాథరావులు కూడా తెలుగుకథ గురించి విపులంగా చర్చిస్తూ అచ్చమాంబ కథ గురించి ఒక్కమాట కూడా రాయలేదు. తెలుగు కథాచరిత్రను రాసినవారికి అచ్చమాంబ గురించి తెలియదనుకోవాలా లేక ఉద్దేశపూర్వకంగానే ఉపేక్షించారనుకోవాలా?

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు "తెలుగు కథకులు–కథనరీతులు"[9] పేరుతో మూడు పుస్తకాలు ప్రచురించారు. సింగమనేని నారాయణ, మధురాంతకం రాజారామ్‌గార్లు ఎడిటర్లుగా వ్యవహరించిన ఈ పుస్తకాలలోని మొదటి సంపుటిలో గురజాడ అప్పారావు గురించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు రాసిన వ్యాసం వుంది. భండారు అచ్చమాంబను తొలి కథారచయితగా ఒప్పుకోలేకపోయినా ఆమె కథల గురించి, కథనరీతులు గురించిన వ్యాసం రాయించేంత విశాల హృదయం వుండకపోయినా, ఆవిడ గురించి ప్రస్తావించాల్సిన అవసరం లేదా? అచ్చమాంబ రాసిన కథల్లో ఆధునిక లక్షణాలు లేవని కొట్టిపారేయడం కాకుండా వాటి మంచిచెడ్డల్ని సమీక్షించాలన్న ఆలోచన లేకపోవడం వెనక వున్నదంతా పితృస్వామ్య భావజాలమే అని అనుకోవాల్సిన పరిస్థితుల్ని వారే కల్పించినట్టు అవ్వలేదా?

"స్త్రీలు ఎంత సాహిత్యాన్ని సృష్టించారని కానీ, ఎంత బాగా వ్రాసారని కానీ కాక అసలు వాళ్ళేం రాసారో, ఎందుకు వ్రాసారో, ఎందుకు రాయలేక పోయారో చూడాలి.

"పితృస్వామిక సామాజిక అధికారిక సంబంధాలలో అణిచివేతకు గురైన వర్గం సృష్టించిన సాహిత్యంగా స్త్రీల–సాహిత్య ప్రత్యేకతను గురించి పరిశీలించి విలువ కట్టాలి.

"స్త్రీల సాహిత్యాన్ని విలువ కట్టడంలో ఆ సాహిత్యం వచ్చినకాలంనాటి మొత్తం సమాజపు స్థితి, అందులో స్త్రీలకున్న అవకాశాల నుండి వాళ్ళు పొందిన చైతన్యస్థాయి ప్రాతిపదికలు కావాలి."[10]

సాహిత్యాన్ని తూకం వేయడానికి ఇంతకాలం పురుషులు వాడిన ప్రాతిపదికలు సాహిత్యాన్ని పురుష దృష్టికోణం నుంచి అంచనా వేయడానికి పనికి వచ్చాయి. స్త్రీల ప్రత్యేక పరిస్థితుల గురించిన అవగాహన లేకపోవడమో లేక స్త్రీలను ముందుంచడం ఇష్టం లేకనో ఇంతకాలం స్త్రీల సాహిత్యచరిత్ర గురించి ఖచ్చితమైన, సవ్యమైన దిశలో అధ్యయనం లేకుండా పోయింది. పురుషాధిపత్యం, పితృస్వామ్యం అద్దాల్లోంచే స్త్రీల సాహిత్యాన్ని

6. *భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు*
కవిలె : తెలంగాణ రిసెర్చి అండ్ రెఫరల్ సెంటర్ . సంపాదకుడు : సంగిశెట్టి శ్రీనివాస్

7. *కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య*

8. *తొంభై ఏళ్ళ తెలుగు కథ : పెద్ది భొట్ల సుబ్బరామయ్య, భమిడిపాటి జగన్నాథరావు*

9. *తెలుగు కథకులు – కథన రీతులు – సంపాదకులు సింగమనేని నారాయణ, మధురాంతకం రాజారామ్*

10. *20వ శతాబ్దపు రాజకీయార్థిక పరిణామాలు – తెలుగులో స్త్రీలసాహిత్యం – సంపాదకత్వం – కాత్యాయని విద్మహే*

చూడడానికి అలవాటు పడిన విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు ఇకనైనా నిజాల్ని చూడటానికి ప్రయత్నించాలి.

'ధనత్రయోదశి' కథతోపాటు అచ్చమాంబ రాసిన కథలన్నింటిలోను స్త్రీవిద్య ముఖ్య అంశంగా వుంటుంది. ఈ కథలన్నీ ఆధునిక భావాలతో వుంటాయి. స్త్రీవిద్యతోపాటు సమాజ ఉద్ధరణ, మహిళల అభ్యున్నతి, బాల్యవివాహాల వ్యతిరేకత ఈ కథల్నిండా పరుచుకుని వుంటాయి.

అచ్చమాంబ రాసిన కథలు

అచ్చమాంబ అత్యంత నవీనమైన ప్రక్రియని చేపట్టి సమర్థవంతంగా 12 కథలు రాసింది. అవి వరుసగా

1. గుణవతియగు స్త్రీ
2. లలితా శారదులు
3. జానకమ్మ
4. దంపతుల ప్రథమ కలహము
5. సత్పాత్రదానము
6. స్త్రీవిద్య
7. ధనత్రయోదశి
8. భార్యాభర్తల సంవాదం
9. అద్దమును సత్యవతియును
10 బీదకుటుంబము
11.ప్రేమ పరీక్షణము(అలభ్యం)
12.ఎరువు సొమ్ము పరువుచేటు (అలభ్యం)

గుణవతియగు స్త్రీ : ఈ కథ మే 1901లో తెలుగు జనానాలో అచ్చయింది. సంసారాన్ని ఎలా పొదుపుగా నడపాలో చెప్పే కథ. దశకుమారచరిత్ర నుండి ఈ కథను తీసుకున్నానని ఆమెనే కథాప్రారంభంలో చెబుతుంది. శక్తికుమారుడనే వర్తకుడు పొదుపుగా సంసారం చెయ్యగల కన్యక కోసం వెతుకుతూ తిరుగుతుంటాడు. తవ్వెడు ఒడ్లు మాత్రమే తీసుకుని వేరేమీ అడక్కుండా అతనికి వాటితోనే భోజనం పెట్టాలి. అలాంటి పొదుపరిని పెళ్ళి చేసుకోవాలని అతని సంకల్పం. ఆ పరీక్షలో నెగ్గిన పిల్లను పెళ్ళి చేసుకుంటాడు. ఆ తర్వాత కూడా ఆమెని ఎన్నో పరీక్షలకు గురిచేస్తాడు. వాటన్నింటిని ఆమె తట్టుకుంటుంది. ఆ తర్వాత భర్త ఆమెతో సఖ్యంగా వుంటాడు. ఈ కథలో పొదుపుగా సంసారం చేసుకోవాలని చెప్పడమే అచ్చమాంబ ఉద్దేశ్యం. దీనిని ఒక పురాణకథగానే తీసుకోవాలి. ఈ కథని

'ధనత్రయోదశి' కన్నా ముందు రాసినప్పటికీ ఆమె స్వయంగా రాసింది గాదు కాబట్టి దీన్ని తొలికథగా పరిగణించలేం. అయితే 1901లోనే అచ్చమాంబ కథ రాయడానికి సంకల్పించడం మాత్రం చాలా ఆశ్చర్యకరం. అప్పటివరకు కథ అనే సాహితీ ప్రక్రియ ఆధునిక తెలుగు సాహిత్యంలో వున్నట్టు కనబడదు. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక తెలుగు కథ పుట్టిందే 19వ శతాబ్దంలో. కథ ఎలా రాయాలి? కథకు వుండాల్సి లక్షణాలేంటి? ఎలా మొదలుపెట్టి ఎలా ముగించాలి? ఎత్తుగడలేంటి? ఇవన్నీ అప్పుడప్పుడే స్థిరపడుతున్నాయి.

చివరి రెండు కథలు "తెలుగు జనానా"లో ప్రచురితమయ్యాయనే దానికి రుజువులున్నాయి కానీ, ప్రస్తుతం ఆ కథలు అందుబాటులో లేవు. అందుబాటులో వున్న పది కథలను గుదిగుచ్చి సంగిశెట్టి శ్రీనివాస్ ఇటీవల 'తొలి తెలుగు కథలు' పేరుతో ఒక సంపుటి ప్రచురించారు. ఇతని ప్రయత్నంవల్ల ప్రస్తుతం అచ్చమాంబ కథలు పుస్తకరూపంలో తెలుగు పాఠకులకు అందుబాటులోకొచ్చాయి.

అచ్చమాంబ కథల్లో ఏముందో పరిశీలిద్దాం.

'గుణవతియగు స్త్రీ' కథ గురించి ఇంతకుముందే ప్రస్తావించాను. దానిని ఆమె దశకుమారచరిత్రనుండి తీసుకున్నది. ఇక రెండోకథ "లలితాశారదులు". ఇది పెద్దల కోసం రాసిన పిల్లల కథ. ఈ కథ ఇద్దరు స్నేహితులకు సంబంధించినది. తహసిల్దార్ కూతురైన లలిత అహంకారంతో తనతోటి పిల్లల్ని కొడుతూ వుంటుంది. శారదని కూడా కొట్టడానికి ప్రయత్నించినపుడు, పక్కనే వున్న గులాబీ చెట్టుమీద ఆమె చెయ్యిపడి, ముళ్ళు గుచ్చుకుని గాయమౌతుంది. శారద గాయాన్ని తుడిచి, ఆమెకి సేవచేస్తుంది. ఈ సంఘటన లలితలో చాలా మార్పును తెస్తుంది. తాను కొట్టబోయినా పట్టించుకోకుండా శారద తనకి సేవ చేయడంతో ఆ పిల్లలో పశ్చాత్తాపం కలిగి అందరితో స్నేహంగా వుండడం మొదలుపెడుతుంది.

జానకమ్మ : ఈ కథ రాయసం వెంకటశివుడు నడిపిన తెలుగు జనానా పత్రిక మే 1902 నాటి సంచికలో అచ్చయ్యింది. ఈ కథ రంగరాజు తన కూతురు జానకమ్మని అతిగారాబంగా పెంచి, ఆమెకు మరో ధనవంతుడితో వివాహం చెయ్యడం గురించినది. కథ సామాన్యంగానే వున్నా ఈ కథలో స్త్రీవిద్య గురించి అచ్చమాంబ సమయస్ఫూర్తిగా ఒకచోట ప్రస్తావిస్తుంది.

"జానకి తండ్రి జానకమ్మను విద్యావతిని చెయ్యవలెనను కుతూహలముతో, బాలికలను పాఠశాలలకు బంపుటయేమో యెరుగక మీదు మిక్కిలి యట్టిపని వింత తప్పుగా భావింపబడు నా కాలమున కూతురును తన యిరువురు కుమారులతో గూడ బడికి పంపనారంభించెను."

అలాగే ఈ కథలో అచ్చమాంబ కాటవరం అనే గ్రామం గురించీ, గోదావరి గురించి చేసిన వర్ణనలు ప్రశంసించతగ్గవి. కాటవరం గోదావరి మధ్యలో వున్న లంక గ్రామం అవ్వడం వల్ల గ్రామం చుట్టూ నీరుంటుంది.

"నది యొడ్డున నిలువబడి పశ్చిమోత్తరముగా జూచిన సదా నల్లని పొగమంచుతో గప్పబడి యాకాశమంచువరకు వ్యాపించియున్న పర్వతములును అందుపైన సేతువర్ణమయమై కారుమేఘములలోని మెఱుపు తీగవలె, తళ్కుతళ్కుమను దేవాలయమును పర్వతములను చీల్చుకొని వచ్చుచున్నటుల గోచరించు గౌతమియు కన్నుల పండువు సేయుచుండును."

ఎక్కడో నాగపూర్‌లో నివాసముండే అచ్చమాంబ గౌతమి గోదావరి గురించి ఇంత చక్కటి వర్ణన చేయడం వెనక ఆమెలో వున్న భావుకత, ప్రతిభా స్పష్టంగా కనబడతాయి.

దంపతుల కలహము : "నేను పెండ్లాడిన భార్యను గాని దాసిని గాను. వివాహమాడుట వలనను దాసినగుదునా యేమి?" అనే వాక్యంతో ఈ కథ మొదలవుతుంది. చిన్న అంశం మీద భార్యాభర్తలకి గొడవౌతుంది. అమ్మమ్మని చూడ్డానికి వెళ్ళాలని భార్య, నాటకం చూడ్డానికి వెళ్ళాలని భర్తా తగువులు పడి, పశ్చాత్తాపపడి తిరిగి కలుసుకోవడం ఈ కథాంశం. కథలో అమ్మమ్మ సంప్రదాయబద్ధమైన బోధనలతో చెప్పిన కథతో భయపడి లలిత తన యింటికి తిరిగి వెళ్ళడం, భర్త కూడా అర్ధరాత్రిదాకా బయట తిరిగి పశ్చాత్తాపపడి ఇంటికి రావడంతో కథ ముగుస్తుంది. భార్యాభర్తల మధ్య పట్టువిడుపు వుండాలని, ఒకరిని ఇంకొకరు గౌరవించుకోవాలనే సందేశాన్నిస్తుంది. ఈ అంశం ఎంత ఆధునికమైందో పాఠకులు అర్థం చేసుకోవాలి. ఈ కథ హిందూసుందరి జూన్ 1902 సంచికలో ప్రచురితమైంది.

సత్పాత్రదానము : ఈ కథ 1902లో 'హిందూసుందరి' పత్రికలో అచ్చయింది. ఈ కథ హైదరాబాదులో జరిగింది. కథ తల్లికొడుకుల మధ్య సంభాషణగా మొదలౌతుంది. వీధిలో అడుక్కుంటున్న అంధుడికి పావలా ధర్మం చేయాలని కొడుకు అనుకుని తల్లిని అడుగుతాడు. అపుడు తల్లి బిచ్చగాడిని ఇంటికి పిలిచి అన్నంపెట్టి అతని వివరాలు అడుగుతుంది. అతనికి గ్రామంలో వ్యవసాయం చేసే కొడుకులున్నారని ఇతను సంపాదించి కొడుకులకు పంపి వాళ్ళను సోమరులుగా చేస్తున్నాడని ఆమెకి అర్థమౌతుంది. ఆ పావలాను అచ్యుతునికిమ్మని, అది వాడి బడి నెల జీతమునకు పనికి వస్తుందని కొడుకుతో చెప్పినపుడు కొడుకు తల్లి చెప్పినట్లే చేస్తాడు. స్వయంకృషి చేసుకోగలిగేవారికి దానమిచ్చి సోమరులను చెయ్యకూడదనేది అచ్చమాంబ అభిప్రాయం.

స్త్రీవిద్య : ఈ కథ కూడా 'హిందూసుందరి'లో 1902లోనే ప్రచురణ పొందింది. స్త్రీవిద్య ఆవశ్యకత గురించి భార్యాభర్తల సంవాదరూపంలో సంభాషణలలో కథ నడుస్తుంది.

భర్త వేరే ఊరికి ప్రయాణమైనపుడు క్షేమసమాచారములు తెలుపుటకు ఉత్తరాల ప్రసక్తి వస్తుంది. భార్యకు చదువు చెప్పించాలని భర్త ఎంత ప్రయత్నించినా ఆమె వినకపోవడంతో అతను కోపంతో ఇకనైనా విద్య నేర్చెదవా? లేదా అని కోపగించుకొన్నపుడు భార్య తన భయాలను తెలుపుతూ "మా నాయనమ్మ యాడువారు చదువు నేర్చుకొనకూడదనియు, జదివిన స్త్రీలు తమ భర్తల ఆయువును హరింతురని, యిది శాస్త్రములలో నున్నదనియు చెప్పుచుండును" అంటుంది. అపుడు భర్త ఇవన్నీ కల్పనలని, ఇలాంటి వాదనలు శాస్త్రములలో లేవనియు వాదించి ఆమెను చదువుకునేలా ప్రోత్సహిస్తాడు. స్త్రీలకు విద్య చాలా అవసరమని, చదువు లేకపోవడం వల్ల స్త్రీలు అజ్ఞానంలో వుండిపోతారనే విషయాన్ని భర్త పాత్రచేత వివిధ కోణాలలో చెప్పిస్తుంది. ఆ రోజుల్లో స్త్రీలకు చదువు అక్కర్లేదని వాదించే వారి మూర్ఖవాదనలన్నీ ఇందులో కనిపిస్తాయి. ఈ వాదనలన్నింటినీ ఖండిస్తూ స్త్రీలకు విద్య చాలా అవసరమని గట్టిగా చెబుతుంది అచ్చమాంబ ఈ కథలో. సంఘటన లేకపోయినా సంభాషణల రూపంలో శ్రీపాద కన్న ముందు రాసిన ఈ కథ అప్పటికి నూతన ప్రయోగమే.

భార్యాభర్తల సంవాదము (నగలను గూర్చి): ఈ కథ మొత్తం నగల చుట్టూ తిరుగుతుంది. కథాశీర్షికలోనే నగలగూర్చి అని అచ్చమాంబ చేర్చింది. నగలు కావాలని భార్య, నగల వలన కలిగే సౌందర్యం క్షణికమైందని, స్త్రీలైనా, పురుషులైనా బాహ్య సౌందర్యం కోసం పాకులాడక అంతఃసౌందర్యం పొందడానికి ప్రయత్నించాలని భర్త నీతిబోధ చేస్తాడు. స్త్రీకి సద్గుణాలే అలంకారంగా వుండాలని, మాయనగల కోసం ఆరాటపడరాదని అచ్చమాంబ చెబుతుంది. ఈ కథకూడా సంవాదరూపంలో నడుస్తుంది. కథలోని రెండు పాత్రలు – భార్య, భర్తల పాత్ర చిత్రణ బాగా చేసింది అచ్చమాంబ. సంభాషణలు సూటిగా, సరళంగా సాగుతాయి. హిందూసుందరి జూలై 1903 సంచిక ఈ కథని ప్రచురించింది.

అద్దమును సత్యవతియును : ఈ కథ కూడా 1903లో రాసింది. అదే సంవత్సరం హిందూసుందరిలో ప్రచురించారు. ఇది రెండు పేజీల కథానిక. గల్పిక అనవచ్చునేమో. మూడేళ్ళ సత్యవతి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసి అవతల వేరే పిల్ల వున్నదనుకొని, అది అచ్చం తనలాగే వుండడం చూసి చాలా ఆశ్చర్యపడుతుంది. తేరిపారా అద్దంలోకి చూస్తూవుంటే అవతలిపిల్ల కూడా అలాగే చూస్తుంది. సత్యవతి కోపంతో మూతితిప్పి, నాలుక బైటపెట్టి వెక్కిరించగా అద్దంలో పిల్ల కూడా అలాగే చేస్తుంది. సత్యవతి కోపంతో అమ్మమ్మకు ఫిర్యాదు చేస్తుంది. "అమ్మమ్మా! ఎవరో చెడ్డపిల్ల మన మేడమీదికి వచ్చి నన్నూరికే వెక్కిరించుచున్నది చూడవే" అంటుంది. అమ్మమ్మ పైకి వచ్చి చూసి అది అద్దమని, అద్దంలో నువ్వేది చేస్తే అదే కనబడుతుందని చెబుతుంది. సత్యవతి పెద్దదైన

తరువాత కూడా ఈ విషయం జ్ఞాపకం పెట్టుకుని "ఈ జగమంతయు నొక యద్దమనియు, మనము దానివైపున కోపముగా చూచిన ప్రతిబింబము కోపముగా, సంతోషంగా దానింగనిన బ్రతిబింబము సంతోషముగాను కనిపించును" అని గుర్తించడమే కాక అందరికీ ఈ విషయం చెబుతుండేది. చిన్న గల్పికలో అచ్చమాంబ పెద్ద జీవితసత్యాన్ని తాత్త్వికంగా చెబుతుంది. ఈ కథలో ఉన్నది చిన్న సంఘటనే కానీ దానిని కథగా మలిచిన తీరు అద్భుతం. అచ్చమాంబ చిన్నప్పుడు ఇలాంటి సంఘటన చూచిందా అన్నంత సహజంగా రాసింది.

బీద కుటుంబము : ఈ కథను అచ్చమాంబ 1904లో రాసింది. కాకినాడ నుంచి పులుగుర్త లక్ష్మీనరసమాంబ నడిపిన 'సావిత్రి' పత్రికలో ఇది అచ్చయ్యింది. ఈ కథలో ముఖ్యపాత్ర వెంకమ్మ. వెంకమ్మ భర్త పది రూపాయల జీతంతో ఉద్యోగం చేసేవాడు. ఆమె కూడా పిండి విసిరి ఎంతో కొంత సంపాదించి గుట్టుగా సంసారం చేసేది. ఆరుగురు పిల్లల్ని సాకేది. హఠాత్తుగా భర్త మరణంతో వెంకమ్మ చాలా కష్టాలు పడవలసి వచ్చింది. ఆమె రాత్రి, పగలూ పిండి విసురుతూనే వుండేది. ఆ వచ్చిన సొమ్ముతోనే పిల్లల్ని పోషిస్తూ, చదివించేది. అచ్చమాంబ వెంకమ్మ పాత్రని అత్యంత ప్రతిభావంతంగా చిత్రించింది. పేదదైనప్పటికీ ఆత్మగౌరవంతో మెసిలే వెంకమ్మ తన పిల్లల్ని చక్కగా చదివిస్తుంది. బీదరికంలో కూడా దైన్యంగా కనబడకుండా శుభ్రంగా వుండేటట్టు పిల్లల్ని పెంచుతుంది. ఆత్మగౌరవంతోను, ఉన్నంతలో పరిశుభ్రంగా వుండే విధంగాను పిల్లల్ని తీర్చిదిద్దుతుంది. వెంకమ్మను ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కల స్త్రీగా తీర్చిదిద్దడంలో అచ్చమాంబ కృతకృత్యురాలైంది. ఈ కథ నిజంగా జరిగిందని, తన స్నేహితురాలు తనకీ కథ చెప్పిందని ముందే చెబుతుంది. ఈ కథ ఉత్తమపురుషలో సాగుతుంది.

అచ్చమాంబ కథల్ని ఏకబిగిన చదవడం కొంచెం కష్టం. ఆమె రాసే కాలం నాటికి అదే భాష వాడుకలో వుంది. అప్పటి రచనలు చాలా వరకు గ్రాంథికంలోనే వున్నాయి. అయినా అచ్చమాంబ వాడిన భాష మరీ అంత కొరుకుడు పడకుండా ఏమీ లేదు. కొన్ని పదాలు అర్థం కాకపోవచ్చు కానీ కథలో ఆమె ఏమి చెప్పదలుచుకుంది అనేది తేలికగానే అర్థమౌతుంది. ఒక్కో కథలో ఒక్కో అంశం గురించి చర్చిస్తుంది. ముఖ్యంగా స్త్రీవిద్య, భార్యాభర్తల మధ్య సామరస్యం, పేదరికం, ఆత్మగౌరవంతో మెలిగే స్త్రీలు ముఖ్యంగా ధనత్రయోదశిలో విజయలక్ష్మి, బీద కుటుంబంలో వెంకమ్మ పాత్రలు. 'లలితా–శారద', 'అద్దమును సత్యవతియును' కథల్లో చిన్నపిల్లల మనస్తత్వాలను చక్కగా విశ్లేషించింది.

అచ్చమాంబ కథల్లో భాషను పక్కన పెడితే ఆమె వ్యక్తం చేసిన ఆధునిక భావాలను మనస్ఫూర్తిగా ఆహ్వానించాలి. 20వ శతాబ్దం తొలి దశకంలోనే అంతవరకు ఎవ్వరూ చేయని ప్రయత్నాలు స్త్రీల చరిత్ర రాయడం, కథ రాయడం ఆమె ఆధునిక భావాలను

స్పష్టంగా వ్యక్తం చేస్తాయి. ఆ కథల్లో కూడా కొత్త వస్తువులను ఆమె ఎంచుకున్నది. స్త్రీలకు ఆత్మగౌరవం, విద్య అనేవి మానసిక వికాసం కోసమని ఆమె చాలా బలంగా ప్రతిపాదిస్తుంది. వీలయిన చోటల్లా తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడిస్తుంది.

అచ్చమాంబ తన రచనల్లో అక్కడక్కడా పాతివ్రత్య ధర్మాల గురించి రాయడం కనిపిస్తుంది. ముఖ్యంగా 'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథంలోని కొందరి చరిత్రల్లో ఈ ప్రస్తావన కనబడుతుంది. అయితే ఆమె వీరేశలింగం లాగా పాతివ్రత్య ధర్మాలు స్త్రీలు ఆచరించాలని బోధించిన దాఖలాలు లేవు. ఈ విషయంలో అచ్చమాంబ వీరేశలింగంగారిని దాటి పురోగమించింది. ఈమె రచనల్ని అంచనా వేసేటపుడు వాటిని రాసిన కాలాన్ని, ఆనాటి సాంఘిక పరిస్థితుల్ని దృష్టిలో వుంచుకోవాలి. స్త్రీలకు విద్య అవసరం లేదని, చదువుకుంటే చెడిపోతారనే భావాలు వెల్లువలా ప్రవహిస్తున్న కాలంలో అచ్చమాంబ స్త్రీలకు విద్య అవసరం, విద్య లేకనే వారు వెనుకబడి వున్నారని సోదాహరణంగా వివరిస్తూ రచనలు చేసింది. పందొమ్మిదో శతాబ్దంలో నడిచిన పత్రికలన్నింటిలోను స్త్రీ విద్యమీద చర్చోపచర్చలు జరుగుతుండేవి. ముఖ్యంగా గృహలక్ష్మి, భారతి, హిందూసుందరి, సావిత్రి, తెలుగు జనానా, సరస్వతి, ఆంధ్రమహిళ, అనసూయలాంటి ఎన్నో పత్రికలలో ఈ అంశమై రచనలు,చర్చలు ఉండేవి. కందుకూరి వీరేశలింగంగారి చింతామణి, వివేకవర్ధనిలో కూడా ఈ చర్చలుండేవి.

"ఆంధ్రకవయిత్రులు" పేరుతో 200 మంది తెలుగు కవయిత్రుల చరిత్రలు రాసిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ తన పుస్తకానికి రాసిన "మనవి మాటలు" లో ఇలా అంటుంది. "వనితకు సరియైన అవకాశమూ ఇయ్యరు. పైన బహిరంగంగా కార్యకల్పనా ప్రమాణాన్ని, కావ్యరచనా చణత్వాన్ని తీవ్రంగా చర్చించేటప్పుడు "స్త్రీలలో సరియైన రచయితలు, కవయిత్రులు లేరని చెప్పడానికి విచారిస్తూ ఉన్నాము అని అలవోకగా, బాధ్యతారహితంగా వేదికల మీద పిడిగ్రుద్దులతో వాదనలను సిద్ధాంతీకరించడానికి వెనుకంజవెయ్యరు. ఔను. స్త్రీలకున్న అవకాశాలను గుర్తించి సత్యంగా మాట్లాడి సరియైన సిద్ధాంతం చెయ్యడానికి వారికి గల బాధ్యత యేమున్నది? ఏమి! యిట్లా మాట్లాడుతారు? అని నిలదీసి అడిగేదెవరు?" అంటూ ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ సూటిగా తన గ్రంథం "ఆంధ్రకవయిత్రులు'లో రాసింది. స్త్రీలకు విద్యను అందనీయకుండా, అవకాశాలు కల్పించకుండా చేసే సమాజం మీద ఆమె విమర్శ అంత ఘాటుగా వుంది. ఇదే విషయాన్ని అచ్చమాంబ తన రచనల్లో అనేకసార్లు ప్రస్తావించింది.ఇదే అంశమై విరివిగా ఉపన్యాసాలిచ్చింది. బృందావనం–స్త్రీల సమాజం పేరుతో స్త్రీల సంఘాలు ఏర్పాటు చేసింది. ఈ విషయాలు ముందుముందు ప్రస్తావనకు వస్తాయి.

అచ్చమాంబ రాసిన వ్యాస సముదాయం

తన భావాలను విరివిగా ప్రచారం చెయ్యడానికి, స్త్రీవిద్యను ప్రోత్సహించడానికీ అచ్చమాంబ ప్రముఖంగా ఎంచుకున్న పద్ధతి సాహిత్య రచన. కథలు రాస్తూనే ఎన్నో వ్యాసాలను రాసింది. ఆనాటి పత్రికలన్నింటిలో అచ్చమాంబ రచన ఏదో ఒకటి ఖచ్చితంగా వుండేది. ముఖ్యంగా 'హిందూసుందరి' పత్రికలో ఆమె రచనలెన్నో ప్రచురితమయ్యాయి. వాటిల్లో మొదట వచ్చేవి కథలైతే ఆ తర్వాత వచ్చేవి వ్యాసాలు. 1903 సంవత్సరం నాటి హిందూసుందరి పత్రికల్ని పరిశీలిస్తే ప్రతి నెలలో అచ్చమాంబ రచన ఖచ్చితంగా వుంటుంది. 1903 ఏప్రిల్ సంచికలో గృహిణీధర్మాలు, మే సంచికలో "ఆనందము" జూన్ సంచికలో "విద్యావంతులగు యువతులకొక విన్నపము", జూలై నెలలో అచ్చమాంబ బందరులో ఇచ్చిన ప్రసంగవ్యాసం, ఆగష్టు సంచికలో "భార్యాభర్తల సంవాదము" కథ, సెప్టెంబరు-అక్టోబరు సంచికలో "అద్దమును- సత్యవతి యును".ప్రచురించారు.

ఈ ఒక్క సంవత్సరంలోనే అచ్చమాంబ వివిధ ప్రక్రియల్లో చాలా సమర్ధవంతంగా రచనలు చేసింది. వీటన్నింటినీ నిశితంగా పరిశీలించినపుడు అచ్చమాంబ, రచనను ఒక సామాజిక బాధ్యతగా, తను చదివిన, తెలుసుకున్న జ్ఞానాన్ని తిరిగి సమాజానికి అందించాలన్న తపనతో నిరంతరాయంగా, నిర్విరామంగా రచనలు చేసింది. ఆ రచనల్ని మహారాష్ట్ర దేశం నుంచి, తెలుగు దేశానికి పోస్ట్ చెయ్యాల్సిన బాధ్యత వుండనే వుంది. క్రమం తప్పకుండా ప్రతినెల ఈ పనిచెయ్యడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

1902 ఆగష్టు నెల హిందూసుందరి సంచికలో అచ్చమాంబ 'సత్పాత్ర దానము' అనే కథను, "స్త్రీవిద్య యొక్క ప్రభావము" అనే చిన్నవ్యాసం రాసింది. 'స్త్రీవిద్య యొక్క ప్రభావము' అనే వ్యాసంలో అచ్చమాంబ రాసిన విషయాలు మిక్కిలి ఆశ్చర్యకరంగా వున్నాయి. ఇలాంటి ప్రాంతం భూప్రపంచం మీద వున్నదా? లేక అచ్చమాంబ ఊహాశక్తితో ఈ విషయాలు రాసిందా అనిపిస్తుంది.

"అయిస్ లండన్ ద్వీపమున స్త్రీపురుషులందరు సమానముగా విద్యను గాంతురు. అచట రాజకీయ హక్కులన్నియు స్త్రీపురుషులకు సమానముగా నియ్యబడును. ఆ రాష్ట్రమందు రమారమి 10,000 మంది జనులుందురు. అచట రాజవ్యవస్థ స్త్రీపురుషులు కలిసి యేర్పరచిన ప్రతినిధులచే నేలబడును. అచట విద్యాశాఖ వారందరూ స్త్రీలే. పాఠశాలలో విద్య గరుపు వారందరూ స్త్రీలే. ఆ ద్వీపమున నొక్కండును విద్యాహీనుడు లేడు. జనరక్షణ యంతయు నచట నాడువారే చేయుచుండినందున, నా దేశవాసులందరు నీతిధర్మము నెరిగినవారై యున్నారు. కాని నిచట కారాగృహము గాని, పోలీసువారు గానీ లేరు. సైన్యము లేదు. న్యాయస్థానములు లేవు. ఇది యంతయు స్త్రీవిద్యా ప్రభావమే కదా! ఇతర దేశములందిట్టి దృష్టాంతము లగుపడుచుండగా మనదేశమునందింకను కొందరు స్త్రీలకు విద్య నేర్పవచ్చునా? లేదా? యని వాదించుచునేయున్నారా."(హిందూసుందరి, ఆగష్టు, 1902)

ఆహా! ఏమి అద్భుతమైన ఊహ. స్త్రీలు విద్యావంతులైతే దేశానికి ఎంత లాభం కలుగుతుందో, సమాజంలో ఎలాంటి మార్పులొస్తాయో నొక్కిచెప్పడానికి ఇంత అద్భుతమైన ఊహాప్రదేశాన్ని ఆవిష్కరించింది. ఈ చిన్న వ్యాసంలో ఆమె ఎన్నో అంశాలను ప్రస్తావించింది. స్త్రీలు విద్యావేత్తలుగా, పరిపాలకులుగా వుంటే ఆ సమాజం ఎంత చక్కగా పురోగమిస్తుందో ఊహించింది. విద్యాహక్కు, రాజకీయ హక్కులు స్త్రీపురుషులిద్దరికీ సమానంగా ఇస్తారట. స్త్రీలు పరిపాలన చేస్తున్నారు కాబట్టి ఆ రాజ్యంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తుంటాయని అందుకే అక్కడ జైళ్ళు, పోలీసులు, కోర్టులు లేవని చెబుతూ ఇదంతా స్త్రీలు చదువుకోవడం వల్లనే జరిగింది కదా అంటూ బయట దేశాలు ఇంతగా స్త్రీల విషయంలో పురోగమిస్తుంటే మనదేశంలో మాత్రం స్త్రీలకు విద్య అవసరమా? కాదా? అని చర్చలు చేస్తున్నారని ఘాటైన చురక వేస్తుంది.

నేను ఆరోతరగతి చదువుతున్నపుడు మా స్కూల్‌లో స్త్రీలకు విద్య అవసరమా? కాదా? అని డిబేట్ పెట్టారు. మా ఊరి కరణం కొడుకు స్త్రీలు చదువుకుంటే చెడిపోతారు. వాళ్ళకు చదువెందుకు? వంట చేస్తే చాలు! అంటూ వాదించాడు. నేను వాడిని వ్యతిరేకిస్తూ గట్టిగానే వాదించాను. కానీ ఆరోక్లాసు చదివే పిల్లాడు 'స్త్రీలు చెడిపోతారు' అనడం, అసలు చెడిపోవడం అంటే ఏమిటి? అనే ప్రశ్నలు నాలో అప్పటినుండి రేగాయి. చదువువల్ల మగపిల్లలు ఎందుకు చెడిపోరు? ఆడపిల్లలే ఎందుకు చెడిపోతారు? అచ్చమాంబ కూడా ఈ ప్రశ్నని ఎదుర్కొన్నది. అందుకే వీలు చిక్కినపుడల్లా ఈ అంశం మీద రాసేది.

1903 మార్చి నెల హిందూసుందరిలో అచ్చమాంబ ప్రసంగవ్యాసం "బాలికా పాఠశాలలలోని లోపము - తన్నివారణోపాయము" ప్రచురితమైంది. ఈ వ్యాసంలో స్త్రీవిద్య

గురించి ఎంతో వివరంగా మాట్లాడింది. పులుగుర్త లక్ష్మీనరసమాంబ గారిని చూడటానికి వాళ్ళ గ్రామానికి వెళ్ళినపుడు అచ్చమాంబ గ్రామంలోని మహిళల నుద్దేశించి ఈ ప్రసంగం చేసింది. "ఐరోపా ఖండమునందు, నమెరికాదేశమునందు వర్తమాన కాలమున స్త్రీవిద్య యత్యంతమైన యుచ్ఛదశయందుండి యితర దేశములవారికి గన్నులపండువు సేయుచు స్వదేశమునకు ననేక లాభములను గీర్తిని కలుగచేయుచున్నది. అచ్చట స్త్రీలకు విద్యగరుపు మార్గమే వేరుగానుండును. ఆ దేశమందు స్త్రీలు పురుషుల కంటెను విశేషవిద్యను నేర్చి గొప్ప గొప్ప పరీక్షల యందు గృతార్థతను గాంచుచున్నారు... ఇతర దేశములకు యింత లాభకారియైన స్త్రీవిద్యవలన మనదేశమునకు సహితమట్టి లాభము కలిగినప్పుడు కదా మనకు విశేష స్వాతంత్ర్యమును, గౌరవమును గలుగును."

"అయిస్ లండన్ ద్వీపం" గురించి ఊహించి రాసినా, అమెరికా గురించి రాసినా స్త్రీవిద్యావశ్యకతను నొక్కి చెప్పడానికి తరచు ఇతర దేశాల సామ్యం తెస్తూ సమయస్ఫూర్తిగా రాయడం అచ్చమాంబ ప్రత్యేకత. ఇదే వ్యాసంలో బాల్యవివాహాల గురించి ఎంతో వివరంగా రాసింది.

"పిల్లలకు చిన్ననాటనే వివాహములు చేసి వారు యుక్తవయస్కులు కానపుడే కలిగిన సంతానమునకు దుర్బలత్వము స్వాభావికమని చెప్పువారిమాటలు, నేలపదును సేయక నిర్బలములగు బీజములు జల్లి యందుద్భవించిన యల్పత్వముగల ధాన్యముగతి అది ఆ ధాన్యమునకు స్వాభావికమని చెప్పునట్టి వ్యవసాయదారుని వాక్యముల వంటివని చెప్పవచ్చును."

ఎంత చక్కటి పోలికతో బాల్యవివాహాలను ఖండించిందో చూడండి. చిన్నతనంలోనే పెళ్ళిళ్ళు చేస్తే పుట్టే పిల్లలు దుర్బలురుగా వుంటారని చెబుతూ నేలను పదును చేయకుండా విత్తనాలు వేస్తే అలాంటి ధాన్యమే వస్తుందని ఇది మనుషుల తప్పే కానీ ఆ నేల తప్పు కాదని చెబుతుంది. పిల్లలు బలహీనంగా పుట్టడానికి కారణం బాల్యవివాహమేనని, బాల్యవివాహాలు వొద్దని ఉద్బోధిస్తుంది.

"మన దేశమత్యుష్ణ దేశమగుట వలన స్త్రీపురుషుల కల్పప్రాయముననే యవ్వనము సంప్రాప్తించును గాన వారికి వివాహములు చేయకుండిన వారు చెడు నడవడికలలోకి దిగుదురని కొందరందురు గానీ, అది ఆ దేశమునందలి గుణము కాదనియు సమాజములోనియు గొన్ని గ్రామాదులలోనియు నాచారమువలననే వచ్చుచున్నదనియు చెప్పితిని. గాన మనమును మన సమాజములో గొన్ని మార్పులు కలుగచేయవలెను. మనదేశమునందలి బాల్యవివాహములవలన స్త్రీలధిక దుర్బలులుగాను, వ్యాధిగ్రస్తులుగను నుండుచున్నారు."

ఈ ప్రసంగంలో అచ్చమాంబ స్త్రీల ఆరోగ్యం గురించి మాట్లాడింది. బాల్యవివాహాలు చేయడంవల్ల స్త్రీల ఆరోగ్యం దెబ్బతింటుందని, వివాహంద్వారా మీద పడే బాధ్యతలవల్ల, చిన్న వయస్సులోనే సంతానం కలగడంవల్ల స్త్రీలు దుర్బలులుగాను, వ్యాధిగ్రస్తులుగాను తయారవుతున్నారని, మన సమాజంలో మార్పులు రావాలని, బాల్య వివాహాలు చెయ్యకూడదనీ చెబుతుంది.

బాల్యవివాహములు చేయడంవల్ల ఎన్ని దుష్ప్రభావాలున్నాయో అచ్చమాంబ వివరించి చెప్పింది ఈ ఉపన్యాసంలో. బాల్యవివాహం గొప్ప దురాచారమని ఎలుగెత్తి చాటింది. ఆమె తన వాదాన్ని సమర్థించుకోడానికి వేదాలను, స్మృతులను చదివి అందులో బాల్యవివాహాల గురించి ఏమి చెప్పారో సోదాహరణంగా వివరించింది.

ఋగ్వేదంలోంచి ఒక శ్లోకాన్ని వివరిస్తూ దాని అర్థాన్ని విప్పి చెబుతూ "పతింకా మాయయాన" – అనగా పర్యాప్తయౌనయే యనగా, సంపూర్ణమైన యౌవనముగలదని భాష్యకర్తయగు 'మాధవాచార్యులవారు వ్రాసియేయున్నారు. ఈ వేదవాక్యముల వలన మనకు బాల్యవివాహములు వేదానుకూలమైనను కాకున్నను ప్రౌఢవివాహము వేదానుకూలమని స్పష్టముగా తెలియుచున్నది." అంటూ చిన్నపిల్లలకు పెళ్ళి చేయడం వేదవిరుద్ధమని తన వాదనను పరిష్టంగా వినిపిస్తుంది. వేదాలు, స్మృతులు ముఖ్యంగా మనుస్మృతి బాల్యవివాహాలు జరపమని ఎక్కడా చెప్పలేదని ప్రౌఢవివాహాలు మాత్రమే చేయమని చెప్పాయని సోదాహరణంగా చెబుతూ "ఓ యక్కలారా! మీరు మీ కూతురులకును, గొమారులకును చిన్నతనముననే వివాహములు చేయుడని భర్తలను పీడించుటవలన మన బిడ్డలకే నష్టము కలుగునని తెలుసికొనుడు. నా మాటల వలన మీలో గొందరయినను ధర్మశాస్త్రవిరుద్ధమగు బాల్యవివాహములు చేయుట యడగినచో యట్టివారి యెడల నేను మిక్కిలి కృతజ్ఞురాలనయ్యెదను." సంస్కృత భాషలో వుండే వేదాలను అచ్చమాంబ చదివిందనడానికి నిదర్శనంగా నిలుస్తుంది ఈ వ్యాసం. ఋగ్వేదాన్ని, మనుస్మృతిని కోట్ చెయ్యడం, తన వాదనని బలపరుచుకుంటూ బాల్యవివాహాలు మాని, ప్రౌఢవివాహాలు చెయ్యాలని విజ్ఞప్తి చేస్తుంది.

బాల్యవివాహాలు చెయ్యడం వల్ల ఆడపిల్లలు తమ బాల్యంతోపాటు అన్ని హక్కులూ కోల్పోతారనే విషయం అచ్చమాంబ ఆ రోజుల్లోనే అర్థం చేసుకుంది. దానికి వ్యతిరేకంగా రాయడం, మాట్లాడటం చాలా విరివిగా చేసింది. వందేళ్ళ క్రితం అచ్చమాంబ మాట్లాడిన విషయాలని ఇంకా ఇపుడు కూడా చెప్పాల్సి రావడమే పెద్ద విషాదం. ఇప్పటికీ వేల సంఖ్యలో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. సమాజం ఆధునికంగా పురోగమిస్తోందని, ఎంతో మార్పు అచ్చమాంబ జీవించిన కాలానికి, ఇప్పటికీ జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నాం కానీ స్త్రీల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్నాయి. ఆడపిల్లల పుట్టుక కూడా ప్రశ్నార్థకమై లింగనిర్ధారణ పరీక్షలు చేసి వాళ్ళని గర్భంలోనే

అంతమొందిస్తున్నారు. ఇలాంటి దారుణమైన అంశాలలో మాత్రం నిజంగానే మన సమాజం పురోగమిస్తోంది!

1903 జూన్ నెలలో "విద్యావంతులగు యువతులకొక విన్నపము" పేరుతో అచ్చమాంబ ఒక పెద్ద వ్యాసం రాసింది. ఈ వ్యాసంలో అనేక అంశాలను చర్చించింది. స్త్రీ విద్య, బాల్య వివాహాలు, స్త్రీ విద్యావ్యాప్తికి పురుషులు చేస్తున్న కృషి గురించి ఎన్నో విషయాలు రాసింది. బాల్యవివాహాలు చేయడం వల్ల స్త్రీలు విద్యకు ఎలా దూరమవుతారో అచ్చమాంబ ఇలా రాస్తుంది.

"ఆడపిల్లలను సాధారణముగా ఆరు సంవత్సరములు వచ్చినగానీ బడికి పంపరు. ఆ బాలిక ఒకటి రెండు పుస్తకములు చదివిన తోడనే వివాహమై బడివిడవవలసినదగును. ఈ యతి బాల్యవివాహముల వలన గలుగుచుండిన యసంఖ్యాకములగు నష్టములలో బాలికలకు అదివరకు నేర్చుచుండిన విద్యకు భంగము కలుగుచుండుట యొకటి యని చెప్పవచ్చును. ఈ నష్టము వలననే మనదేశమునకనేక కష్టములు కలుగుచున్నవని యిదివరకు కొందరు చెప్పియున్నారు.

అయితే పాఠశాల విడిచిన వెనుక విద్యాభివృద్ధి చేసికొనగూడదాయని కొందరనుటయు కలదు. కాని స్వల్ప కాలములో నేర్చిన అల్పవిద్యను బడివిడిచిన పిదప అభివృద్ధిగావించుకొనునిచ్ఛ యా చిన్నదానికి కలుగుటకా చిన్నది యల్పవయస్కురాలగా నుండును గాక సంభవింపదు. ఆమె తల్లి విద్య నేర్చినది కానందున బిడ్డకింట చదువు చెప్పుటకు సమర్థురాలు కాదు."

ఈ పేరాలో అచ్చమాంబ ఎన్ని విషయాలు చర్చించిందో చదువుతుంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. స్త్రీ విద్య గురించి మాట్లాడటం అంటే దాని చుట్టూ వున్న అనేక విషయాల గురించి మాట్లాడటం కూడా అవుతుంది. తన జీవితంలో చదువు విషయమై తానెదుర్కొన్న వివక్ష అచ్చమాంబ మనసులో ఎప్పుడూ గుచ్చుకుంటూనే వుండేది. ఆరేళ్ళకే పెళ్ళి చేసేయడం, ఆడపిల్ల చదువు గురించి అస్సలు ప్రాధాన్యతనీయకపోవడం ఆమెను చాలా బాధించే విషయాలు. బడికి పంపకపోవడం, పంపినా పెళ్ళి చేసి చదువు మాన్పించడం, పోనీ పెళ్ళయ్యాక చదువుకోనిస్తారా అంటే, ఉన్న ఊళ్ళో పాఠశాలలు లేకపోవడం, ఉన్నా దాన్నిండా పురుష టీచర్లుండడం, పెళ్ళయిన పిల్లని పురుషుల వద్దకు చదువుకోసం పంపకపోవడం ఇవన్నీ సమస్యలే. వీటన్నింటినీ చాలా సునిశితంగా గమనిస్తూ, ఈ అంశాల గురించి పదేపదే రాసింది అచ్చమాంబ.

బాల్య వివాహాలు తగవని, ఇవి శాస్త్ర సమ్మతాలు కావని రాస్తూ, బాల్యవివాహాలు స్త్రీలకు అన్ని విధాలా నష్టం కలిగిస్తున్నాయని, వారిని వివేక శూన్యులుగా, అజ్ఞానులుగా

తయారు చేస్తున్నాయని అనేక సందర్భాలలో అచ్చమాంబ వాదిస్తుంది. స్త్రీవిద్యకై పురుషులు చేస్తున్న ప్రయత్నాల గురించి రాస్తూ..

"పురుషులందరిన్ని విధముల బాటుపడుచుండినను దేశమందలి స్త్రీ విద్యయభివృద్ధి పొందకుండుటకు మూలము స్త్రీల యుపేక్షయేయని మొదటనే జెప్పి యుంటిని. దాన్నింకా విస్తరించి తెలిపెద. సాధారణముగా నీకాలమందు పట్టణములలో నుండి బాలికా పాఠశాలలకు బోని బాలికల సంఖ్య యత్యల్పమని అందరకు తెలిసిన విషయమే. అయితే పాఠశాలల కేగు బాలికలు పెద్దయిన పిదప తాము చిన్నతనమున నేర్చిన విద్యను బొత్తిగా మరిచిపోయి, దానివలన లాభము లెరుగలేక తమ బిడ్డలకే విద్య నేర్పవలదని భర్తలతో తగవులాడుచుందురు."

స్త్రీలు తాము చదువుకోకపోవడంవల్ల చదువు ప్రాముఖ్యత తెలియక తమ కూతుళ్ళ విద్యవిషయంలో కూడా అవివేకంగా ప్రవర్తిస్తారని అచ్చమాంబ రాస్తుంది. తల్లులు తమ ఆడపిల్లలను పాఠశాలలకు పంపకపోవడానికి మరో కారణం చదువు చెప్పేవారంతా పురుషులే అవడం వల్ల వివాహం జరిగిన తర్వాత తమ పిల్లలను స్కూళ్ళకు పంపరు. పోనీ పెళ్ళికి ముందు పంపుతారా అంటే అదీ వుండదు.

బాలికల చదువు గురించి అచ్చమాంబ ఎంతో పటిష్టమైన వాదనను తన రచనల్లో వ్యక్తం చేయడం పలుచోట్ల కనిపిస్తుంది. బాల్యవివాహాలు చేసి వాళ్ళ చదువును నాశనం చేస్తున్నారని ప్రసంగాల్లో కూడా చెబుతూవుండేది. స్త్రీలు చదువుకోకపోవడం వల్ల తల్లులుగా తాము నష్టపోతూ, కూతుళ్ళకు ఏమీ చేయలేకపోయారంటుంది. ఇలాంటి పరిస్థితులలో అందరం, ముఖ్యంగా చదువు నేర్చుకొన్న వాళ్ళం కొన్ని ప్రయత్నాలను చేయాలంటుంది. ఈవ్యాసం పేరే "చదువుకొన్న యువతులకొక విన్నపం". ఈ విన్నపంలో అచ్చమాంబ ఇలా చెబుతుంది.

"విద్యాభివృద్ధికి తగిన యుపాయము విచారింపగా విదుషీ స్త్రీలందరును కలిసి కుల స్త్రీల కొరకు నొక పాఠశాలను స్థాపించుటయేయని నా మనసుకు తోచుచున్నది. ఇట్లనుట విని నా చెలులు గొందరు అబ్బో యింతటి కార్యము మనచే నెటుల జరగగలదు. ఇట్టి కార్యము సేయుటకై పురుషులే జంకెదరని అనుదురేమో కానీ యే కార్యము సేయుటకైనను గొందరొక జట్టుగా గూడిన అది సులభ సాధ్యమగునని మీకు ముందు ఆ అనుభవమువలననే తెలియును. స్త్రీలందరు స్వేచ్ఛగా విద్య నార్జింపగల అమెరికా దేశమునందలి స్త్రీలు జట్టులుగానుండి తమ దేశమందలి యనేక దురాచారములను రూపుమాపి సదాచారమును నెలకొల్పియున్నారు."

ఆ వ్యాసంలో అచ్చమాంబ ఎంతో ఆశావహ దృక్పథంతో మనం చదువుకుంటే చాలదు, మన చదువును సమాజంకోసం వినియోగించాలని, స్త్రీలు తామంతా ఐక్యమై

సంఘాలు పెట్టి స్త్రీవిద్యను ప్రోత్సహించాలని, పాఠశాలలు నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చెయ్యాలని పిలుపునివ్వడం కన్పిస్తుంది. ఆమె ఎన్నో సార్లు విదేశాల్లో స్త్రీల సంఘాలు ఏర్పడడం గురించి ముచ్చటిస్తుంది. అమెరికాలో స్త్రీలంతా ఐక్యమై "సురాపాన భూతాన్ని" వెళ్ళగొట్టారని ఇదే వ్యాసంలో రాస్తుంది.

"తమ భర్తల నాశ్రయించి శరీర, ద్రవ్యముల నాశనమొందింపుచున్న సురాపానమను పెనుభూతమును చేరవదిలించి యా ప్రయత్నమున గొంత సఫల మనోరథులైనటుల మనము గ్రంథములలో చదివెదము. వారు గుంపుగా నుండి పురుషుల కెంతయు ప్రాణసమానముగా నుండిన సురాదేవిని దేశమునుండి వెడలగొట్టగలిగినపుడు... మనము జతకట్టి అవిద్యాభూతమును పారదోలుటకు యత్నించుటకేమి కష్టము" అంటుంది. అమెరికాలో మద్యానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ప్రస్తావనను అచ్చమాంబ ఇక్కడ తీసుకురావడం చూస్తుంటే ఆమె ఆంగ్లసాహిత్యాన్ని బాగా చదివినట్టు తెలుస్తోంది. లండన్ గురించి, ఫ్రాన్సు గురించిన ప్రస్తావన కూడా ఆమె కొన్ని చోట్ల చేసింది.

స్త్రీలకు మధ్యాహ్నం ఖాళీగా వుంటుంది కాబట్టి ఆ సమయంలో కాలక్షేపం కబుర్లు కట్టిపెట్టి విద్యావంతులగు స్త్రీలందరూ కలిసి ఒంతుల ప్రకారం ఉపాధ్యాయులుగా మారి, తమ ఖాళీ సమయాల్లోనే పాఠశాలకొచ్చి చదువుచెప్పాలని ఉద్బోధిస్తుంది. సామూహిక కృషి ద్వారా విద్యావ్యాప్తికి పాటుపడవచ్చని దీనివల్ల పరోపకారులన్న కీర్తిని కూడా సంపాదించుకోవచ్చని చెబుతుంది.

"ఇహప్రకారము విద్యావంతులగు సుందరులు గల ప్రతి గ్రామము నందును పాఠశాలలు స్థాపించబడినచో దేశమంతటను యల్పకాలములోనే స్త్రీ విద్య ప్రబలును."

స్త్రీ విద్య విషయంలో భండారు అచ్చమాంబ ఎంత తపన పడిందో అర్థం చేయించే వ్యాసమిది. నిజానికి ఈ వ్యాసానికి ఈ నాటికీ ఎంతో విలువ వున్నదనిపిస్తుంది. అచ్చమాంబ ఈ అంశాలు రాసి వంద సంవత్సరాలు దాటినా, మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్ళు దాటినా స్త్రీ విద్య విషయంలో, అక్షరాస్యత విషయంలో ఇంకా మనం ఎంతో వెనకబడివున్నాం. ఈనాటికీ అన్ని గ్రామాల్లోను పాఠశాలలు ఏర్పడలేదు. ముఖ్యంగా సమాజంలో అణిచివేతకు గురౌతున్న వర్గాలైన స్త్రీలు, దళితులు, ఆదివాసీలు ఇంకా సంపూర్ణ విద్యకి నోచుకోవడం లేదు. ఆదివాసీ గ్రామాల్లో ఇంకా పాఠశాలలు పూర్తిగా ఏర్పడలేదు. అచ్చమాంబ చెప్పినట్టు చదువుకున్న వారు, చదువురాని వారికోసం పాఠశాలలు నిర్మించి చదువు చెప్పినట్లయితే ఎంతో మార్పు జరిగివుండేది.

అచ్చమాంబ ఆశించిన విద్యాభారతం ఇంకా సంపూర్ణంగా ఏర్పడలేదన్నది చేదునిజం. ఎన్నో అంశాలను ఎంతో లోతుగా శోధించి ఆధారాలతో సహా రాసిన అచ్చమాంబ

వయస్సును పరిగణనలోకి తీసుకుంటే, ఆనాటికి ఆమెకు ముప్ఫయ్ ఏళ్ళు కూడా నిండలేదు. బాల్య వివాహం జరిగి, తెలుగునేలకి అవతల నివసిస్తూ, ఇద్దరు పిల్లల తల్లై, సంసారబాధ్యతల్లో నిండామునిగి కూడా ఆమె తన సామాజిక స్పృహను కాపాడుకుని, ఆనాటి సమాజంలో ప్రబలివున్న సమస్యల మీద తన కలం ఎక్కుపెట్టింది. ఆనాడు ప్రచురితమౌతున్న ఎన్నో పత్రికలకు తన రచనలను విరివిగా పంపుతుండేది. హిందూసుందరి, తెలుగు జనానా, సావిత్రి మొదలైన పత్రికల్లో తరచుగా ఆమె కథలు, వ్యాసాలు, ప్రసంగ వ్యాసాలు అచ్చయ్యేవి. ఆమె రచనని ఆషామాషీగా, కాలక్షేపానికి రాయాలనుకోలేదు. ఒక నిబద్ధతతో తాను నమ్మిన అంశాల మీదనే రాసేది, స్త్రీల పక్షపాతిగా స్త్రీల అంశాలమీదనే రాసేది. స్త్రీలు చదువుకోవాలని, విజ్ఞానవంతులు కావాలని, బాల్య వివాహాలుండకూడదని ఆమె రాసేది. ఆమె రచనల్లో బీదలు, స్త్రీలు ఎక్కువగా దర్శనమిస్తారు.

స్త్రీల సమాజస్థాపనం/ బృందావన సమాజం

స్త్రీలు ఐకమత్యంగా వుండాలని, సంఘాలను ఏర్పరచుకోవాలని తరచు అచ్చమాంబ రాసేది, చెప్పేది. తొలి కథ రాసిన అచ్చమాంబే తొలి స్త్రీల సమాజం కూడా స్థాపించింది. తెలుగుదేశంలో అప్పటివరకు స్త్రీల కోసం ఒక సమాజం స్థాపించడం అనే ఆలోచన కూడా లేదు. అలాంటి చోట అచ్చమాంబ చొరవతో మొట్టమొదటి స్త్రీ సమాజం 'బందరు స్త్రీ సమాజం' ఏర్పాటయ్యింది.

అచ్చమాంబ, భర్త మాధవరావుతో కలిసి ప్రతి సంవత్సరం శెలవుల కోసం నాగ్‌పూర్ నుండి ఆంధ్రదేశానికి వచ్చి నెల రోజులుండేది. ఆ సమయంలోనే వారి బంధువుల్ని, స్నేహితుల్ని కలుసుకుంటూ రాష్ట్రమంతా తిరిగేవారు. ఈ విషయాలను నిడదవోలు వెంకట్రావుగారు, ముద్రణ పొందని "భండారు అచ్చమాంబ జీవితం" లో ఇలా రాసారు.

"బందరు స్త్రీ సమాజ స్థాపనము"

బందరు వెళ్ళినపుడామె తొలుత అక్కడ స్త్రీ సమాజము నేర్పరచుటకు సమావేశము నేర్పాటు చేసెను. స్త్రీలొకరిద్దరు మాత్రమే తప్ప తక్కిన వారు రానేలేదు. అయినను అక్కడి వారందరూ నేకగ్రీవముగా స్త్రీ సమాజమావశ్యకమని తీర్మానించి, ఆ తీర్మానం ప్రకారం "బృందావన స్త్రీ సమాజము" తొలుత బందరులో స్థాపితమయ్యెను. ఇదియే తెలుగు దేశమున మొదటి స్త్రీ సమాజము.

'కృష్ణా పత్రిక స్థాపనము"

అప్పుడే 1920లో కృష్ణా పత్రిక స్థాపనము జరిగినది. ముట్నూరి కృష్ణారావు గారు, కొండా వెంకటప్పయ్యగారు నిట్టి సంస్థ స్థాపనకు.... హేతుభూతురాలైన అచ్చమాంబ గారిననేక విధముల కొనియాడి సమాజ స్థాపనకు తోడ్పడిరి."

"బందరు స్త్రీ సమాజము"

"నేటికి డెబ్బది నాలుగేండ్ల నుండి యవిచ్ఛిన్నముగా నీ సమాజము నడుచుచున్నది. ఈ సమాజము వారొక ఉన్నత పాఠశాలను నడుపుచున్నారు. అచ్చమాంబ గారిని గూర్చి పాటలు నేటికిని ఆ పాఠశాలలో పాడుచుందురట'8.

కాకినాడలో మొసలి కంటి రమాబాయమ్మగారు ప్రకటించుచుండిన హిందూ సుందరీ పత్రికకు వ్యాసములు రాసినది కావున ఆమె వారికి చిరపరిచితురాలు. వారును ఆమె ప్రోత్సాహమున కాకినాడలో 'స్త్రీ సమాజమును స్థాపించిరి. అచ్చటి స్త్రీ సమాజము పేరు "విద్యార్థినీ సమాజము".

నిడదవోలు వెంకట్రావు గారు రాసిన పై అంశాలను గమనించినపుడు అచ్చమాంబ స్త్రీల కోసం విరివిగా రాయడమే కాక స్త్రీల సమాజాలను స్థాపించినట్టు తెలుస్తోంది. ఆమె తెలుగునేల మీదికి వచ్చినపుడల్లా ఏదో ఒక సమావేశంలో పాల్గొని ఉపన్యసించడం పరిపాటి. ఆ ఉపన్యాసాల నిండా మళ్ళీ స్త్రీ విద్య యే ముఖ్య అంశంగా వుండేది. తాను చదివిన ఎన్నో అంశాల గురించి సమావేశాల్లో చెబుతుండేది. అచ్చమాంబ ఏ సమావేశంలో మాట్లాడినా, ఆ సమావేశ నిర్వహకులు ఆహ్వాన పత్రం ముద్రించి అచ్చమాంబ గురించి రాసేవారు. అలాంటి ఒక సభకు అచ్చమాంబను పరిచయం చేస్తూ

"మధ్య పరగణాల యందు సచయనను సహధర్మచారిణి, మునగాల ఎస్టేట్ దివాన్‌గా నున్న లక్ష్మణరావుగారి సోదరియు, అబలా సచ్చరిత్రరత్న మాలయను గ్రంథమును రచించినట్టియు యిచట ప్రచురింపబడుచుండు, హిందూ సుందరి పత్రికకు చక్కని వ్యాసములు వ్రాయునున్న శ్రీమతి భండారు అచ్చమాంబ గారు సకుటుంబ సమేతముగా యీ నెల 17 తేదీని ఈ గ్రామమునకు విచ్చేసిరి. ఆమె గారి పోష్యమున దినదినాభివృద్ధి పొందుతున్న హిందూ సుందరి ఆఫీసును చూచి, హిందూసుందరిని అనేక రెట్లు వృద్ధిలోకి తేవలయునను తలంపే యీమె నిటకు తోడ్కొని వచ్చినది. ఈమె గారిటీవల మచిలీ బందరు నందు జనానా స్త్రీలను సంఘముగా చేర్చి యుపన్యాసము లిచ్చునట్లును, జనానా స్త్రీల కొక సమాజమును స్థాపన చేయించినట్లును వార్తా పత్రికలన్నియు చాటియేయున్నవి. 19వ తేదీన సోమవారము రోజున ఏలూరు నందు హిందూ సుందరీ కార్య స్థాపనమున జనానా స్త్రీల సభ జరిగెను. దాదాపు 200మంది స్త్రీలు సభనలంకరించిరి."

హిందూ సుందరి పత్రికలో వచ్చిన ఈ మీటింగ్ రిపోర్ట్ అచ్చమాంబకు సంబంధించిన ఎన్నో విషయాలను పేర్కొన్నది. ఆమె హిందూ సుందరి ఆఫీసుకు రావడం, అక్కడ స్త్రీల సంఘాన్ని ఏర్పరచడం, అంతకు ముందు మచిలీ బందరులో బృందావన సమాజాన్ని స్థాపించడం, ఆమె ప్రసంగించిన ఏలూరు సభకు 200 మంది మహిళలు హాజరయ్యారని తెలిపే ఎన్నో అంశాలు ఈ రిపోర్టులో నమోదు అయ్యాయి.

అలాగే అచ్చమాంబ మీద ఆనాటి సభా నిర్వాహకులు వేసిన ఆహ్వాన పత్రం చూడండి. ఈ పత్రాన్ని ఆనాడు వేమవర్పు మహాలక్ష్మమ్మగారు సభలో చదివి విన్పించారు.

"మీ అందరి పక్షమునను, స్త్రీల శ్రేయోభివృద్ధి గోరిన యెల్లరి పక్షమునకును శ్రీమహాలక్ష్మీ తుల్యురాలగు భండారు అచ్చమాంబ గారిని ఈ పురమునకు ఆహ్వానము చేయుచున్నాను. ఈమె ముఖారవిందము మనకు క్రొత్తయైనను ఈమె నామము ప్రతీ గృహమునను స్మరించబడుచునే యున్నది. అదృష్టవశాత్తు, హిందూ సుందరీ పత్రిక యిచట ప్రకటింపబడుతావు కనుక, ఆమెకా పత్రికా పుత్రియందుగల యభిమానము చేతనో లేక మన యదృష్టము చేతనో యీమె యిచటకి రాతటస్తించుటయు, ఆమె గారి వలన కొన్ని సంగతులు విను దశ కలుగుటయు చూడ, నేడు సుదినముగా భావించుచున్నాను. ముసు, మొల్ల, తరిగొండ వెంకమ్మ మొదలగు విద్యాసుందరులుండి మన స్త్రీ తెగకంతయు వన్నె తెచ్చిరి. అట్టి వారి నామములు వినుటయే తటస్థించినది. నేడు వారితో సమానురాలగు నీమెగారిని కన్నులారగాంచు భాగ్యము లభించినది. స్త్రీలయభివృద్ధి గోరి పాటుపడుచుండిన మహనీయురాండ్రలో యీమె అగ్రగణ్యురాలు." అంటూ ఆనాటి సభలో ఆహ్వాన పత్రం చదివారు.

ఆంధ్ర దేశానికి ఎంతో దూరంగా నివసించినప్పటికీ అచ్చమాంబ తన రచనల ద్వారా తెలుగునేల నలుమూలలా ప్రాచుర్యం పొందిందని దీనిద్వారా తెలుస్తోంది. ఆమె రచనలు ఎంతగా ప్రాచుర్యం పొందాయో ఆమె ఉపన్యాసాలు కూడా అంతే వినుతి కెక్కాయి. ఆమె చెప్పేది వినాలని స్త్రీలు తహతహలాడేవారు. ఆహ్వాన పత్రంలో ఆమెను స్త్రీల అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తిగా చెబుతూ ఆమెను మొల్ల, తరిగొండ వెంగమాంబతోనూ పోల్చారు.

ఆ సమావేశంలో అచ్చమాంబ రెండు గంటలు అనర్గళంగా మాట్లాడింది. ఎన్నో విషయాల గురించి చర్చించింది. ఆ రెండు గంటల ఉపన్యాసం నిండా వున్న అంశాలు స్త్రీలకు సంబంధించినవేననడంలో ఎలాంటి సందేహమూ లేదు. ముఖ్యంగా స్త్రీ విద్యగురించి, స్త్రీలు సమాజాలుగా, సంఘాలుగా ఏర్పడాల్సిన ఆవశ్యకత గురించి ఉపన్యసించింది.

"సోదరీమణులారా! నేటి సాయంకాలము ఇచ్చట మనమందరము కూడియుండుట చూసి నాకు చాలా సంతోషకరముగానున్నది. యిటువలెనే స్త్రీలందరు వారమునకు ఒక సారి అయినను, లేక నెలకు ఒక దినమైనను విలువైన ఏర్పాటు చేసుకుని విద్యవిషయమై సంభాషణము చేసిన యెడల చాలా లాభకరముగా నుండును" అని మొదలు పెట్టి నాగపూర్‌లో స్త్రీలు సాహసవంతులై ఉంటున్నారని, బొంబాయిలో కొందరు స్త్రీలు కలిసి స్త్రీల కోసం పత్రికను మొదలుపెట్టి నడుపుతున్నారని చెబుతూ అటువంటి దశ మన స్త్రీలకు ఎపుడు కలుగుతుందో అని వాపోతుంది. స్త్రీలు కాలక్షేపం కబుర్లు, ఒకరి మీద మరొకరు

కొండెములు చెప్పుట మాని, అందరు కలసికట్టుగా వుండి స్త్రీ విద్యావిషయములే మాట్లాడాలని కోరుతుంది.

"మనము చాలా కాలము వ్యర్థముగా గడుపుదుము. అందులో కొంతకాలము చదువు విషయమై ఏర్పర్చుకొన్న యెడల ఎంత లాభమో పొందగలము. కాబట్టి ఇచటవున్న మీరు అందరు కలిసి ఒక చిన్న సమాజము ఏర్పర్చుకొనవలయునని నా ముఖ్య అభిప్రాయము" అంటూ తన ఉపన్యాసం ముగిస్తుంది. ఆమె ఉపన్యాసాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా, విజ్ఞానవంతంగా వుండేవి.

ఆనాటి సమావేశంలో ఒక ముఖ్యమైన అంశమేమంటే 50 మందితో కలిసి అచ్చమాంబ దిగిన గ్రూప్ ఫోటో. ఏలూరు పట్టణంలోని ప్రముఖులతో, ముఖ్య స్త్రీ నాయకులతో అచ్చమాంబ ఆ ఫోటో దిగిందని తెలుస్తోంది. ఈ ఫోటో సంపాదించడానికి నేను చాలా ప్రయత్నం చేసాను. ఏలూరు వెళ్ళాను కానీ ఎలాంటి సమాచారమూ దొరకలేదు. 50 మందితో కలిసి దిగిన ఆ ఛాయాచిత్రం చాలా అపురూపమైందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దానిని దొరికించుకోలేకపోయినందుకు నిజంగా నాకు చాలా బాధగా వుంది.

ఆనాటి సమావేశం ముగిసిన వెంటనే వడ్లమన్నాటి సుందరమ్మ అనే ఆవిడ అచ్చమాంబ ఉపన్యాసం గురించి తన స్పందనను కింద విధంగా తెలియచేసారు.

"అచ్చమాంబగారు కాశీ వెళ్ళబోవుచున్నారు. వీరు చాలా విద్య నేర్చినవారు గనుక దానివలన గలుగు లాభములకనుగొన్నవారవుట చేత ఆ లాభము మనమందరికి చెప్పియున్నారు. వీరు బందరులో ఒక సభ చేసి ఉపన్యాసములిచ్చిరి. అచ్చట వున్నవారంతా వీరి ఉపన్యాసము విన్న పిమ్మట, వారందరు యీమె యిష్టప్రకారము పదిహేను రోజులకో, నెలకో ఒక సభచేసి, విద్య విషయమై ఉపన్యాసములు చేయుచుండుమని వీరితో చెప్పినారు. ఆ రీతిగనే మనమును సభచేయుదుమని వీరితో చెప్పగలందులకై నా కోరిక."

అచ్చమాంబ ఏ ఊరికెళ్ళి ఉపన్యసించినా ఇదే విధమైన స్పందన వచ్చేది. ఆమె మాటలు వినడానికి స్త్రీలు అధిక సంఖ్యలో మీటింగులకు వచ్చేవారు. సమావేశాలు పూర్తయి ఆమె తిరిగి ప్రయాణమయ్యేటపుడు కూడా ఆ ప్రాంతపు స్త్రీలు మళ్ళీ మీటింగు పెట్టి, వీడ్కోలు ఉపన్యాసం ఇచ్చి మరీ పంపేవారు. ఆంధ్రదేశంలో ఆనాడు అచ్చమాంబ అంతటి ఆదరణను, ఆత్మీయతనూ సంపాదించుకొన్నది.

వీడ్కోలు సభలో తిరుప్రవరపు కామేశ్వరమ్మ అనే ఆవిడ యిచ్చిన ఉపన్యాసం చూడండి. ఆమె తమను వీడిపోవడం భరింపరానిదిగా వుందని, కొద్దికాలం ఆమెతో గడిపినా అనేక అంశముల గురించి ఆమె ద్వారా నేర్చుకొన్నామని, ఆమె సూచించినట్టుగానే

అందరం వారానికి ఒక సారి కలుసుకుంటూ ముచ్చటించుకోవడం వల్ల శీఘ్రకాలంలో తాము కూడా అభివృద్ధి చెందగలమని చెబుతూ

"యీమె మన విద్యాభివృద్ధికై స్వకాయ కష్టమునకోర్చి చేయుచున్న కృషికి అత్యంతానందమునొందుచు, మీ యందరి తరపున ఈమెకనేక వందనములాచరించు చున్నాను." అనంతరం కొందరు స్త్రీలు ఆమెపేరు మీద రాసిన మంగళ హారతులు పాడి, అందరూ కలిసి రైల్వే స్టేషను వరకు వెళ్ళి ఆమెను రైలెక్కించారు.

ఆమెను కలిసిన స్త్రీలు అచ్చమాంబను ఎంత ప్రేమించారో నిరూపించడానికి చిన్న ఉదాహరణ ఇది. అచ్చమాంబ ఏలూరు నుండి రాజమహేంద్రవరం, కాకినాడ లాంటి పట్టణాలు దర్శించి ఉపన్యాసాలిచ్చింది. ఎన్నో చోట్ల స్త్రీల సమాజా లేర్పరచింది. ఆమెను చూడగానే ఆనాటి స్త్రీల మనసులో భావాలెలా వుండేవో హిందూ సుందరి పత్రిక ఇలా రాసింది.

"ఈమెను చూచిన తోడనే మన స్త్రీలను బానిసల వలె యణగ దొక్కి, వారికి గల తెలివితేటలను భస్మీభూతము చేయుచుంటిమి కదా యని ఆలోచింపవలసి వచ్చుచున్నది."

స్త్రీలకు చదువు సంధ్యలు నేర్పకుండా వారిని బానిసల్లాగా అణిచేస్తున్నారని, అచ్చమాంబ బాగా చదువుకొని, తెలివితేటలు పెంచుకుని ప్రకాశమానంగా వెలుగుతున్నదని, ఆమెను చూస్తే ఈ తారతమ్యం తెలుస్తుందని దీని అర్థం. అచ్చమాంబ ఉపన్యాసాల్లో విద్య ప్రధాన విషయంగా వుండేది. దేశ విదేశాల్లోని ఎన్నో ఉదాహరణలను తన ప్రసంగాల్లో జొప్పించేది.

అచ్చమాంబ తెలుగు ప్రాంతాలకి ఎప్పుడొచ్చినా చాలా కార్యక్రమాలతో తీరిక లేకుండా వుండేది. బంధువులను, స్నేహితులను కలవడం చేసేది. అక్కడి స్త్రీలను కలవడం, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రసంగాలు చదువుకోవాలని, కాలక్షేపం కబుర్లు మానేసి, చదువుకున్నవారు తమ ఖాళీ సమయాన్ని చదువురాని స్త్రీలకు చదువుచెప్పడానికి వినియోగించాలని ఉద్బోధించేది. తను రాయదలసిన పుస్తకాల సమాచార సేకరణ, ఆయా రంగాల వ్యక్తులతో చర్చలు కూడా చేసేది.

అచ్చమాంబ స్థాపించిన బృందావన స్త్రీ సమాజం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేది. ఆమె మరణానంతరం కూడా ఇవి పని చేస్తూనే ఉన్నాయనడానికి చక్కటి ఉదాహరణ ఫిబ్రవరి–మార్చి 1905 హిందూ సుందరి పత్రిక ప్రచురించిన ఈ ప్రసంగ వ్యాసం. మోటుపల్లి రాజాబాయమ్మ అనే ఆవిడ చాలా సుదీర్ఘమైన ఉపన్యాసం ఇస్తూ స్త్రీ విద్యకు సంబంధించి ఎన్నో అంశాలను పేర్కొన్నది. స్త్రీ విద్య గురించి, స్త్రీ పురుషుల సమానత్వం గురించి ఆమె మాట్లాడిన ఈ అంశాలు చూడండి– అచ్చమాంబ ప్రభావం ఈ సమాజ సభ్యుల మీద ఎంత ఉన్నదో అర్థమౌతుంది.

స్త్రీలు చదువుకుంటే చెడిపోతారని, స్త్రీల చదువు విటులకు ఉత్తరాలు రాయడానికి మాత్రమే పనికి వస్తుందనే ఛాందసుల వాదనల్ని తిప్పికొడుతూ రాజాబాయమ్మ ఇలా అంటుంది.

"ఏక పదార్థమే (చదువు) పురుషులకు లాభమును, స్త్రీలకు నష్టమును కలుగుచేయుననే అంశము సత్యమో, అసత్యమో విచారింతము.

1. ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రుని మీద చేయివేయునెడ ఆమె చెయ్యి కాలునని ఆబాలవృద్ధులందరికి తెలిసిన సంగతియే కదా! అట్టి అగ్నిహోత్రుని మీదనే పురుషుడు చేతినుంచునెడల ఆయన చెయ్యి కాలదు కాబోలు!!

2. ఒక తులము విషమొక స్త్రీ లోపలికి పుచ్చుకున్న యెడల ఆమె చనిపోవునని సమస్త మానవుల మనస్సులకు గోచరమే కదా! ఆ విషమునే పురుషుడు లోపలికి పుచ్చుకొన్న యెడల ఆయన మృత్యువునోట పడడు కాబోలు!!

3. ఒక గుప్పెడు పంచదారను వెలది నోటిలో వేసుకొన్న యెడల అది ఆమెకు మాధుర్యముగా నుండునని మీ యుల్లంబులకు తెల్లంబే కదా! ఆ పంచదారనే పురుషుడు వేసికొన్నయెడల అది ఆయనకు తియ్యగా వుండదు కాబోలు!

ఆపై వాటిని బట్టి విచారించగా ఏకపదార్థమే పురుషులకొక ఫలితమును, అతివలకు మరియొక ఫలితమును కలుగచేయుననడము తమ మూర్ఖత్వమును వెల్లడిబర్చుకొనుట తప్ప వేరొకటి కాదు.ఇంకా పొలతులకు విద్యవచ్చిన చెడునడత అధికమగునని కొందరు చెప్పుచుందురు. వారు చెప్పిన ప్రకారమే పురుషులకు విద్య వచ్చిన యెడల వారు మాత్రము జారభామలకు గమ్మలను రాయరా? విద్యవచ్చినంత మాత్రము చేత పురుషులందరూ వ్యభిచారులగుతున్నారా?"

మోటుపల్లి రాజాబాయమ్మ ఇచ్చిన ఈ అద్భుతమైన ఉపన్యాసంలో ఆమె ఎంతో హేతుబద్ధంగా స్త్రీ విద్యను సమర్థించింది. స్త్రీలకు ఒక న్యాయం పురుషులకు ఒక న్యాయం ఏమిటని ఆనాడే నిలదీసిన ఈ బృందావన సమాజం అచ్చమాంబ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చింది. అప్పటివరకు స్త్రీలు సంఘాలుగా ఏర్పడడం, స్త్రీలకోసం ఒక సమాజాన్ని నిర్మించడం అనేది ఊహకందని విషయం. సంఘాలు ఏర్పాటు చేయడం ఒక ఎత్తైతే, ఎంతో స్ఫూర్తిదాయకమూ, చైతన్యవంతమూ అయిన ప్రసంగాలను చేయడం మరో ఎత్తు. దేశ విదేశాల్లోని ప్రతిభావంతులూ, మేధోమూర్తులూ అయిన స్త్రీమూర్తుల జీవితాలను, వారి కళానైపుణ్యాలను ఉదాహరణలుగా చూపడం అచ్చమాంబకి వెన్నతో పెట్టిన విద్యలాగా అలవడింది. ఆనాటి స్త్రీలను ఉత్తేజితుల్ని చేయడానికి, మూఢాచారాల్లోంచి బయటకు లాగడానికి, వారిని విద్యావంతుల్ని చేయడానికి అచ్చమాంబ జీవితాంతం కృషి చేసింది.

అక్కా తమ్ముళ్ళ అనుబంధం

కొమర్రాజు లక్ష్మణరావుగారికి తన అక్కగారి పట్ల ఎంతో ప్రేమ వుండేది. చిన్నతనంలో తమ్ముడితోపాటు ఆమె చదువు నేర్చుకొన్నది. తల్లి లక్ష్మణరావు చదువుకోసం ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసింది. కానీ అచ్చమాంబ విషయం పట్టించుకోలేదు. కానీ తమ్ముడు మాత్రం ఆమె చదువు నేర్చుకోవడానికి ఎంతో సహాయం చేసాడు. సెలవులలో అక్కగారింటికి తరచూ వచ్చేటపుడు ఎన్నో పుస్తకాలు తెచ్చియిచ్చేవాడు. ఆమెకు అర్థంకాని విషయాలను విడమర్చి చెప్పేవాడు. అతని తోడ్పాటుతోనే ఆమె ఇంగ్లీషు, గుజరాతి, సంస్కృతం భాషలు నేర్చుకొన్నది. సంస్కృతభాషని నేర్చుకోవడమేకాక స్వయంగా సంస్కృత గ్రంథాలను చదివి, అధ్యయనం చేయగల శక్తిని సంపాదించింది. ఆమె నివాసం నాగపూర్ అవ్వడం వల్ల మరాఠీని ధారాళంగానే నేర్చుకొన్నది.

'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథరచనకు ప్రేరణ నిచ్చినవాడు లక్ష్మణరావు గారే. అచ్చమాంబకు పుట్టిన ఇద్దరు పిల్లలు చనిపోయి పుట్టెడు దుఃఖంలో వున్నప్పుడు ఆమెను ఓదార్చి, ఆమెను గ్రంథ రచనవేపు మళ్ళించినవాడు ఆయనే. ఆమె దుఃఖంలో కూరుకుపోకుండా వుండడానికి గాను నాగోజిభట్టు చరిత్రను ఆమెకు చెప్పి, ఆయన తన బిడ్డల మృతిని తట్టుకోలేక బాధపడుతూనే గ్రంథరచనకు పూనుకొన్నాడని, అతను చెప్పిన విషయాన్ని ఆమె మనస్సులో ముద్రించుకున్నది. నాగోజిభట్టుగారివలెనే తానునూ మనస్సును సమాధాన పరుచుకొని, దుఃఖం నుండి బయటపడి "అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథరచనకు పూనుకొని తెలుగులో మొదటి స్త్రీల చరిత్ర రచనకు శ్రీకారం చుట్టింది. "విజ్ఞాన చంద్రికలు వెదజల్లిన లక్ష్మణరావు" – శ్రీ కానుకూరి వీరభద్రేశ్వరరావు గారు లక్ష్మణరాయ వర్ధంతి, తెలుగుతల్లి ప్రత్యేక సంచికలో ఇలా రాసారు.

"ఇంటివద్ద తీరిక వేళలలో లక్ష్మణరావు గారును, వీరి సోదరియగు అచ్చమాంబ గారును కలిసి తెలుగు పుస్తకములను వార్తాపత్రికలను తెప్పించి పట్టుదలతో చదువుచుండిరి. భండారు అచ్చమాంబ గారికి పుత్రవియోగము కలుగగా లక్ష్మణరావు గారు అక్కగారిని

ఓదార్చి దుఃఖోపశమనము నిమిత్తము ఆమెయును తానును కలిసి చరిత్ర గ్రంథములను అనేకములను పరిశోధించిరి. "అబలా సచ్చరిత్ర రత్నమాల" అను గ్రంథమును వ్రాయుటలో లక్ష్మణరావుగారు తోడ్పడుటయేగాక అనేక భాషలలోని వందలకొలది ఉత్తమ గ్రంథములను సేకరించి వారి అక్కగారిని విదుషీమణిగా చేయుటకు కారణభూతులైరి." కీ.శే. కొమర్రాజు వెంకటలక్ష్మణరావు గారు – శ్రీ రాయసం వెంకట శివుడు – లక్ష్మణరాయ వర్ధంతి, తెలుగుతల్లి ప్రత్యేక సంచిక – సంపాదకురాలు, రాచమళ్ళ సత్యవతీదేవి, సహాయ సంపాదకులు అడవి బాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, వట్టికోట ఆళ్వారుస్వామి.

కొమర్రాజు లక్ష్మణరావు గారి మీద ప్రచురించిన ఈ ప్రత్యేక సంచికలో శ్రీ రాయసం వెంకట శివుడు (తెలుగు జనానా పత్రిక యజమాని) లక్ష్మణరావు, అచ్చమాంబల ఆత్మీయ బంధం గురించి ఇలా రాసారు.

"లక్ష్మణరావుగారి యక్క కీ.శే. భండారు అచ్చమాంబ గారు తెలుగు జనానా పత్రికకు వ్యాసములు వ్రాయుచుండిరి. అక్కతమ్ముల కపారమగు అన్యోన్య ప్రేమయే కాదు అవినాభావమని కూడా చెప్పవచ్చు. తమ్ముని కళాశాల విద్యయందు ఎక్కువ శ్రద్ధ వహించిన అక్క యొక్క జ్ఞానపరిపోషణమునందును, ఆమెకు విశాలభావములు కుదుర్చునట్లును తమ్ముడు మిగుల పాటుపడెను. దీని పర్యవసానమేమనగా, ఆంగ్ల మహారాష్ట్ర గ్రంథములు వారిరువురును పఠించి, వానియందలి యుపయుక్త విషయములు ఆంధ్రుల ఉపయోగార్థమై తెలుగు చేయుచు వచ్చిరి. ఆ కాలమున తెలుగు వార్తాపత్రికల సంఖ్య చాలా తక్కువ. నా పత్రిక ఆంధ్ర స్త్రీల కొరకేర్పడినది గావున, అచ్చమాంబ గారు జనానా పత్రికకు తరుచుగ వ్రాయుచూ వచ్చిరి..... ఈ అక్కతమ్ముల అన్యోన్యానురాగ మింతింతయని చెప్పుటకు వీలులేదు. వీరి శరీరములు వేరయినను ప్రాణములొకటియే యయినట్లుండెడివారు" అని రాసారు

కొమర్రాజు లక్ష్మణరావు గారి 21వ వర్ధంతి సభలో కవితిలక కాంచనపల్లి కనకాంబగారు తన సోదరి కీ.శే. భండారు అచ్చమాంబను ఆదర్శ విజ్ఞానవతిగా, సంఘసేవకురాలుగా తయారుచేసి లక్ష్మణరావు గారు మహిళాభివృద్ధికి ఎలా మార్గం చూపారో అన్న విషయాన్ని వివరించారు.

ఈ విధంగా అక్కాతమ్ముళ్ళు ఎంతో అన్యోన్యంగా, ప్రేమగా ఉండేవారు.

పేదల పట్ల ప్రేమ

"బీదల దుఃఖమును జూచినంతన తనకు దుఃఖమగుట యీమె నైసర్గిక గుణము. సాధ్యమైనంతవరకు తమ ధనము బీదలకుపయోగపడుట యీమెకు వెన్నతో పెట్టిన గుణముగా చదువరులింతకుముందే యెరుగుదురు. అయినను సర్వజనానుకరణీయమైన

యీమెకు గల ఈ గుణము యొక్క ప్రచారము నిచట మరికొంచెము వివరించెదను. తరుచుగా అనేక పర్యాయములు రొట్టెలును, పప్పును వండించి గ్రామములోని బీదలకు, అనాథలకు తన యెదుట భోజనము పెట్టించి, వాండ్లు తిని సంతసించుట చూసి తాను సంతసించుచుండెను. తనకు కుమారుడు పుట్టినపుడు ఇతర విధములగు నుత్సవములు మొదలగు వానిపై ధనమును వ్యయము చేయక, అది కరువు కాలమైనందున నా ధనమంతయు అసంఖ్యాకులగు అనాథలకు కొన్ని దినముల వరకు అన్నము పెట్టించుట యందు వ్యయపరచెను. తన్నాశ్రయించుకొని ఉన్న బీదవాండ్ల కన్యలకు తాను స్వయముగా సంబంధములు విచారించి, తన ధనమును పెట్టి, ధర్మవివాహములు చేయుచు నా వియ్యాలవారు పెట్టెడి బాధలన్నింటికినీ తాను తలయొగ్గి యనుభవింపుచుండెడిది. ఈమె కడుపున బుట్టిన సంతానము లేకపోయినను ఈమె ఇంట ఎల్లపుడు ఐదుగురు పిల్లవాండ్లకు విద్యాదానము దొరుకుచుండెడిది. ఈ పిల్లలందరిని ఎల్లవిధముల కడుపున పుట్టినవారివలెనే చూచుచున్నందున తెలియనివారా పిల్లలందరు నామె సంతానమేయని భావించుచుండిరి" అని పులుగుర్త లక్ష్మీనరసమాంబ, అచ్చమాంబ జీవితకథ రాస్తూ పేర్కొన్నది.

అచ్చమాంబకి పేదలపట్ల, స్త్రీలపట్ల ఎంతో ఆదరం.

ఒకసారి అచ్చమాంబ భర్త మాధవరావుకు బదిలీ అవ్వడం వల్ల ఉన్న ఊరు నుండి వేరే ఊరికి పోతున్నారు. మార్గమధ్యంలో ఒక సత్రంలో ఆగారు కొంతసేపు. ఆ సత్రాన్ని కనిపెట్టుకుని వుండే వాచ్‌మెన్ గుడిశె అక్కడికి దగ్గరలోనే వుంది. అచ్చమాంబ సత్రంలో వున్న సమయంలో ఆ గుడిశెలోనుండి ఎవరో స్త్రీ రోదన వినిపించింది. ఆమె ఉన్నఫళాన లేచివెళ్ళి, గుడిశెలో ఏడుస్తున్న స్త్రీ, ఆ వాచ్‌మెన్ భార్య అని, ఆమెకు ప్రసవ సమయమని అర్థం చేసుకుని, ఆమెను ఓదార్చి కొంత డబ్బు ఇచ్చి ఆసుపత్రికి వెళ్ళమని చెప్పింది. అంతేకాకుండా ఆమె భర్తతో మాట్లాడి ఆ వాచ్‌మెన్ జీతం కొంత పెరిగేలా చేసింది. అచ్చమాంబకు కల పేదల ప్రేమకు ఇదొక ఉదాహరణ మాత్రమే. నిజానికి అచ్చమాంబ అతిచిన్న వయస్సులో మరణించడానికి కారణం కూడా ఇదే. ప్లేగు బారిన పడిన ఒక పేద మహిళకి పురుడుపోసి తాను కూడా ప్లేగు వ్యాధికి బలైంది అచ్చమాంబ. ఎదుటివారికి సహాయం చేసే విషయంలో తన పర భేదాలను పాటించేది కాదు. ఆమె ఎవరి కష్టాన్ని చూసి సహించలేక పోయేది. ఏదో ఒకటి చేసి వారి కష్టాన్ని తగ్గించడానికి ప్రయత్నించేది.

"ముష్టివారిని, దీనులను చూచినపుడామె మనసు కరిగిపోయెడిది. ఒకసారి ఒకామె ఆరేండ్ల కూతురు, 4 ఏండ్ల కుర్రవాడు ముష్టికి వచ్చినారు. అచ్చమాంబ వారిని పిలిపించి ఆమెకొక ఆవును కొనిపెట్టి పాలనమ్ముకునే జీవితము ఏర్పాటుచేసి, పిల్లలు చదువుకొను ఏర్పాటు చేసినది.

"ఆ కాలమున మహారాష్ట్రమున కాటకము వచ్చినది. అట్టి సమయములలో తాను జొన్నపిండి రొట్టెలు చేయించి, ఆ రొట్టెలను కాటక ప్రాంతములకు పంపుచుండెడిది. ఎవరు పంపుచుండిరో ప్రభుత్వము వారికి తెలియదు. ఆమె భర్త ఇంజనీరు. ఆ కాటక ప్రాంతములకు వెళ్ళెడివాడు. అక్కడ ఈ రొట్టెల నిచ్చుట గమనించినాడు. అక్కడి వారందరూ వీనిని అచ్చమాంబగారనునామె పంపుచున్నారు అని చెప్పినారు. భర్త తన భార్య చేయుచున్న పనికి లోలోన చాలా సంతోషించినాడు. ఆమె కాటక కాలమున చేసిన పని చాలాచోట్ల వ్యాపించినది. ఆమెను చూచుటకు పురుషులెందరో కోరి భర్త నడిగిరి" అని నిడదవోలు వెంకటరావు రాశారు.

అచ్చమాంబ పేదలపట్ల ఎంతో ఆదరాన్ని చూపేదనడానికి ఇలాంటి ఉదాహరణలు చాలా దొరుకుతాయి.

అచ్చమాంబ మరణం

తెలుగు సాహితీ రంగంలో ధృవతారగా ఎంతోకాలం వెలగాల్సిన అచ్చమాంబ సమాజసేవ చేస్తూనే, దానివల్లనే మరణం పాలవ్వడం తెలుగు సాహిత్యానికి తీరనిలోటు. అచ్చమాంబ ఆఖరిదశ గురించి పులుగుర్త లక్ష్మీ నరసమాంబ ఈ విధంగా రాసింది.

"ఇటీవల కొంతకాలము నుండియు బిలాస్‌పూర్‌లో ప్లేగు వున్నందున ఊరుబైట గుడారములు వేసుకుని కాపురములు చేయుచుండిరి. డిశంబరు నెలలో వీరు కాంగ్రెస్ నిమిత్తమై బొంబాయి వెళ్ళుటకు సిద్ధము చేసుకొని బయలుదేరబోగా, ఒక సేవకుని భార్య నిండుపొద్దులదైనందున నొప్పులు పడజొచ్చెను. అపుడు ప్రయాణమాపి అచ్చమాంబగారు దానికి స్వయముగా మంత్రసానితనము చేసి పురుడు పోసెను. పిల్లకు బొడ్డుకోసి, నీళ్ళు పోయించి, ఉన్ని అంగీలు అల్లి, తొడిగించి తల్లికి కావలసిన మందులు వగైరాలు సిద్ధము చేసి, పదిరోజులకు సరిపడు సామానులు వాండ్లకమర్చి, రెండవరోజున బయలుదేరి బొంబాయి వెళ్ళిరి. బొంబాయి నుండి తిరిగివచ్చిన తరువాత నీ గుడారములోనే అచ్చమాంబగారు కీర్తిశేషులైరి."

1898 సంవత్సరంలో మహారాష్ట్రలో తీవ్రమైన కరువు తాండవించినపుడు అచ్చమాంబ భర్త క్షామశాల (ఫ్యామిన్ కాంపు) అధికారిగా పనిచేసేవాడు. ఆ క్యాంపు దగ్గరలోనే కరువువల్ల సాకలేక ఒక పిల్లవాడిని తల్లిదండ్రులు వదిలేసి వెళ్ళిపోయారు. ఆ పిల్లవాడిని ఎవ్వరూ చేరదీయకపోవడంతో మిషనరీలకు ఇచ్చివేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న అచ్చమాంబ ఆ పిల్లాడిని తాను పెంచుతానని ముందుకొచ్చింది. అధికారులతో మాట్లాడి ఆ పిల్లాడిని ఇంటికి తెచ్చుకుంది. వాడిని ఎంతో ప్రేమతో పెంచింది. ఇంకొక ఉదంతమేమిటంటే బిచ్చమెత్తుకుని బతుకుతున్న తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల్ని కూడా బిచ్చగాళ్ళుగా తయారుచేయడం చూసి భరించలేని అచ్చమాంబ ఆ పిల్లలను కూడా తన యింటికి తెచ్చుకుని చదువు చెప్పించింది. ఆ తల్లిదండ్రులను బిచ్చమెత్తుకోవడం మాన్పించి, ఒక ఆవును కొనిచ్చి పాలమ్ముకొని బతకమని సలహా నిచ్చింది.

అచ్చమాంబ జీవితంలో ఇలాటి దానధర్మాలెన్నో చేసిందని ఈమె మరణం వల్ల దీనజనులు, అనాథలకు తల్లి పోయిందని లక్ష్మీనరసమాంబ రాసింది.

నిజానికి అచ్చమాంబకు జబ్బేమీ చేయలేదు. ఆమె ఎంతో ఆరోగ్యంగా వుండేది. 1904-05 ప్రాంతాల్లో ప్లేగువ్యాధి బాగా వ్యాపించి వుంది. ఒకసారి అచ్చమాంబ భర్తతో కలిసి క్యాంపుకు వెళ్ళింది. భర్త రావద్దని వారించాడు కూడా. కానీ అలాంటి సమయంలో భర్తతోపాటే వుండాలని ఆమె సంకల్పించింది. ఆ క్యాంపులో ఉన్నపుడే ఆమె ఒక స్త్రీకి ప్రసవం చేసింది. ఆ స్త్రీ ప్రసవానంతరం మరణించింది. ఆమె ప్లేగువ్యాధివల్ల చనిపోయిందని అచ్చమాంబకు తెలియదు. క్యాంపునుండి తిరిగి రాగానే ఆమెకు తీవ్రమైన జ్వరం వచ్చింది. జనవరి తొమ్మిదో తేదీ నుండి 18వ తేదీ వరకు విపరీతమైన జ్వరంతో బాధపడింది. ప్లేగు లక్షణాలు గమనించిన ఆమె భర్త వైద్యం చేయించాడు. కానీ ఆమె జ్వరం తగ్గలేదు. 18వ తేదీన అచ్చమాంబ మరణించింది.

అచ్చమాంబకి స్వదేశాభిమానం చాలా ఎక్కువగా వుండేది. ఆమె స్వదేశంలో తయారైన వస్తువులనే కానీ విదేశీ వస్తువులను వాడేది కాదు. దానినొక వ్రతంలాగా పాటించేది. అచ్చమాంబ మరణశయ్యమీద తీవ్రమైన జ్వరంతో వున్నపుడు, కాళ్ళకు ఉన్ని మేజోళ్ళను తొడగమని డాక్టర్లు చెప్పారట. ఆ మేజోళ్ళ మీద విదేశీగుర్తులు చూసి వీటిని నాకు తొడగొద్దు అని గట్టిగా చెప్పిందట. అపుడు స్వదేశీ మేజోళ్ళు తెప్పించి తొడిగారట. ఈ విషయాలను సావిత్రి పత్రికలో రాస్తూ లక్ష్మీ నరసమాంబ

"చూచితిరా యీమె స్వదేశాభిమానము. ఈ స్వదేశ భక్తిపరాయణ మొకచోట శ్రీమతి కొటికలపూడి సీతమ్మ గారి "లేడీ జాన్ గ్రే" గ్రంథమును గూర్చి "ఈ కవయిత్రి హిందూదేశమునందలి నారీరత్నములలో నొక స్త్రీని గావ్యనాయికగా తీసికొని కావ్యము రచించిన యెడల నది హిందువులకు విశేష ప్రాయమగునని నా యభిప్రాయము" అంటుంది. ఇలాంటి స్వదేశీ ప్రీతితోనే 'అబలా సచ్చరిత్ర రత్నమాల' మొదటి భాగం భారతీయ మహిళల మీద రాయడానికి సంకల్పించింది.

బొంబాయి కాంగ్రెస్ సభలలో పాల్గొన్న అచ్చమాంబ సాహిత్యం సృజించడం, స్త్రీలను సమీకరించడమే కాక, ఆనాటి స్వాతంత్ర్య సమరంలో కూడా పాల్గొన్నదని అర్థమవుతుంది. ఆమె జీవితచరిత్రను రాసినవారు ఈ ఒక సంఘటనను మాత్రమే ప్రస్తావించడం వల్ల అచ్చమాంబ స్వాతంత్ర్యోద్యమ జీవితం ఎలా సాగిందనే దానికి రుజువులు ప్రస్తుతం దొరకడం లేదు. ఆ దిశగా పరిశోధిస్తే తప్పకుండా ఆ విషయాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశముందని నాకు బలంగా అన్పిస్తోంది.

ముగింపు

చరిత్ర చీకటిలో మగ్గుతున్న అచ్చమాంబను తొలిసారిగా వెలుగులోకి తెచ్చిన కె.లలిత అన్నట్టు ఆధునిక చరిత్రలో "మనకు ప్రోత్సాహాన్ని ఇచ్చేటటు వంటివి, మనం గర్వించదగిన నమూనాల కోసం వెతుక్కోవాలంటే మొట్టమొదట కనిపించేది భండారు అచ్చమాంబ.(స్త్రీవాద పత్రిక భూమిక ప్రథమ సంచిక జనవరి-మార్చి 1993) వందేళ్ళ క్రితం నాటి సామాజిక నేపథ్యంలోంచి చూసినపుడు అతి తక్కువ కాలంలో (కేవలం 30 సం॥లు) ఆమె సాధించిన విజయాలు చాలా ఆశ్చర్యం కలిగిస్తాయి. ఒకటా రెండా? ముచ్చటగా మూడింటికి ఆమె ఆద్యురాలుగా నిలిచింది.

ఆధునిక తెలుగు సాహిత్యం అప్పటికింకా కథాప్రక్రియని అందుకోని సమయంలో అచ్చమాంబ అవలీలగా ఆ సరికొత్త ప్రక్రియని అందిపుచ్చుకుని పన్నెండు కథలు రాసింది. వస్తుశిల్పాలు అద్భుతంగా నిర్వహించింది. తనకు తోచిన శైలిలో రాసింది. కొన్ని కథల్ని సంభాషణల రూపంలో రాసింది. ఆనాటి సమాజంలో ప్రబలివున్న అనేక సాంఘిక దురాచారాల్ని, సాంఘిక సమస్యల్ని వస్తువులుగా స్వీకరించింది. తాను సాంప్రదాయ సాంసారిక జీవితంలో వుంటూనే ఆనాటి స్త్రీల సమస్యల్ని చక్కగా ఆకళింపు చేసుకుని, వాటిని చాలా నేర్పుగా తన రచనల్లోకి తేగలిగింది. అది కథ కానివ్వండి, వ్యాసం కానివ్వండి, ప్రసంగ వ్యాసం కానివ్వండి వాటన్నింటా నిండి వుండేది, ప్రముఖంగా ప్రస్తావించేది స్త్రీవిద్య గురించి. ఎక్కడ వీలు దొరికితే అక్కడ దేశవిదేశాల్లోని ఉదాహరణలు జొప్పిస్తూ, తన వాదాన్ని బలోపేతం చేసుకుంటూ స్త్రీలు చదువుకోవాలని, చదువు సంస్కారాన్ని, జ్ఞానాన్ని ఇస్తుందని రాసేది, చెప్పేది.

తాను ఆధునిక తెలుగుకథకు ఆద్యురాలనని అచ్చమాంబ అనుకుని వుండదు. వీరేశలింగంలాంటి వారు కూడా ఆమెకు చెప్పివుండరు. సమాజంలో తాను చూస్తున్న సమస్యల్ని కథల్లో వస్తువులుగా స్వీకరించొచ్చు అనే అవగాహన అచ్చమాంబకి కలగడం చాలా అద్భుతమైన విషయం. ప్రపంచవ్యాప్తంగా కథ అనే నూతన ప్రక్రియ సాహిత్యంలో

బలపడుతున్న సందర్భం అది. కానీ అచ్చమాంబకి ఆంగ్లభాష రాదు. ఇంగ్లీషు సాహిత్యాన్ని చదివి ఆకళింపు చేసుకునే ఆంగ్లభాషాజ్ఞానం ఆమెకు లేదు. తమ్ముడు లక్ష్మణరావు చెబితే వినడమే కానీ స్వతహాగా ఇంగ్లీషు చదవలేదు. అయినప్పటికీ ప్రపంచ సాహిత్యకారులకు దీటుగా ఆమె తొలికథని తెలుగులో రాసి, తెలుగును అంతర్జాతీయ వేదిక మీదికి ఎగబాకించింది. ప్రపంచ సాహిత్యంలో తొలికథలు రాసినవారి సరసన అచ్చమాంబ సగర్వంగా నిలబడింది. ఆమెను తొలి కథకురాలుగా గుర్తించడానికి తెలుగు సాహిత్య విమర్శకులు ఇంకా మీనమేషాలు లెక్కించడం, గురజాడనే ఆధునిక తొలి కథకుడుగా అంగీకరించడం నిజంగా చాలా విషాదం.

"అచ్చమాంబ రాసిన కథలన్నీ ఆధునిక భావాలతో (ఆ కాలానికి) పాత్రల సంభాషణలతో సమాజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాసినవే. స్త్రీల చదువే సర్వ సమస్యలకు పరిష్కారమార్గమని నేటి పాప్యులర్ సిద్ధాంతకర్తలు చెబుతున్న విషయాన్ని వందేళ్ళ క్రితమే ఆచరించిన సాహసి అచ్చమాంబ. అటు బొంబాయి, ఇటు బిలాస్‌పూర్, నాగపూర్, హైదరాబాదు, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, కాశీ, ఇలా చాలా ప్రదేశాలు తిరిగి తన భావాల్ని ఉపన్యాసాలు, రచనలు, ఉత్తరాలు, పుస్తకాలు, ప్రయివేట్ టాక్స్ ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చిన ఆమె చైతన్యం, ఆచరణా నేటికీ స్ఫూర్తిదాయకం.

అచ్చమాంబ కథలన్నీ ఆధునిక భావాలకు వేదికలు. సమాజోద్ధరణ, మహిళాభ్యున్నతి, మెరుగైన సమాజం కోసం తహతహ ప్రతి కథలోను, ప్రతి అక్షరంలోను ప్రత్యక్షమయ్యేవి. భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథకురాలు "- సంగిశెట్టి శ్రీనివాస్.

"అచ్చమాంబ కథలు గ్రాంథిక భాషలో వున్నా అది సరళ గ్రాంథికమే. కథకున్న లక్షణాల్లో వ్యవహారిక భాష వుండాలనడం ఒకటి అని చెప్పి గురజాడ 'దిద్దుబాటు' (1910) తెలుగులో మొదటి కథ అంటున్నారు. కానీ తర్వాత కాలంలో 1930 దశకంలో విశ్వనాథ వంటి వాళ్ళు కథల్లో గ్రాంథికభాషను ప్రయోగించారు. అయినా వాళ్ళను కథారచయితలుగానే పరిగణిస్తూనే వున్నాం. కాబట్టి భాష గ్రాంథికం, వ్యవహారికం అనడం 'కథ' లక్షణాల్లో ప్రధాన విషయం కాకూడదు. అప్పుడు అచ్చమాంబ కథలు ఆధునిక ప్రక్రియకు చెందిన కథలుగానే కన్పిస్తాయి. తెలుగులో మొదటి కథను రాసాడనే గురజాడకు పూర్వమే ప్రయోజనం కల సామాజిక ఇతివృత్తంతో వున్న అన్ని కాలాలకు అవసరమయ్యే సందేశాలను అందించే కథలను అచ్చమాంబ రాసింది. అందుకే అచ్చమాంబ అందించే కథలే తెలుగులో "తొలికథలు"- తెలుగులో 1898-1904 కాలంలో గురజాడకు పూర్వమే సంఘసంస్కరణ భావాలతో రచించిన అచ్చమాంబయే తొలి కథకురాలని చెప్పాలి." తెలుగులో తొలి కథకులు - సంగిశెట్టి శ్రీనివాస్.

అచ్చమాంబకు ముందు ఎవరూ కథలు రాసినట్టుగా ఎలాంటి ఆధారాలు ప్రస్తుతం లేవు. ఆమె కథాప్రక్రియను అవలీలగా పట్టుకుని పలుకథలు రాయడం మాత్రం చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఆమెకు ఇంగ్లీషుభాష వచ్చివుంటే, ఆనాటికే వెలువడిన విదేశీ కథల్ని చదవగలిగివుంటే మరిన్ని మంచి కథలు మనకు అందించి వుండేది. ఆమె నిండు జీవితం జీవించి వుంటే గొప్పగొప్ప గ్రంథాలను తెలుగు సాహిత్యానికి అందించి వుండేది. కె.శ్రీనివాస్ (తెలుగులో తొలికథలు) అన్నట్టు "ముప్పయ్యేళ్ళ జీవితంలో ఆమె సాధించిన కార్యాలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సంస్కారభావాలతో ఉద్దీపన పొంది, దానికి అనుగుణమైన కార్యాచరణను లక్ష్యశుద్ధితో, చిత్తశుద్ధితో ఆమె నిర్వహిస్తూ వచ్చారు. బొంబాయి జాతీయ కాంగ్రెస్‌కు కూడా ఆమె హాజరయ్యారు. ప్లేగువ్యాధి బాధితులకు సేవచేసి, తాను స్వయంగా ఆ వ్యాధి బారిన పడి ఆమె మరణించారు."

నిజానికి ముప్పయ్యేళ్ళ జీవితంలో పది సంవత్సరాలు ఆమె చదువు లేకుండానే వుంది. తన ప్రయత్నంతోనే అక్షరాలు నేర్చుకుని ఆఘమేఘాల మీద పలురకాల కార్యాలకు సిద్ధపడింది. ఒకపక్క సంసార జీవితంలో తలమునకలవుతూ, భర్తతో క్యాంపులకు తిరుగుతూ, బిడ్డలకు జన్మనిచ్చి వారిని సాకుతూ కూడా అచ్చమాంబ తన పుస్తక పఠనాన్ని, రచనను కొనసాగించింది. భర్తతో గడిపిన క్యాంపు జీవితం ఒక్కోసారి భయం గొల్పేటట్టు ఎవరూ లేని ఏకాంత ప్రదేశాల్లో వుండేది. ఆమె ఏరోజూ భయపడలేదు. "తనతో వుండే బంట్రోతులను చాలా ఆదరంతో, ప్రేమగా చూసుకునేదని, వారినెన్నడూ వొట్టి చేతులతో ఇంటికెళ్ళనిచ్చేది కాదని, కాయో, ఫలమో చేతిలో పెట్టి పిల్లలకివ్వమని చెప్పేదని" నిడదవోలు వెంకట్రావుగారు రాసారు.

అచ్చమాంబ భర్త మాధవరావుకి భార్య చదువుకోవడం, గ్రంథాలు చదవడం ఇష్టం లేదు.అచ్చమాంబ భర్త మాధవరావుతో గొడవలు పడకుండానే తన కార్యాలను చక్కపెట్టుకునేది. అతను చాలా సాంప్రదాయవాది. స్త్రీలు చదువుకుంటే చెడిపోతారనే వర్గానికి చెందినవాడు. అందుకని భర్త క్యాంపులకు వెళ్ళినపుడు విపరీతంగా చదివేది. భర్త ఈ విషయం కనిపెట్టి దానికీ అభ్యంతరం లేవదీసినపుడు, అతనితో క్యాంపులకెళ్ళడానికి సిద్ధపడింది. అతనికి సేవలు చేసి అతన్ని మెప్పించాలని తాపత్రయపడేది. క్రమంగా అతనిలో మార్పు తీసుకురాగలిగింది. తన ప్రవర్తనతో భర్తలో పరివర్తన తెచ్చింది గనుకనే ఆ తర్వాత కాలంలో అచ్చమాంబ ఎన్నో కార్యక్రమాలను చెయ్యగలిగింది. అతనితో కలిసి ఆంధ్రదేశానికి వచ్చిన సమయాల్లోనే మీటింగులు, ఉపన్యాసాలు, పండితులతో చర్చల్లో తలమునకలుగా వుండేది. తను చేయదలుచుకున్న పనులన్నింటిని, తనదైన మార్గంలోనే చెయ్యగలిగింది. భర్త అడ్డుపెడుతున్నాడని, తనింకేమీ చేయలేదని ఆమె ఏనాడూ భావించలేదు. తనదైన పద్ధతిలోనే అన్ని అడ్డంకుల్ని అధిగమించింది అచ్చమాంబ.

అంతేకాదు తన భార్య ఎంత సమర్థురాలో మాధవరావు గుర్తించేట్టు చెయ్యగలిగింది. తనకట్టి భార్య దొరికినందుకు తాను, తన కూతురు మీనాక్షి ఎంతో అదృష్టవంతులమని కూడా అతను భావించాడు – ముఖ్యంగా మాధవరావు మొదటి భార్య కూతురైన మీనాక్షిని తనకు పుట్టిన బిడ్డకన్న ఎక్కువగా ప్రేమించడం అతనికి అమితాశ్చర్యాన్ని కలిగించింది. సంసారం మొత్తం అచ్చమాంబ మీదే వొదిలేసి తాను మాత్రం ఉద్యోగంలో మునిగి తేలేవాడు. ఎన్నో ఆధునిక భావాలున్న అచ్చమాంబ తన భర్తను మెప్పించి తన కార్యక్రమాలను సజావుగా చేసుకోవడానికి, ఆనాడు అమలులో ఉన్న సతీధర్మాలను పాటించేది.

ఒకసారి అచ్చమాంబ కాకినాడ వెళ్ళింది భర్తతో కలిసి. తన మిత్రురాలు జూలూరు తులశమ్మ ఇంట్లో దిగింది. అచ్చమాంబ ఆత్మకథను రాసింది ఈ తులశమ్మే. అయితే ఈ గ్రంథం ప్రస్తుతం లభ్యమవ్వడం లేదు.భోజనాలు అయ్యాక తులశమ్మ అందరికీ తాంబూలం ఇచ్చింది. మగవాళ్ళు వీధిలో కూర్చున్నారు. స్త్రీలు ఇంట్లో కూర్చున్నారు. భోజనానంతరం అందరూ తాంబూలం వేసుకున్నారు కానీ అచ్చమాంబ వేసుకోలేదు. ఎందుకు వేసుకోలేదని తులశమ్మ అడిగితే అచ్చమాంబ నవ్వేసి ఊరుకుందట. ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే ఆమె భర్త మాధవరావు కూడా తాంబూలం వేసుకోలేదట. దీనిని గమనించిన అచ్చమాంబ తానుకూడా వేసుకోకుండా కూర్చుంది. అతను వేసుకోగానే తానూ వేసుకుందట.

బహుశా ఇలాంటి పనులద్వారానే ఆమె భర్తను మార్చాలని, అతనిని ప్రసన్నం చేసుకోవాలని భావించినట్టుంది. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో భర్తను ఎదిరించి నిలవగలగడం అసాధ్యమైన పని. తాను చెయ్యాల్సిన పనులపట్ల స్పష్టమైన అవగాహన వున్న అచ్చమాంబ, తన మార్గాన్ని సుగమం చేసుకోవాలంటే భర్త సహకారం తప్పనిసరి అని అర్థం చేసుకుని కర్ర విరగకుండా, పాము చావకుండా తన కార్యక్రమాలను నల్లేరుమీద బండిలా నడిపించింది.

నిజానికి "అబలా సచ్చరిత్ర రత్నమాల" గ్రంథ రచనలో నూటికి నూరుపాళ్ళు ఆమెకి సహాయం చేసినవాడు ఆమె సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు. కానీ అచ్చమాంబ ఈ గ్రంథాన్ని తన భర్తకి అంకితమిచ్చింది. తనకు ఈ గ్రంథాన్ని రాయడానికి ఆయనిచ్చిన స్వేచ్ఛకి సదా రుణపడి వుంటానని, తన చర్మంతో చెప్పులు కుట్టిచ్చినా ఆ రుణం తీరదని పేర్కొంటూ అతనికి తన గ్రంథాన్ని అంకితమిచ్చింది. అతను గ్రంథరచనలో ఆమెకు సహాయం చెయ్యకపోయినా, ప్రోత్సహించకపోయినా అతనిచ్చిన స్వేచ్ఛవల్లనే తాను గ్రంథరచన చేయగలిగానని ఆమె నమ్మింది. స్త్రీలు గడప దాటకూడదని, పరపురుషులతో మాట్లాడరాదని, పతిని దైవంగా కొలవాలని ఆంక్షలున్న నేపథ్యంలోంచి చూపినపుడు అచ్చమాంబ ఆలోచనల్లో ఎంత నవీనత్వమున్నా, సంప్రదాయ చట్రం నుండి మొత్తంగా

బయటపడలేకపోయింది. సావిత్రి పత్రికలో ఆమె జీవితచరిత్ర రాసిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ ఇలా రాస్తుంది.

"అటు ప్రాచీనమైన సతీధర్మములను ఇటు నవీనమైన పాశ్చాత్య విద్యా సంస్కారమును ఈ రెండింటిని అత్యద్భుతముగా, అనుపమానంగా ప్రదర్శించి ఆదర్శమహిళ అయినది." రెండింటిని చక్కగా బాలన్స్ చేస్తూ అచ్చమాంబ తన మార్గంలో నిబద్ధతతో నడిచి తాననుకున్న అన్ని పనుల్ని ప్రారంభించింది. అకాలమరణం ఆమె పనులకు అడ్డం పడింది తప్ప అచ్చమాంబ ఏరోజూ వెనుకడుగు వేయలేదు. అచ్చమాంబలో ఓర్పు, సహనం, దయ, పరోపకారం, ధైర్యం సహజంగానే ఎక్కువ పాళ్ళలో వున్నాయి. భర్త వ్యతిరేకతను ఓర్పుతోనే గెలిచింది. అతనిలో మార్పుతెచ్చింది. బీదలపట్ల ఎంతో దయ ప్రదర్శించేది.

అచ్చమాంబ స్త్రీ పక్షపాతి. సిసలైన స్త్రీవాది. కుటుంబాల్లో ఆడపిల్లల పట్ల ఎంత వివక్ష ప్రదర్శిస్తారో చక్కగా అర్థం చేసుకుని తన ప్రసంగాల్లో, రచనల్లో వాటిని దుయ్యబట్టేది. ఆడపిల్లలకి చదువు చెప్పించకుండా అతి చిన్నవయస్సులో వివాహాలు చేసి వాళ్ళ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని విమర్శించేది. వేదవేదాంగాలను, ఉపనిషత్తులను చదివి వాటిని రుజువులుగా చూపిస్తూ బాల్యవివాహాలు శాస్త్రసమ్మతం కాదని వాదించింది.

ఇక స్త్రీవిద్య అచ్చమాంబకు ఇష్టమైన అంశం. ఏ చిన్న అవకాశం దొరికినా, ఎక్కడ మాట్లాడినా, రాసినా ఆమె తిరిగి తిరిగి వచ్చి స్త్రీవిద్య దగ్గరే ఆగుతుంది. స్త్రీవిద్య ప్రాముఖ్యత గురించి పదేపదే చెప్పడం వల్లనైనా అర్థం చేసుకుంటారని ఆశపడేది. మహిళలు ఐకమత్యంగా వుండి, తనతోటి స్త్రీల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని ప్రసంగాల్లో చెబుతూండేది. స్త్రీవిద్య అనే అంశాన్ని అచ్చమాంబ ఒక ఉద్యమంగా నిర్వహించింది.

అచ్చమాంబ బతికిన నాటి రోజుల్ని, ఆనాటి సాంఘిక పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమె ఎంత ముందుచూపుతో ఆలోచించిందో అర్థమౌతుంది. అప్పటి వరకు కథాప్రక్రియ తెలుగు సాహిత్యంలో లేదు. తొలికథ రాసిన ఘనత ఆమెదే. అలాగే మహిళలు సంఘాలుగా ఏర్పడాలి. ఐక్యంగా వుండి, తరచు కలుసుకుంటూ సమస్యల గురించి చర్చలు చేయాలి అనే ఆలోచన ఆమె మనసులోకి రావడం ఎంతో అపూర్వమైన విషయం. అలాగే స్త్రీలు గడప దాటరాదని సవాలక్ష ఆంక్షలున్న ఆరోజుల్లో గడపదాటి బయటకు రండి. సంఘాలుగా ఏర్పడండి అని పిలుపు నివ్వడం అచ్చమాంబ ఎంత ధైర్యవంతురాలో అర్థం చేయిస్తుంది. వీరేశలింగం వంటి సంస్కర్తల ప్రభావం అచ్చమాంబ మీద వున్నప్పటికీ చాలా విషయాల్లో అచ్చమాంబ వాళ్ళను దాటి ముందుకెళ్ళిందేమో అన్పిస్తుంది. కొన్నిచోట్ల సంప్రదాయబద్ధంగా వాదిస్తున్నట్టు కనబడినా, చాలాచోట్ల ఆమె నిశితమైన విమర్శలు చేస్తుంది. ఉదా:

"నేను పెండ్లాడిన భార్యను గాని దాసిని కాదు. వివాహమాడుటవలన భర్తకు దాసినగుదునా ఏమి? గృహయజమానురాలుగా పనులన్నియు సేయమనిన నేను సేయుదునా ఏమి?" ' దంపతుల ప్రథమ కలహము' అనే కథలో భార్యచేత ఈ మాటలనిపిస్తుంది. పురుషుల అహంభావము నెంతమాత్రం సహించజాలమని కూడా ఆమెచేత అనిపిస్తుంది.

భార్యాభర్తల సంబంధంలో ప్రేమ వుండాలి కాని అహంకారం వుండకూడదని, గృహయజమానిగా తనను గౌరవించాలనే భావాలు ఆనాటి కాలానికి చాలా నవీనమైనవి. అలాగే ఆడపిల్లల్ని సమాజం, కుటుంబం చూసేతీరు గురించి, ఆమెపట్ల చూపే వివక్ష గురించి అచ్చమాంబ చాలా స్పష్టంగా అర్థం చేసుకుని, ఆడపిల్లలపట్ల వివక్ష చూపరాదని, బాల్యవివాహాలు చెయ్యకూడదని, అవి శాస్త్రసమ్మతాలు కావని రాస్తూండేది.

స్త్రీజాతిపట్ల అచ్చమాంబకు అమితమైన ప్రేమ. ఆమె రచనల్లో, మాటల్లో స్త్రీల సమస్యలే దొర్లుతుండేవి. హిందూసుందరి పత్రిక అచ్చమాంబ గురించి ప్రత్యేక వ్యాసం ప్రచురిస్తూ

"శ్రీమతి అచ్చమాంబ గారెల్లపుడును స్త్రీల హితమునకై ఏమైనను వ్రాయుచునే యుందురనుటకు ఈ హిందూసుందరిలో ఆమెచే వ్రాయబడిన అనేక వ్యాసములు ప్రబల నిదర్శనమిచ్చుచున్నవి" అని రాసారు. ఆవిడ ఆలోచనలెప్పుడూ స్త్రీల చుట్టూనే తిరుగుతుండేవి.

అచ్చమాంబ బహుముఖప్రజ్ఞాశాలి. కడు సమర్థురాలు. చిన్నవయస్సులోనే అనేక కార్యక్రమాలు చాలా నైపుణ్యంతో నిర్వహించింది. చదువుకోవడానికి సంఘర్షణ పడుతూనే, భర్తను ఒప్పించడంలో తనను తాను సంప్రదాయంలో బిగించుకుంటూ, మనసునిండా ఆధునిక భావాలతో పొంగిపొరలుతూ వుండేది. సమాజం తీరుతెన్నులు చక్కగా అవగాహన చేసుకుంటూ, ఆ సమాజంలో ఆడపిల్లలు, స్త్రీలు పడుతున్న అగచాట్లను అర్థం చేసుకున్నది. కుటుంబం, సమాజం స్త్రీల పట్ల వివక్షతో వున్నాయనే ఎరుకతోనే అచ్చమాంబ రచనను చేపట్టింది. పలు ప్రక్రియల్లో ప్రావీణ్యం సంపాదించింది. రచనతోపాటు క్రోషే అల్లిక (లేస్‌వర్క్), ఊలు అల్లకం, ఎంబ్రాయిడరీ కూడా చేస్తుండేది. వాటిమీద పుస్తకాలు రాసింది. ఆమెకి వంటలు చేయడం, ముఖ్యంగా మహారాష్ట్ర వంటలు చెయ్యడం చాలా ఇష్టం. వీటిపైన ఆమె రాసిన పుస్తకాలను వెతికి పట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అచ్చమాంబ జీవితంలోని దుఃఖంలోంచి తొలుచుకుంటూ ఓ అపూర్వమైన గ్రంథం వెలువడింది. తెలుగు సాహిత్యంలోనే తొలి స్త్రీల చరిత్ర "అబలా సచ్చరిత్ర రత్నమాల" వెలువడింది. ఆ పుస్తక రచన ఆమెను దుఃఖంలోంచి బయటపడెయ్యడమే కాక తెలుగు సాహిత్యానికి ఓ అద్భుతమైన గ్రంథం లభించింది. ఈ గ్రంథ పరిధి ఒక్క తెలుగు మహిళకే పరిమితం కాక భారతీయ స్త్రీలందరి చరిత్రలకు విస్తరించింది. అప్పటి వరకు ఝాన్సీ

లక్ష్మీబాయి చరిత్రను ఎవరూ తెలుగులో రాయలేదు. ఆమె మహారాష్ట్రలో నివసించడం వల్ల, బహుశా మరాఠీ నుండో, హిందీ నుండో తెలుగులోకి తర్జుమా చేసి వుండాలి. అచ్చమాంబ ఇతర భాషలలోని రచనలను ఏ విధంగా తెలుగులోకి అనువాదం చేసిందో, ఎన్ని కష్టాలు పడివుంటుందో ఆలోచిస్తే చాలా అద్భుతమనిపిస్తుంది. ఎందుకంటే అబలా సచ్చరిత్ర రత్నమాలలో గుజరాతీ, మరాఠీ, హిందీ, కన్నడ, రాజస్థానీ, ఉత్కళ, బెంగాళీ భాషలకు చెందిన స్త్రీల చరిత్రలున్నాయి. ఇన్ని భాషల్లోంచి అనువదించి, తెలుగులో గుదిగుచ్చడం చాలా అపూర్వమైన విషయం. అచ్చమాంబ ప్రతిభాసంపత్తికి చక్కని తార్కాణమిది.

అచ్చమాంబ చరమదశ అత్యంత ఆశ్చర్యకరమైంది. విషాదకరమైంది. చక్కటి ఆరోగ్యంతో వున్న ఆమె చేతులారా మృత్యువును కొగలించుకుంది. తన మంచిచెడ్డల గురించి, తన గురించి ఆలోచించకుండా, ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవచేస్తూ తాను కూడా ఆ వ్యాధి బారిన పడి మరణించింది అచ్చమాంబ.

నిజానికి అచ్చమాంబను తెలుగు సాహితీలోకం, తెలుగు సమాజం శిరస్సున పెట్టుకోవాలి. ఆమె ఎన్నింటికో ఆద్యురాలుగా తన ముద్రను వేసింది. తొలి కథ రాసింది. తొలి స్త్రీల చరిత్రను రాసింది. తొలిసారి స్త్రీల సమాజాన్ని స్థాపించి, తొలిసారి స్త్రీలను ఐక్యపరిచింది. ఇన్ని ప్రక్రియలకు ఆద్యురాలైన భండారు అచ్చమాంబకు తెలుగు సాహిత్యం యివ్వాల్సిన గౌరవం, ఇవ్వకపోగా ఆమెను వెనక్కు నెట్టేసే ప్రయత్నం చెయ్యడం మాత్రం క్షంతవ్యం కాదు. అచ్చమాంబ ఆత్మచరిత్ర వెలువడిన తర్వాతైనా విమర్శకుల కళ్ళు, మనసులు విచ్చుకుని ఆమెకివ్వాల్సిన సముచిత స్థానాన్ని యిస్తారని, ఇచ్చి తీరాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ, అచ్చమాంబకు నివాళి అర్పిస్తూ ముగిస్తున్నాను.

అనుబంధం

కృతివిమర్శనము-1

'తెలుగు జనానా' పత్రికలో ప్రచురితమైన "అబలా సచ్చరిత రత్నమాల" మీది సమీక్షావ్యాసం

అబలా సచ్చరిత్ర రత్నమాల – చెన్నపురి పరసువాకంలోని చింతామణి ముద్రాక్షరశాలలో ముద్రింపబడి 355 పుటలుగల ఈ తెలుగు గ్రంథము ప్రస్తుతము మధ్యపరగణాలలో నుండు సౌ॥ భండారు అచ్చమాంబ గారిచే రచింపబడినది. దీనిలో రమారమీ నూరుమంది స్త్రీల చరిత్రములు వ్రాయబడినవి. వీరందరును వేయి సంవత్సరముల లోపుగా మనదేశమున నుండిన స్త్రీలే. అచ్చమాంబగారు దీనివెంటనే ఇంకను 2 పుస్తకములను రచించి వానిలో వరుసగా వైదిక, పౌరాణిక స్త్రీల చరిత్రములను, పరదేశకాంతల చరిత్రములను లిఖించదలచి ఉన్నారు.

మనదేశంలో విద్యావంతులగు స్త్రీలు కనబడుటయే మిక్కిలి అరుదు కదా. అట్టిచో, శ్రీమతి అచ్చమాంబగారి వంటి అగ్రవర్ణహిందూ కాంతలు, తాము విద్య నేర్చి ఆమె బంధువులకు, మిత్రులకు ఆనందమొసంగుటయేకాక, ఆ జ్ఞానతిమిరమందు దరికానక యున్న తమ యక్కచెల్లెండ్ర అనరగు హిందూ స్త్రీలకు జ్ఞానబోధ చేయనెంచి అట్టివారి ఉపయోగార్థమై మంచి పుస్తకములు వ్రాయదొడంగుట ఎంతైనా శ్లాఘనీయమగు కార్యము. మాసపత్రిక చదువరులు, అప్పుడప్పుడు ఈ అచ్చమాంబగారు మా పత్రికకు వ్రాసిన వ్యాసములను, కథలను చదువుచునే ఉన్నారు. ఈమెకు తెలుగుభాష ఒకటియేకాక మహారాష్ట్రభాష కూడా తెలిసియున్నది. ఈ రెండు భాషలలోను గ్రంథరచన చేయుటకు తగిన సమర్థత కలదు. ఈమె ఎంతో శ్రద్ధతో ఈ స్త్రీల చరిత్రలన్నిటిని సంపాదించెను. ఈ కార్యమునకై అనేక పుస్తకములు చదివి ఉండవలయును. ఎట్టి ప్రయాసకోర్చి ఉండవలెను. కొన్ని పత్రములను మహారాష్ట్రభాషలోనుండి భాషాంతరీకరించిరి.

శైలి మిక్కిలి సులభముగను, యోగ్యముగను ఉన్నది. పాఠకులు ఈ గ్రంథము చదివి తప్పక లాభము నొందగలరు. తెలుగుభాషలో దీనికి సంబంధించిన పత్రములంతగా లేవు.

స్త్రీల చరిత్రములు బొత్తిగాలేవే లేవని చెప్పవచ్చును. ప్రస్తుతకాలపు హిందూస్త్రీలు తమ దేశములోని పూర్వకాంతల గురించి తెలిసికొనుటకు సాధ్యముగాక యున్నది. ఇట్టికో నీ పుస్తకము చాలావరకు వారించుచున్నది. ఈ పుస్తకమునందట్టి స్త్రీ వట్టి కథలుకాక, వారి నిజమగు చరిత్రములు ముచ్చటగ వివరించబడినది. స్త్రీల సంగతులు స్త్రీలే చెప్పుట మిక్కిలి యుక్తము. కావున స్త్రీ విరచితమైన యీ యబలాసచ్చరిత్రారత్నమాల అన్ని విధముల జక్కగ నున్నదని చెప్పవచ్చును.

పుస్తకమునందచ్చటచ్చట ప్రతిమలు గూడ జేర్పబడియున్నవి. యచ్చమాంబగారు ఆమె విధాయికమైన పనియనియేగాక, ఆమె వ్రాయుచున్న విషయమునందు జెప్పనలవిగాని యభిమానమును, సంతోషమును బూనియే మఱి యీ గ్రంథమును రచించిరి. ఈమెకు స్త్రీ విద్యాస్వాతంత్ర్యములందు అపారమగు నభిమానము గలదు. ఇందలి "మాబాయి కేళోకర్", "రాణీగౌరీ లక్ష్మీభాయి" మొదలగు చరిత్రలను జదివి చూచినవారికి యీ మాటల యర్థము తేటపడును.

విద్య నేర్చినచో స్త్రీలకు బతిభక్తి తగ్గునని సంశయించువారి కీ గ్రంథము మంచి యుపదేశము చేయుచున్నది. ఈ లలనామణి తన పుస్తకమును ప్రియభర్తగారగు శ్రీ మాధవరావు గారికంకితము చేయుచు నిట్లు చదువుచున్నది. "ఎవరి పరిపూర్ణ కృపాకటాక్షంబుచే నాకీ గ్రంథంబు వ్రాయునంత శక్తియు, స్వాతంత్ర్యంబును గలిగెనో, నా శరీరంబు నందలి మర్మంబుచే బాదరక్షల నిర్మించి జన్మజన్మంబునందున బాదంబులకు వొడినను నెవరి ఋణంబు దీరి నేను ఋణవిముక్తినగుట యశంభవంబు, ఎవరు నాకు దేవాదిదేవుని కంటే నధికతమముండైన దేవుండో యట్టి నా ప్రియభర్తగారికి కంకితమిచ్చితినని చెప్పియున్నది. ఈ పుస్తకము వెల రూపాయి. వలయువారు, చెన్నపురి, పరశువాకములోని చింతామణి ముద్రాక్షర శాలాధికారిగారికి వ్రాసికొనవలయును. స్త్రీ విద్యాభిమానులీ గ్రంథమును తప్పక చదువవలెనని నొక్కి వక్కాణించుచున్నాను.

కృతివిమర్శనము-2

(హిందూసుందరి పత్రికలో అబలాసచ్చరిత్ర రత్నమాల మీద కొటికలపూడి సీతమ్మ రాసిన పుస్తక సమీక్ష)

మధ్య పరగణాలలో చేరిన పచమరి యను గ్రామమున పలుకుబడి (విజన్ ఆఫీసర్) అధికారములో నన్ను మహారాజశ్రీ భండారు మాధవరావుగారి సహధర్మచారిణియగు శ్రీమతి అచ్చమాంబగారిచే రచియించబడిన అబల సచ్చరిత్ర రత్నమాల యను నూతనగ్రంథము సోదరి వాత్సల్యమున గ్రంథకారిణిచే బంపబడిన దాని వందనపూర్వకముగా నందుకొని అమితానందమును బొంది శాంతముగ చదివి చూచితిని. గ్రంథము యొక్క మొదటి పుటయందుగల అంకితము జదువంగా గ్రంథకీర్తిలో పతిభక్తి తేటతెల్లమయ్యి చదువరుల కత్యంతాహ్లాదము గలిగింపగలిగియున్నది. గ్రంథమున గూర్చబడిన పీఠికయందుగల సంతాననష్టము మిక్కిలి విచారమైనదియైనను ఆయా పదమూలముగలిగిన ఫలితము కృష్టదగుటచే గొంతవరకు చదువరులకు గలుగు ఖేదము తొలగనదిగా నున్నది. ఉపోద్ఘాతంబునగల యీమె ఆలోచనములు మిక్కిలి కొనియాడదగియున్నది.

శౌర్యధైర్య సాహసములను, పాతివ్రత్యంబును, దైవభక్తియును, పరోపకారనిరతియు, దానశీలత్వము, వేయేల సమస్త సద్గుణ పుంజముల కాలయంబులగు మానినీమణుల సచ్చరిత్రము హిందూసుందరుల పరంపరాభివృద్ధికి దగు సహాయము చేయుచు యున్నవి. ఇట్టి యుద్గ్రంథముల రచియింపగలిగిన స్త్రీరత్నములే హిందూదేశమునందచ్చటచ్చట నిష్కపటభావముతో బయలుదేరిన యెడల నీదేశమితర దేశములతో బాటు మహోన్నత దశయందుండుటకు సందియముండదు.

ఈ గ్రంథము మూడుభాగములుగా రచియింప నుద్దేశింపబడినట్టు పీఠికయందుదహరింపబడియున్నది.

ఈ భాగమునందు వేయిసంవత్సరముల క్రిందటి నుండియు నేటివరకుగల హిందూ దేశాంతర్గతములగు సకలదేశములుగల యుత్తముల సచ్చరిత్రములు వ్రాయబడినవి. తక్కిన రెండు భాగములందే పుణ్యాంగనల సచ్చరిత్రములు వ్రాయబడి యెన్నడు చదువనగునో మిక్కిలి కుతూహలముతో నెదురుచూచుచున్నదానను, విద్యావిహీనతచే హీనదశలోనున్న నీ దేశస్త్రీల కత్యంతోపయుక్తములగు ననేక గ్రంథములు రచించగల శక్తిసామర్థ్యములొసంగుటకై పరమేశ్వరుని త్రికరణశుద్ధిగా వేడుకొనుచున్నదానను.

సీ॥ ఏ సతిఆనదు ప్రాణీశునికృపనొంది గ్రంథము రచించె ఘన మీఱ నేపుణ్యశీలతా
నెల్లడలంగల రమణీమణుల చరిత్రముల వ్రాసెనో ఏ గుణమణి గ్రంథ మణాక్షులకు విద్య
కూడదంచనువారి.....

నే యవిద్య చరిత్ర యెల్లవారలచేత మెప్పొందె గుణములకుప్పయగు యట్టి శ్రీమతి భండారు అచ్చమాంబ కాయురారోగ్య పుత్ర పౌత్రాభివృద్ధి, దైవభక్తియు, పతిభక్తి, ధర్మనిరతి నిచ్చి రక్షించుగావు సర్వేశ్వరుండు. (హిందూసుందరి 1902 జూలై నెల)

– కొటికలపుడి సీతమ్మ

కీర్తిశేషురాలగు అచ్చమాంబ

(అచ్చమాంబ మరణించినపుడు హిందూసుందరి ప్రచురించిన స్మరణ)

ఇమ్మహాపతివ్రత జీవచారిత్రమును ఛాయాపటముతో 1903 సంవత్సరము అక్టోబరు నవంబరు నెలలో ప్రచురింపబడిన హిందూసుందరి 2వ సంపుటము 6-7 సంచికల యొక్క ప్రథమ పుటలయందు ప్రచురింపబడియుండినను ఇటీవల నూతనముగా చేరిన చందాదారులనేకులామె వృత్తాంతము నెరుగక యుండి యుండవచ్చునను యూహతో ఆమె చరిత్రాంశములనుండి క్లుప్తముగా నిటను గ్రహించి వ్రాయుచు కడసారి ఆమె రూపమును కూడ యందు ముద్రించుచున్నారము.

'అన్యులకు మేలుచేయనీయతివబుట్టె,' అను గీతచరణ మెచటిదియోగాని నయ్యది ఈయతివయడ సంపూర్ణముగా సార్థకత వహించినయది.

ఈమె పితామహస్థానము కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు మాతామహస్థానము ఆ జిల్లాలో చేరిన కంచెలయను గ్రామము. ఈమె 1874 సంవత్సరమున జన్మించెను. ఈమె జన్మించిన 6 ఏండ్లకే ఈమెతండ్రిగారు స్వర్గస్తులయిరి. ఈమెకు చిన్నప్పటినుండియు ఓర్పుయెక్కువ. అందుననే ఈమె జీవితకాలమునందీమెకు కలిగిన సంసారిక పుత్రవిరహాది దుఃఖములను సహింపగల్గి తనతోటి యువతులకు జ్ఞానాభివృద్ధి కారణములగు అనేకగ్రంథములను రచించుటకు కారణమైనది. అల్లికపనులయందీమెకుగల నేర్పు యిప్పుడు ప్రచురింపఁబడుచుండిన క్రోషాఅల్లిక పుస్తకమునందును దేశదేశములలోని పిండివంటలు భోజనపదార్థములు మున్నగునవి చేయ నేర్పు ఈమెచే వ్రాయబడి అప్పుడప్పుడు హిందూసుందరిలో ప్రచురింపబడిన వ్యాసములవలనను స్పష్టమగుచున్నది.

ఇంటికిగావలసిన ఉన్నిదుస్తులను పిల్లలకోటులు మొదలగునవియు ఈమెయు యీమె కుమార్తెయును నల్లుచుందురు. వెనుక వ్రాసినట్లు ఈమె ఆఱవయేట దండ్రిగారు గతించుటచే తల్లి గంగమ్మగారును తమ్ముడును సవతియున్నగారుద్యోగము జేయుచున్నచోటికిఁ

బోవ యీమెకు 10వ యేట దేవరకొండయను గ్రామమున వివాహమయ్యెను. ఈమె భర్తయగు మాధవరావుగారికి మధ్యపరగణాలలో నుద్యోగమగుటచేఁ దల్లియు దమ్ముడును కూడ భర్తగారి యింటికరిగెను. అచ్చటికివెళ్లువఱకును జదువుకొననేలేదు. అచ్చట తమ్మునితోగూడ జదువుకొనుటకు తనయభిలాషచేతనే ప్రారంభించెను. గాని యొకరు ప్రేరేపణ సేయలేదు. అక్కడ అక్కయు దమ్ముడును తెలుగును హిందియు జదివిరి. తమ్మునికన్న అక్కయే తెలివితేటలుగా నుండెడిదట - తరువాత మన యాచారములనుబట్టి సాంసారికభారమువహించిన తరువాత అక్కయు దమ్ముడును విద్యాభ్యాసమునందు జీలిరి. అక్క యుద్యోగగ్రామములలోను దమ్ముడు నాగపురవిద్యాశాలలో నుండవలసివచ్చెను. ఆమెయంత బుద్ధిసూక్ష్మము గలదయిన మన పద్ధతులను బట్టి యింగ్లీషు మొదలగు గొప్ప విద్యను నేర్చుకొనలేకపోయెను. తమ్ముడు ధనవంతుఁడగుటచే ఎం.ఏ. పట్టమునందెను. ఈ విద్యావ్యాసవిషయమయి శ్రీమతి అచ్చమాంబగారు తమ రత్నమాలయందు సంపూర్ణముగా వ్రాసియుండిరి.

నాయెుక్కబుద్ధి యిట్టి గహనవిషయములయందింత సులభముగా ప్రవేశించుటచూడగా స్త్రీబుద్ధి పురుషబుద్ధికన్న మందమనియు స్త్రీల మెదడు మస్తిష్కము పురుషుల మస్తిష్కము మెదడుకన్న బలహీనమగుటచే దక్కువతూగుననియు వ్రాయువ్రాత బక్షపాతముకలదనుట నిర్వివాదమే - స్త్రీలు నైసర్గికమూఢురాండ్రనుటకంటె బాల్యమునుండియు వారికి విద్యాగంధమే సోకనియ్యనందున మూఢురాండ్రుగానున్నారనుట మంచిది - చిన్నతనమున బాలురు బాలికలు సమబుద్ధికలవారుగానున్నను శాస్త్రవిషయములఁ బ్రవేశపెట్టనందున బురుషులు జ్ఞానాధికులును ఎట్టి తెలివిగలదైనను కన్నతల్లిదండ్రులే యామెను పైకిరానీయక మూలమూలల నణగద్రొక్కుటచేఁ బాలిక మూర్ఖురాలును అగుచున్నవారు. స్త్రీయభివృద్ధి లేకుండుటకిట్లు మనవారి పక్షపాతమే మూలముకాని మరొకటికాదు. పురుషులాపక్షపాతమును విడిచిరేని స్త్రీలు విద్యావతులయి భర్తలకర్ధాంగులన్న నామము సార్థకముజేతురని నానమ్మకము, అనునట్టు యర్థములనిచ్చు కొంత వ్యాసమును 122వ పుటలో వ్రాసినవారు పయిమాటలు యదార్థములని యందరు నొప్పుకొందురుకదా?

సంసారభారమునఁ జదువున కాటంకము కలిగినను అభిలాష వదలకపోవుటచే తీరికగలిగినప్పుడేదియో జదువుచు వ్రాయుచు భర్తగారి కార్యసమాజమునందభిలాషయగుటచే నాయనతెప్పించిన యాగ్రంథములనుజదువుచు మహారాష్ట్రాదులను నేర్చుకొనెను. సంఘసంస్కరణమును బోధించు కల్పనాకథాత్మికమగు నొక్కయుత్కృష్టమహారాష్ట్రగ్రంథము లభించుటచే దానినిఁజదివియు మహారాష్ట్ర స్త్రీచే వ్రాయఁబడిన ఆనందీబాయి చరిత్రమును

జదివియు స్త్రీవిద్యా స్త్రీస్వాతంత్రియములను గూర్చి అచ్చమాంబగారు కొన్ని అభిప్రాయభేదముల నొంది వారి రత్నమాలలో వ్రాసిరి. ఈమెకు సంసారమునందేనక యాపదలు వచ్చినవి – మొట్టమొదట కన్నకూతురుకన్న నెక్కువగాజూచుకొను సవతికూతురునకు వైధవ్యము వచ్చెను. ఆమె కూతురును గొడుకును మృతినొందిరి. ఇన్ని కష్టములలోనే గ్రంథములు వ్రాసిన యీమెసాహసమెవరు కొనియాడగలరు – బీదలయందీమెకు విశేషకరుణయగుటచే దిక్కుమాలిన పిల్లలనీమె పెంచుచుండెడిది – స్త్రీసమాజముల నేర్పాటుచేయుచు దేశయాత్రచేసినప్పుడీమెతో వచ్చిన పుత్రుఁడట్టిపిల్లవాడే. 1897 సం॥ కరువున 10 సం॥ల హిందుస్తానిపిల్లవాఁడు తననాశ్రయించగా వానికన్నవస్త్రములిచ్చి చదువు చెప్పించెను. ఆ కఱువులోనే మూడునెలల పసిపిల్లవానిని గతిలేక తలిదండ్రులు క్షామనిధిలో విడిచిపోగా కురూపిగానున్న యాశిశువును భర్తృప్రేరణమున బెంచి పెద్దవానిగావించి విద్యాభ్యాసము జేయించిరి.

అచ్చమాంబగారికి తమ్మునికిని గల పరస్పరానురాగము తమ్ములగు లక్ష్మణరావుగారు రచించిన శివాజీ చరిత్రలో అబలాసచ్చరిత్రరత్నమాలలో యుదహరింపబడియుండుటచేతను ఆమెకు భర్తగారియందుగల భక్తి ఆమె రత్నమాల భర్తగారికంకితమొనర్చియుండుటచేతను పూర్తిగా దెలిసికొనవచ్చును. ఆమె సవతికూతునకు ఆమెకునుగల పరస్పరానురాగము జూచితీరవలసినదియే కాని వ్రాయనలవికాదు. కూతురిపేరు మీనాక్షమ్మగారు. ఆమెకు మూర్ఛయే లేకున్నచో దల్లిగారివలె కర్ణాటాంధ్రఘూర్జరమహారాష్ట్రములలోనున్న యసాధారణపాండిత్యమునకు రత్నమాలలో దల్లిగారికి దోడ్పడుటమాత్రమేగాక కొన్ని గ్రంథములు రచించియేయుండును. ఈమెకు బుత్రశోకము వచ్చినప్పుడు తన తమ్ముడు 'శబ్దేందుశేఖరఃపుత్రోమంజూషామమకన్యకా,' యనునాగోజీబట్టుగారి శ్లోకమునకు భట్టుగారు తన శాశ్వతములగు గ్రంథములనే పుత్రీపుత్రులుగా భావించుచుండువారనియు నశాశ్వతమగు సంతానము కాదనియు జెప్పగాదామును రత్నమాలవిరచించి తమపుత్రవియోగశోకము నాపుకొనిరి. ఈ సంగతి వారి రత్నమాలలోనే కానుపించుచున్నది. ఉపకరణములు దొరకనందున నామె తలచుకొన్నట్లు రత్నమాల దక్షిణభాగములు ప్రచురించుటకు వీలుచిక్కినదికాదు. దైవమున కింతలోనే కన్నెర్రనయ్యెను. ఈమె 26వ డిశంబరు 20 తేదిన భర్తగారితో కాంగ్రెసు చూచుటకై బొంబాయినగరమునకేగి అదివరకే నచ్చటనున్న తమ్మునితోడను అమ్మాహోయుత్సవముజూచి 2వ జనవరికి బిలానపురమునకు వచ్చిరి. అప్పటికి భర్తగారికి రాయపురమునకు బదిలీఅగుటచేత వారు 7వ తారీఖున చార్జి యిచ్చివేసిరి. 8వ తేది అచ్చమాంబగారికి బ్రహ్మాండమైన జ్వరము తగిలినది. అది 18వ తేదివరకు విడువలేదు. మొదటిమూడురోజులును అది ప్లేగుజ్వరమని భయబడిరట.

అందుచేత బందుగులకుగాని మరియవరిగాని టెలిగ్రాం మొదలయినవీయలేదు. నాలుగవరోజున డాక్టర్లు అదినవజ్వరమని పేరుబెట్టిరి. అప్పుడామెకు జ్వరము హెచ్చె. స్మృతితప్పుటకూడ తటస్థింపగా నామెతమ్ములగు లక్ష్మణరావుగారికి తంతివార్త పంపిరి. 8వ తేది వుదయముకు గాశీయాత్ర శేవించివచ్చిన యామెతల్లిగారును తమ్ముడునురాగా వారిని చూచి గుర్తించి దుఃఖపడవద్దని చెప్పిరి. స్వదేశమునందు జేయబడిన వానివేగాని దాను స్వీకరించనను నియమమునామెనెంతో జాగ్రత్తగా జరుపుకొనుచుండుటవల్ల డాక్టరు రోగోపశాంతికి దొడుగుకొనవలసినదని చెప్పి తెప్పించిన మేజోళ్ళన్యదేశీయులు చేసినవని తనకక్కరలేదని యావలబారవయిచిరట హా! దేశాభిమానమన్న నిది గదా! ఇట్టియువతీరత్నము పోవుటదేశముయొక్క దౌర్భాగ్యముగాక మఱేమున్నయది. స్త్రీవిద్యయందును సంఘసంస్కరణవిషయములందును దక్కినయన్నివిషయములందును నాకుమార్గదర్శినియగు తోబుట్టువు పోవుటచే నాగతి రెక్కలులేని పక్షిగతియయ్యెనని లక్ష్మణరావుగారు వ్రాయుచున్నారు. ఇది సత్యమే అయినను ఆపత్తులు వచ్చినప్పుడే ధైర్యము పూనవలెను. ఈమె క్రోషాఅల్లిక ఊలుఅల్లికె రత్నమాల రెండవభాగము అను గ్రంథములు వ్రాయుచు మృతినొందినది. ఈమె మృతివలన లక్ష్మణరావుగారికి సోదరీవియోగమును మాధవరావుగారికి పత్నీవియోగమునేకాక సుందరీపత్రికకు మాతృవియోగముకూడఁగలిగినదని మేమెన్నుచున్నారము – ఆమె యాత్మకు భగవంతుడు సద్గతి కలుగచేయుగాత.

అచ్చమాంబగారు ప్రారంభించిన పుస్తకములు నిలిచిపోకుండ మీనాక్షమ్మగారు పూర్తిచేసి తల్లిగారికీ వృద్ధినేతురని నమ్ముచున్నాము. ఆపత్సముద్రమునందున్న మామిత్రులగు మాధవరావుగారికిని మా పరామర్శలందించుచున్నారము. వారికాసర్వేశ్వరుడే మనోధైర్య మొసంగవలెను, గాని అస్మదాదులేమి ధైర్యము గరపశక్తులమగుదుము. (హిందూసుందరి 1905 ఫిబ్రవరి)

అచ్చమాంబ మరణించినపుడు

(తెలుగు జనానా పత్రిక & సతీహితబోధిని
పత్రిక ప్రచురించిన స్మరణ– కందుకూరి వీరేశలింగంపంతులు)

అబలాసచ్చరిత్రరత్నమాలాదిగ్రంథములను రచించి తెలుఁగు దేశమునకు మహోపకారము చేసిన శ్రీమతి భండారు అచ్చమాంబ గారి యకాలమరణవార్తను గత మాసపత్రికయందుఁ దెలిపియుంటిమి. ఇప్పు డీవిదుషీరత్నముయొక్క చరిత్రమును మిక్కిలి సంగ్రహముగా నిందుఁబొందుపఱుచుచున్నాము. ఈమెయొక్కపట మీపత్రికయొక్క మొదటఁ జేర్పఁబడియున్నది. శ్రీ హిందూసుందరీపత్రికాధికారులగు బ్రహ్మశ్రీ మ–రా–రా–శ్రీ సత్తిరాజు సీతారామయ్యపంతులుగారు మాకీమెపటములను దయచేసి నందులకయి మే మాయనయెడల మిక్కిలి కృతజ్ఞులమయి యాయనకు మావందనముల నర్పించుచున్నాము.

ఈకాంతాతిలకము 1874వ సంవత్సరమునందు కృషామండలములోని మునగాలసంస్థానమునకు దివానుగానుండిన కొమఱ్ఱాజు వెంకటప్పయ్యగారికిని తద్ధర్మపత్నియగు గంగమాంబగారికిని నందిగామ గ్రామమునందు జననమొందెను. ఈమె కాఱుసంవత్సరముల ప్రాయము వచ్చునప్పటి కనఁగా 1880వ సంవత్సరమునందు పితృవియోగ దుఃఖము సంభవించెను. అనంతర మచ్చమాంబగారిని తమ్ముడగు లక్ష్మణరావుగారిని వెంటఁగొని వీరితల్లి గంగమాంబగారు మధ్యపరగణాలలో నుద్యోగములో నున్న తనసవతి యన్నగారియొద్ద కరిగెను. అచ్చమాంబగారి సవతి మేనమామయగు భండారు మాధవరావుగారికి ప్రథమకళత్రవియోగము తటస్థింపఁగా, తల్లిగా రీమె నాయనకు పదవయేట 1884వ సంవత్సరమునందు వివాహము చేసిరి. పెండ్లినాటికీమె చదువెఱుఁగదు. తరువాతనైనను పాఠశాలకు దేనికిని బోయి చదువుకొనలేదు. తరువాత తమ్ముడింట తెలుఁగుభాషయు హిందీ భాషయు నభ్యసించుచుండఁగా స్వాభావికమైన విద్యాభిలాషచేత నాతనితోఁగలిసి యీమె తానును విద్యాభ్యాసము చేయ నారంభించెను. ఈమె భర్తగారు

పూర్వాచారపరాయణులు కానందున భార్యవిద్యకు ప్రతిబంధములు కల్పింపక ప్రోత్సాహము కలిగించిరి. ఈమాధవరావుగా రాకాలమునందు రాజమహేంద్రవరమునఁ బ్రకటింపఁబడుచు సంఘసంస్కరణపక్షము నవలంబించియుండిన వివేకవర్ధనీ పత్రికకు చందాదారులయి స్త్రీ విద్యాభిమానమును సంస్కరణప్రియత్వమును గలవారయి యుండిరి. ఈమె తమ్మునితోఁ గలిసి విద్యాభ్యాసము చేయుచు స్వభాషయగు తెలుఁగుభాషలోను తా నప్పుడున్న మధ్య పరగణాలభాషయగు మహారాష్ట్రభాషలోను గొంతజ్ఞానమును సంపాదించెను. ఇట్లుండగానామె తమ్ముడగు లక్ష్మణరావుగారింగ్లీషు విద్యాభ్యాసనిమిత్తమునఁ దనయక్కగారిని విడిచి నాగపురమునకుఁ బోవలసినవాఁడయ్యెను. అందుచేతనీమె యప్పటినుండి స్వయంకృషిచేతనే విద్యాభివృద్ధి చేసికొనవలసినదయ్యెను. అయినను లక్ష్మణరావుగారు సెలవుదినములలో వచ్చి యక్కగారితో నుండి యామె విద్యాభివృద్ధికి తోడుపడుచునే యుండెను. ఈయన కలకత్తా సర్వకళాశాలా శాస్త్రోపాధ్యాయపరీక్ష (యం.ఏ) యందుఁగృతార్థుడయి యిప్పుడు మునగాల సంస్థానమునకు దివానుగా నున్నవాడు. ఈయన యటుతరువాత సహిత మప్పగారి విద్యాభివృద్ధి కెంతో తోడుపడుచుండెను. తమ్ముని సాహాయ్యమువలనను స్వయంకృషివలనను ఈమె హిందీఘూర్జరబంగాళీ మహారాష్ట్రసంస్కృతభాషలయందుఁ దగుపాటి పాండిత్యమును సంపాదించెను. గ్రంథరచనయందీమె కీభాషలు మిక్కిలి తోడుపడినవి. మొట్టమొదట నీమె రచియించిన యపూర్ణవచనప్రబంధమునొకదానిని చింతామణీపత్రికను నడవుకాలములో మాకుఁ బంపెను గాని యది యప్పుడు ప్రకటింపఁబడలేదు. దాని ప్రతి మాయొద్దనే యుండవలెను. రచియించిన రెండవగ్రంథ మబలాసచ్చరిత్రరత్నమాల. ఇదియు శ్రీ చింతామణీపత్రిక నిలువు చేయఁబడువఱకును దానిలోనే ముద్రింపఁబడుచువచ్చినది. ఇట్టి గ్రంథరచనను స్త్రీ గాక పురుషుఁడు చేసినను మహాగౌరవావహమని చెప్పుట తప్ప సర్వజన శ్లాఘా పాత్రమయిన యీగ్రంథరత్నమును గూర్చి మేమెక్కువ చెప్పవలసిన పనిలేదు. ఈమె కింగ్లీషుబాషాపాండిత్యము లేకపోయినందునను సంస్కృతబాషాజ్ఞాన మంతవిశేషము కానందునను అబలాసచ్చరిత్రరత్నమాలా రచనకాలమునం దీమెసోదరుఁ డీమె కెంతో సహాయుడుగా నుండెను. ఈయక్క తమ్ముల యన్యోన్యానురాగ మింతంతయని చెప్పుటకు వీలు లేదు. వీరు శరీరములు వేరయినను ప్రాణము లొక్కటియే యయినట్టుండెడివారు. వీరిని మేము స్వయముగా నెఱుఁగుదుము. ఈమెకు మహారాష్ట్ర తెలుఁగు కన్నడదేశములయందు చేయు పిండివంటలు చేయు క్రమము చక్కఁగా తెలియును. అంతేకాక మ్రుగ్గులు పెట్టుటయందును కుట్టుపనియు నల్లికపనియు చేయుటయందును పాకము చేయుటయందును ఈమె సమర్థురాలు. అల్లికపనివిషయమునను కుట్టుపని

విషయమునను ఈమె పుస్తకములు వ్రాయ నారంభించెనుగాని ముగింపఁగలుగుటకు ముందే లోకాంతరగతురా లయ్యెను. ఈమె యారంభించి ముగింపకుండినది యబలాసచ్చరిత్రరత్నమాలయొక్క రెండవభాగముకూడ నున్నది. ఈగ్రంథరచనకొఱ కీమె యెంతో శ్రమచేసి కొంతవఱకు పరికరములను సమకూర్ప఼ గలిగెను. ఈభాగమునందు వైదికపౌరాణికస్త్రీలచరిత్రము లుండును. ఈగ్రంథములన్నియు ముగిసియుండినపక్షమున స్త్రీలోకమునకు మహోపకారకములయియుండి యుండును. దేశముయొక్క యభాగ్యముచేత నీమె యాకస్మికముగా గీర్తిశేషురా లగుట తటస్థమయ్యెను. కటకటా! దైవము నేమనవచ్చును! ఈమె 1903వ సంవత్సరారంభమున఼ దెనుఁగుదేశమంతయు఼ దిరిగి ముఖ్యపట్టణములలో నుపన్యాసము లిచ్చి యచ్చటచ్చట మహిళాసమాజములను స్థాపించెను. ఈమె స్త్రీల నిమిత్తమయి యేర్పడిన తెలుఁగుపత్రికలకు నీతిబోధకములును వినోదకరములును జ్ఞానప్రదములును నయినకథలను వ్యాసములను దఱచుగా వ్రాయుచుండెడిది.

ఈమెకు఼ గల యాంధ్రభాషా పాండిత్యమును గ్రంథరచన సామర్థ్యమును స్త్రీలలో నసామాన్యములే యైనను, పాండిత్యమునకన్న గుణసంపదచేత నీమె యెక్కువ శ్లాఘ్యురాలని చెప్పవలసియున్నది. ఈమె జాతి మత ద్వేషము లేనిదయి సర్వజనులయందును సమానప్రేమను గలదయియుండెను. 1903వ సంవత్సరమునందు వచ్చిన క్షామసమయమునందు రెండు నెలల యీడుగల యొకపురుషశిశువు తల్లిదండ్రులచే విడువఁబడి కాటకపుపాకలోనికిఁగొని రా఼బడెను. ఆశిశు వప్పుడు కురూపిగా఼ గన఼ బడినందున ముట్టుకొనుటకు సహిత మెవ్వరు నొల్లకుండిరి. అర్భ సంరక్షణము లేక ప్రాణములు గోలుపోవలసిన దుర్దశలో నుండి నప్పుడచ్చమాంబగారావార్తను విని జాలిపడి కాటరవు పాకకుఁబోయి యాశిశువును గొనివచ్చి తనయింట఼ బెట్టుకొని కన్నబిడ్డనువలె఼ బెంప఼జొచ్చెను. ఇప్పుడశిశువు చక్కని బాలుఁడయి వారియింట఼ బెరుగుచున్నాడు. యాచనావృత్తిహేయమయినదనియు పాటుపడి జీవనము చేయుట యెల్లవారికిని నర్హకృత్యమనియు నామె తల఼చియుండెను. పదిసంవత్సరముల యీడుగల బ్రాహ్మణబాలు఼ డొక఼డు తన చెల్లెలితోను తల్లితోను గలిసి యింటింట఼ దిరిగి యుదర పోషణార్థము యాచించుచుండెను. ఆపిల్లవాడు తెలివిగలవా఼డుగా఼గన఼బడ఼గా నచ్చమాంబగా రాకుటుంబమును దనయింట నుంచుకొని వానికి విద్యచెప్పించి, తగినసంబంధము విచారించి వాని చెల్లెలికి వివాహము చేసి, ఒక యావును గొని యిచ్చి వానితల్లి దాని పాలమ్ముకొని జీవనము చేయునట్లు చేసెను. ఈమె చేసిన మంచిపను లిటువంటి వనేకములున్నవి. ఈమెకు సంఘసంస్కరణమునం దత్యంతాదర ముండెను. ఈమె మఱ఼ది (భర్తృసోదరుడు) యైన దండపాణిగారికి఼ గొన్ని సంవత్సరములక్రిందట

భార్యావియోగము కలుగ఼గా, అచ్చమాంబగారును తద్భర్తగారును కూడ ప్రోత్సాహపఱిచి యాయనను వితంతువును వివాహమాడునట్లు చేసిరి. స్త్రీలు విద్యావతులయిన఼ జెడిపోవుదురని పామరులు పలుకుచుందురుగదా. వారిమాట లసత్యము లనియు స్త్రీలు చదివినవారయినచో సత్ప్రవర్తనము గలవారయి తమకును లోకమునకునుగూడ మేలు చేయ఼గలుగుదుననియు నీసాధ్వీమణి యొక్క చరిత్రము చెప్పక చెప్పుచున్నది. పరోపకారశీలురా లయిన యీమె యకాలమరణములవలన మాకు మా సోదరిని గోలుపోయినట్టు దుఃఖము కలుగుచున్నది. ఇట్లుండగా తత్ప్రియభర్తకును కన్నతల్లికిని తోడ఼బుట్టినవానికిని దుఃఖ మెంత దుస్సహముగా నుండునో! ఈశ్వరుఁడు వారి కందఱకును దుఃఖోపశమనము చేసి మనశ్శాంతిని గలిగించును గాక!“

అచ్చమాంబగారి ఉపన్యాసమునకు పూర్వము వేమవర్పు మహాలక్ష్మమ్మగారిచే చదువబడిన ఆహ్వానపత్రిక.

మధ్యపరగణాల యందుపచయను గ్రామమున సబురివిజను ఆఫీసరుగానున్న మ॥రా॥శ్రీ భండారు మాధవరావుగారి సహధర్మచారిణియు కృష్ణా మండలములోని మునగాలసీమకు దివాన్‌గానుండి గతించిన కొమర్రాజు వేంకటప్పయ్యగారి పుత్రికయు ప్రస్తుతము ఆ మునగాల యస్టేటునకే దివాన్‌గానున్న లక్ష్మణరావు యం.ఏ. గారి సోదరియు అబలాసచ్చరిత్ర రత్నమాలయను గ్రంథమును రచియించినట్టియు యిచట ప్రచురింపబడుచుండు 'హిందూసుందరి' పత్రికకు చక్కని వ్యాసములు వ్రాయుచున్న శ్రీమతి భండారు అచ్చమాంబగారు సకుటుంబసమేతముగా యీ నెల 17వ తేదీని ఈ గ్రామమునకు విచ్చేసిరి. ఆమెగారి పోషమున దినదినాభివృద్ధి నొందుచున్న హిందూసుందరి ఆఫీసు చూచి హిందూసుందరిని యనేక రెట్లు వృద్ధిలోకి తేవలయునను తలంపే యామెనిటకు దోడ్కొనివచ్చినది ఈమెగారిటీవల మచిలీబందరునందు జనానాస్త్రీలకొక సమాజమును స్థాపన జేయించినటులను వార్తాపత్రికలన్నియు చాటియేయున్నవి. 19వ తేది సోమవారముర్రోజున ఏలూరునందు హిందూసుందరీ కార్యస్థానమున జనానాస్త్రీలసభ జరిగెను. దాదాపు 200 స్త్రీలు సభ నలంకరించిరి. ఈ సభకి డిస్ట్రిక్టు మునసబు మ॥రా॥శ్రీ రుద్రవరపు హనుమంతరావుపంతులు గారి ధర్మపత్నిగారగ్రాసనాధిపత్యము వహించిరి. మ॥రా॥శ్రీ ప్లీడరు వేమవరపుప్రసాదరావుగారి కొమార్తె మంగామహలక్ష్మమ్మగారు ఏలూరు స్త్రీసంఘమువారి పక్షమున అచ్చమాంబగారిని ఈ పురమునకు ఆహ్వానము చేయుచు నీక్రింది యుపన్యాసమునుడివిరి.

నారీరత్నములారా?

మీ అందరి పక్షముననూ, స్త్రీల శ్రేయోభివృద్ధి గోరిన యెల్లరి పక్షమునను 'శ్రీ మహాలక్ష్మీతుల్యురాలగు భండారు అచ్చమాంబ గారిని' ఈ పురమునకు ఆహ్వానము

చేయుచున్నాను. ఈమె ముఖారవిందము మనకు క్రొత్తయైనను ఈమె నామము ప్రతీగృహమునను స్మరించబడుచునే యున్నది. అదృష్టవశాత్తు, హిందూసుందరీ పత్రిక యిచట ప్రకటింపఁబడు తావుగనుక, ఆమెకాపత్రికాపుత్రికయందుగల యభిమానముచేతనో లేక మన యదృష్టవశముచేతనో, యామె యిచటికి రాఁదటస్తించుటయు, ఆమెగారివలన కొన్ని సంగతులు వినుదశ కలుగుటయు జూడ నేఁడు సుదినముగా భావించుచున్నాను. మును, మొల్ల, తరికొండ వెంకమ్మ మొదలగు విద్యాసుందరులుండి మన స్త్రీతెగకంతయు వన్నె తెచ్చిరి. అట్టివారి నామములు వినుటయే తటస్తించినది నేఁడు వారితో సమానురాలగు నీమెగారిని కన్నారగాంచు భాగ్యము లభించినది. స్త్రీలయభివృద్ధి గోరి పాటుబడుచుండిన మహనీయురాంద్రలో యీమె అగ్రగణ్యురాలు. మనలోనొక కార్యమునకు పూనిక చేయుటకంటె దూషించుటయందు స్త్రీలను బానిసలవలె భావింపవలెనను యభిలాష యతిశయించియున్న నీ సమయమున మన స్థితిగతులను బాగొనర్పనీవనితామణి పూనుకొనుటయెంతయు సంతసముగా నున్నది. దూషణలను నరకుగొనక, ముందుంజవేసి మన శ్రేయోభివృద్ధిగోరు నీ అచ్చమాంబగారికి నయ్యనంతుండుదీర్ఘాయురారోగ్యసంపదల నిచ్చుగాత. యనిమీయందరి యనుజ్ఞపై నీ పూలహారమును నీమెకంఠమందుంచుచున్నాను.

అనంతరము అచ్చమాంబగారు తాము ఇండియా దేశములో చూచిన ప్రదేశములు అందలి స్త్రీల స్థితిగతులు వారి ఆచారవ్యవహారములు ఆ దేశపు స్త్రీలయందనేకులు విద్యావివేక వినయసంపన్నురాలై స్త్రీల యుపయోగార్థము వివిధ వార్తాపత్రికలం బ్రచురించుటయేగాక అందందు గొప్పగొప్ప స్త్రీసంఘములేర్పరచి తర్కుగ వివిధములగు నుపన్యాసములు జేయుచుండువిధమును ఆ దేశములయందలి స్త్రీలచే చేయఁబడు వంటకములు కుట్టుపనులు మున్నగు వస్తుప్రదర్శన విషయములను గూర్చియు రెండుగంటలుపన్యసించి జనానాస్త్రీలయభివృద్ధికొక సమాజమీపురమున యుండు టావశ్యకమనియు తీరికసమయములలో ఇరుగుపొరుగు అమ్మలక్కల పుక్కిటపురాణముల ప్రొద్దుబుచ్చక వార్తాపత్రికలు సద్గ్రంథములు చదువుకొనుట వలన దేశయాత్ర జేయకున్నను నానాదేశ వినోదవిశేషములు మున్నగునవి నేర్చుకొనుటకును యుక్తవిషయములను గూర్చి యాచరించుటకును వీలుగా నుండునని యుపన్యసించిరి. ఆమె ఉపన్యాసము వినినయొక సుందరిచే సంగ్రహముగా వ్రాయఁబడిన దానినీదిగువ ముద్రించియున్నాము.

ఏలూరు పట్టణంలో అచ్చమాంబ ఇచ్చిన ఉపన్యాసం

సోదరీమణులారా?

నేఁటి సాయంకాలము ఇచ్చట మనమందఱము కూడియుండుట చూచి నాకు చాలా సంతోషకరముగానున్నది. యిటువలెనే స్త్రీలందఱు వారమునకు ఒకసారి అయినను లేక నెలకు ఒకదినమునైన ఏర్పాటుచేసుకుని విద్యవిషయమై సంభాషణ చేసినయెడల చాలా లాభకరముగానుండును. మనవైపున స్త్రీవిద్య చాలా హీనదశలోనున్నది. నేనువున్న పచ్చిమరి, నాగపూరు, ఆయాపట్టణములలో చాలామంది స్త్రీలు విద్యావతులు సాహసధైర్యముగలవారై వుంటున్నారు. బొంబాయి పట్టణములో ఒక మహారాష్ట్ర స్త్రీ స్వయముగా మహారాష్ట్రపత్రిక ప్రచురింపుచున్నది. నలుగురు స్త్రీలు పోగై కొంతధనమును నిలువవుంచి దానిపైన వచ్చిన లాభముతో పత్రిక ప్రచురింపుచున్నారు.

అటువంటి దశ మన స్త్రీలకు ఎప్పుడు లభించునో తెలియకున్నది. స్వయముగా పత్రికను స్థాపింపకుండినను స్త్రీలకొఱకై ప్రచురింపబడు పత్రికకు అయినను వ్యాసములు వ్రాసి పంపుటకు ధైర్యము లేనివారై ఉంటున్నారు. సాధారణముగా మనలో స్త్రీలు మధ్యాహ్నముపూట ఒకచోటకూడి మాటలాడుట కలదు. ఆ సమయములో ఎక్కువగా కూరగాయ కబురులేకాని వేఱుకాదు. ఒక్కొక్క సమయములో ఏమి మాటలాడుటకు లేనియెడల యితరులవిషయమై మాట్లాడుటకలదు. ఆలా సంభాషించడములో చాలా మోసమున్నది. ఏలాగనగా ఆ పదుగురు స్త్రీలలో కొండెకత్తెలు సాధారణముగానుందురు. కొందఱు స్త్రీలకు జగడములుపెట్టి చూచుటకు వేడుక కలవారయివుందురు. ఆలాటివారు వున్నయెడల వెంటనే అచ్చట యితరుల విషయమై ఆడినముచ్చటలు యీకొండెకత్తెలద్వారా తెలియును. యీలాటివి అన్ని కలహములురేగి ఒకరియింటికి ఒకరు వెళ్ళకుండా ఆటంకపర్చును. వీటివల్లనే మనలో నైకమత్యత లేదు. గాన ఇలా కూడినప్పుడు విద్యవిషయమై సంభాషించుటయే లాభమని నా ముఖ్య అభిప్రాయము. మనలో ఒక దుర్వాడుకకలదు అదియేదియన.

స్త్రీలు విద్య నేర్చుచు వున్న యెడల దానినే చదువుచు ఇంటిపనులు లేశమయినను ముట్టుకొనక సదా విద్యనే అభ్యసింతురు. విద్యగూర్చినపిమ్మట యింటిపనులు చక్కపెట్టుట వారికి ఏమియు తెలియదు. గాన స్త్రీ మంచి విద్యావతియైన కొలఁది యింటిపనులను చక్కపెట్టుట మొదలయినవి నేర్చుచుండవలయును. మొదట తనయింటిని శుభ్రతగా నుంచవలెను. మంచి తెలివిగలవారయిన ఎడల తన యింటిని ఒక భవనముగా చేసి తన భర్తను సంతోషపెట్టగలరు. మనము ఎంత చదివినను మన ఆచారమును విడువరాదు.

ఉష్ణప్రదేశములకు వెళ్ళినపుడు చలువవస్తువులను శీతల ప్రదేశములకు వెళ్ళినపుడు కాక వస్తువులను ఎటుల పుచ్చుకుందుమో ఆ రీతినే మనము ఏ దేశములో వుందుమో ఆ ఆచారము ప్రకారము నడువవలయును. మన పెద్దలు చెప్పిరని మనము అనేక వ్రతాలను నోములను పట్టుటలో వాటికి ప్రత్యేకము మనము చాలాకాలము వ్యర్థముగా గడుపుదుము. అందులో కొంతకాలము చదువు విషయమై ఏర్పర్చుకొన్న యెడల ఎంతలాభమో బొందగలము. కాబట్టి ఇచటవున్న మీరు అందరు కలసి ఒక చిన్న సమాజము ఏర్పర్చుకొనవలయునని నా ముఖ్య అభిప్రాయము.

ఈమెగారి యుపన్యాసము వినసొంపుగ నుండెనని వాకొనసాగిరి. ఈమెగారి రాక తెలియలేదని కొందరు ఆమెయుపన్యాసము వినలేచుకొనకపోతిమని మరికొందరు చెప్పసాగిరి. ఈ సభ యింత చక్కగ జరుగునని మేమెన్నడు భావించలేదు. అట్టి తరుణమున స్త్రీలందరీ రీతి గుమిగూడుట జూడ మాకే ఆశ్చర్యము కలిగినది.

మరునాడు-౨౦ తేది ఉదయము ఆమెతో కలసి కొందరు స్త్రీలు విందారగించుటకు ముందు ఈ దిగువ ఉపన్యాసము చదువబడినది.

శ్రీమతి అచ్చమాంబగారు పయనమగు సమయమున శ్రీమతి తిరుప్రవరపు కామేశ్వరమ్మగారిచ్చిన ఉపన్యాసము.

నారీమణులారా? నిన్నటిదినము మనమందరము ఇచట సమావేశమైన సమయమున మనకెంతో యానందదాయకముగ ఉపన్యసించిన శ్రీమతి అచ్చమాంబగారిప్పుడే యీపురము వదలివెళ్ళుచుండిరనుమాట వినినతోడనే మన హృదయములెట్టి విచారసాగరమున కొట్టికొనుచున్నవో మీకందరకు స్వానుభవమేగదా? కొద్దికాలమీమె సాన్నిధ్యమున నున్నంత మాత్రముననే ఎన్నడును విని కని యుండని అనేకాంశముల నీమెచే దెలుసుకొని యానందించితిమి.

ఈమె సాన్నిధ్యమువలన అట్లు ఆనందమునొందిన మనసు యీమె వియోగమున అంతకు బదిరెట్లెక్కువ విచారమునొందుట సహజమేకదా? పురుషపుంగవులు స్త్రీలకు తగినవిద్య నేర్పింపకపోవుటచేతను స్త్రీలలో ఇట్టి వివేకవతులందందు సభలు చేర్చి స్త్రీలకుత్సాహము పుట్టి పోవుటచేతను హిందూసుందరులెట్టి దుస్థితి .....వరకును

విశదమె. వీరు చూపిన మార్గమునువిడువక యామెచే నుపన్యసింపఁబడిన వివిధాంశములు మనసునందుంచుకుని మనమందరమిటులనే వారమునకొకసారి ఒకచో సమావేశమై ముచ్చటించుకొనుచుండిన శీఘ్రకాలములో మనమభివృద్ధిని పొందగలము గాన ఈ విషయమింకొకదినమున ముచ్చటించుకొందము. అచ్చమాంబగారికి సర్వశక్తిగల ఈశ్వర్డుతోడై యామె పయనములయందు ఈమెకు అమితసౌఖ్యమును కలుగజేసెడును గాకయని ప్రార్థించుచు యామె మన విద్యాభివృద్ధికొరకై స్వకాయకష్టమునకోర్చి చేయుచున్న కృషి కత్యాంతానందమునొందుచు మీయందరి తరఫున ఈమె కనేక వందనము లాచరించుచున్నాను. మరికొందరు స్త్రీలు ప్రత్యేకమామెకొరకు రచింపబడిన మంగళహారతులను బాడిరి. తర్వాత ఆమెగారితో కలసి రైలుస్టేషనువరకు వెళ్లి రైలెక్కించి వచ్చిరి. ఈమె సవతిపుత్రికయగు మీనాక్షమ్మగారు కేవలము మీనాక్షి యేయనవలెను ఈమెయు అచ్చమాంబగారివలె బంగాళ, మరాటి మున్నగు భాషలయందు చక్కనికృషి చేసియున్నారు. ఇపుడు గుజరాతి భాష నభ్యసించుచున్నారు. ఆంధ్రగీర్వాణములు స్వభాషయేయగుటవలన నాటిపరిచితియామెకు ఉగ్గుపాలతోడనె యలవడినది. ఈ నారీరత్నము లిరువురునుగలసి హిందూసుందరినిపెంచి పెద్దదానినిజేయ నంగీకరించుటచే ఇకముందు మాచే ప్రచురింపబడుచున్న హిందూసుందరి తన సుందరమున ప్రఖ్యాతిబొందుట కేమిసందియము. వీరి కుటుంబము వారందరిచటినుండి రాజమహేంద్రవరము, కాకినాడ వగయిరా పట్టణములు చూచి కాశీపురము విచ్చేయుదురు. ఈమెను చూచినతోడనే మన స్త్రీలను బానిసలవలెయతిగ ద్రొక్కివారికిగల తెలివితేటలను భస్మీభూతము చేయుచుంటిమి గదా యని యాలోచింపవలసి వచ్చుచున్నది.

ఈమె భర్తగారగు మాధవరావుగా రిపుడు ..... మీద నున్నారు. ఈ ౯ మాసముల సెలవులో ౨ మాసములు ఈమెగారి యిష్టప్రకారము యుపన్యాసములిచ్చుటకును, ఆమెకోరినచోటికి తామును వెడలుటకును సమ్మతించిరి. దూషణభూషణలకు సరకుగొనకనీమెగారు కేవల ముపకారబుద్ధితో స్త్రీతెగనభివృద్ధికొరకు పాటుబడనియ్యకొనుట నిజముగావారి యుదారగుణమునకు తార్కాణము. మనలోమాటలుజెప్పు సంఘసంస్కరణపరాయణులవలెగాక నిజమైన సంఘసంస్కారులలో నొకరని చెప్పవలసియున్నారు.

'అన్యులకు మేలుచేయనీయతివబుట్టె,' అను గీతచరణ మెచటిదియోగాని నయ్యది ఈయతివయడ సంపూర్ణముగా సార్థకత వహించినయది.

ఈమె పితామహస్థానము కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు మాతామహస్థానము ఆ జిల్లాలో చేరిన కంచెలయను గ్రామము. ఈమె 1874 సంవత్సరమున జన్మించెను. ఈమె

జన్మించిన 6 ఏండ్లకే ఈమెతండ్రిగారు స్వర్గస్తులయిరి. ఈమెకు చిన్నప్పటినుండియు ఓర్పుయెక్కువ. అందుననే ఈమె జీవితకాలమునందీమెకు కలిగిన సంసారిక పుత్రవిరహాది దుఃఖములను సహింపగల్గి తనతోటి యువతులకు జ్ఞానాభివృద్ధి కారణములగు అనేకగ్రంథములను రచించుటకు కారణమైనది. అల్లికపనులయందీమెకుగల నేర్పు యిప్పుడు ప్రచురింపఁబడుచుండిన క్రోషాఅల్లిక పుస్తకమునందును దేశదేశములలోని పిండివంటలు భోజనపదార్థములు మున్నగునవి చేయ నేర్పు ఈమెచే వ్రాయబడి అప్పుడప్పుడు హిందూసుందరిలో ప్రచురింపబడిన వ్యాసములవలనను స్పష్టమగుచున్నది.

ఇంటికిగావలసిన ఉన్నిదుస్తులను పిల్లలకోటులు మొదలగునవియు ఈమెయు యామె కుమార్తెయు నల్లుచుందురు. వెనుక వ్రాసినట్లు ఈమె ఆఱవయేట దండ్రిగారు గతించుటచే తల్లి గంగమ్మగారును తమ్ముడును సవతియన్నగారుద్యోగము జేయుచున్నచోటికిఁ బోవ యామెకు 10వ యేట దేవరకొండయను గ్రామమున వివాహమయ్యెను. ఈమె భర్తయగు మాధవరావుగారికి మధ్యపరగణాలలో నుద్యోగమగుటచేఁ దల్లియు దమ్ముడును కూడ భర్తగారి యింటికరిగెను. అచ్చటికివెళ్లువఱకును జదువుకొననేలేదు. అచ్చట తమ్మునితోగూడ జదువుకొనుటకు తనయభిలాషచేతనే ప్రారంభించెను. గాని యొకరు ప్రేరేపణ సేయలేదు. అక్కడ అక్కయు దమ్ముడును తెలుగును హిందియు జదివిరి. తమ్మునికన్న అక్కయే తెలివితేటలుగా నుండెడిదట – తరువాత మన యాచారములనుబట్టి సాంసారికభారమువహించిన తరువాత అక్కయు దమ్ముడును విద్యాభ్యాసమునందు జీలిరి. అక్క యుద్యోగగ్రామములలోను దమ్ముడు నాగపురవిద్యాశాలలో నుండవలసివచ్చెను. ఆమెయంత బుద్ధిసూక్ష్మము గలదయిన మన పద్ధతులను బట్టి యింగ్లీషు మొదలగు గొప్ప విద్యను నేర్చుకొనలేకపోయెను. తమ్ముడు ధనవంతుఁడగుటచే ఎం.ఏ. పట్టమునందెను. ఈ విద్యావ్యాసవిషయమయి శ్రీమతి అచ్చమాంబగారు తమ రత్నమాలయందు సంపూర్ణముగా వ్రాసియుండిరి.

నాయొక్కబుద్ధి యిట్టి గహనవిషయములయందింత సులభముగా బ్రవేశించుటచూడగా స్త్రీబుద్ధి పురుషబుద్ధికన్న మందమనియు స్త్రీల మెదడు మస్తిష్కము పురుషుల మస్తిష్కము మెదడుకన్న బలహీనమగుటచే దక్కువతూగుననియు వ్రాయువ్రాత బక్షపాతముకలదనుట నిర్వివాదమే – స్త్రీలు నైసర్గికమూఢురాండ్రనుటకంటె బాల్యమునుండియు వారికి విద్యాగంధమే సోకనియ్యనందున మూఢురాండ్రుగానున్నారనుట మంచిది – చిన్నతనమున బాలురు బాలికలు సమబుద్ధికలవారుగానున్నను శాస్త్రవిషయములఁ బ్రవేశపెట్టనందున బురుషులు జ్ఞానాధికులును ఎట్టి తెలివిగలదైనను కన్నతల్లిదండ్రులే యామెను పైకిరానీయక మూలమూలల నణగద్రొక్కుటచేఁ బాలిక

మూర్ఖురాలును అగుచున్నవారు. స్త్రీయభివృద్ధి లేకుండుటకిట్లు మనవారి పక్షపాతమే మూలముకాని మరొకటికాదు. పురుషులాపక్షపాతమును విడిచిరేని స్త్రీలు విద్యావతులయి భర్తలకర్థాంగులన్న నామము సార్థకముజేతురని నానమ్మకము, అనునట్టు యర్థములనిచ్చు కొంత వ్యాసమును 122వ పుటలో వ్రాసినవారు పయిమాటలు యదార్థములని యందరు నొప్పుకొందురుకదా?

సంసారభారమునఁ జదువున కాటంకము కలిగినను అభిలాష వదలకపోవుటచే తీరికగలిగినప్పుడేదియో జదువుచు వ్రాయుచు భర్తగారి కార్యసమాజమునందభిలాషయగుటచే నాయనతెప్పించిన యాగ్రంథములను జదువుచు మహారాష్ట్రాదులను నేర్చుకొనెను. సంఘసంస్కరణమును బోధించు కల్పనాకథాత్మికమగు నొక్కయత్కృష్టమహారాష్ట్రగ్రంథము లభించుటచే దానినిఁజదివియు మహారాష్ట్ర స్త్రీచే వ్రాయఁబడిన ఆనందీబాయి చరిత్రమును జదివియు స్త్రీవిద్యా స్త్రీస్వాతంత్రియములను గూర్చి అచ్చమాంబగారు కొన్ని అభిప్రాయభేదములనొంది వారి రత్నమాలలో వ్రాసిరి. ఈమెకు సంసారమునందేనక యాపదలు వచ్చినవి – మొట్టమొదట కన్నకూతుకన్న నెక్కువగాజూచుకొను సవతికూతునకు వైధవ్యము వచ్చెను. ఆమె కూతురును గొడుకును మృతినొందిరి. ఇన్ని కష్టములలోనే గ్రంథములు వ్రాసిన యీమెసాహసమెవరు కొనియాడగలరు – బీదలయందీమెకు విశేషకరుణయగుటచే దిక్కుమాలిన పిల్లలనీమె పెంచుచుండెడిది – స్త్రీసమాజముల నేర్పాటుచేయుచు దేశయాత్రచేసినప్పుడీమెతో వచ్చిన పుత్రుఁడట్టిపిల్లవాడే. 1897 సం॥ కరువున 10 సం॥ల హిందుస్తానిపిల్లవాఁడు తననాశ్రయించగా వానికన్నవస్త్రములిచ్చి చదువు చెప్పించెను. ఆ కఱువులోనే మూడునెలల పసిపిల్లవానిని గతిలేక తలిదండ్రులు క్షామనిధిలో విడిచిపోగా కురూపిగానున్న యాశిశువును భర్తప్రేరణమున బెంచి పెద్దవానిగావించి విద్యాభ్యాసము జేయించిరి.

అచ్చమాంబగారికి తమ్మునికిని గల పరస్పరానురాగము తమ్ములగు లక్ష్మణరావుగారు రచించిన శివాజీ చరిత్రలో అబలాసచ్చరిత్రరత్నమాలలో యుదహరింపబడియుండుటచేతను ఆమెకు భర్తగారియందుగల భక్తి ఆమె రత్నమాల భర్తగారికంకితమొనర్చియుండుటచేతను పూర్తిగా దెలిసికొనవచ్చును. ఆమె సవతికూతునకు ఆమెకునుగల పరస్పరానురాగము జూచితీరవలసినదియే కాని వ్రాయనలవికాదు. కూతురిపేరు మీనాక్షమ్మగారు. ఆమెకు మూర్ఛయే లేకున్నచో దల్లిగారివలె కర్ణాటాంధ్రఘూర్జరమహారాష్ట్రములలోనున్న యసాధారణపాండిత్యమునకు రత్నమాలలో దల్లిగారికి దోడ్పడుటమాత్రమేగాక కొన్ని గ్రంథములు రచించియేయుండును. ఈమెకు బుత్రశోకము వచ్చినప్పుడు తన తమ్ముడు 'శబ్దేందుశేఖరఃపుత్రోమంజూషామమకన్యకా,' యనునాగోజీబట్టుగారి శ్లోకమునకు భట్టుగారు

తన శాశ్వితములగు గ్రంథములనే పుత్రీపుత్రులుగా భావించుచుండువారనియు నశాశ్వితమగు సంతానము కాదనియు జెప్పగాదామును రత్నమాలవిరచించి తమపుత్రవియోగశోకము నాపుకొనిరి. ఈ సంగతి వారి రత్నమాలలోనే కానుపించుచున్నది. ఉపకరణములు దొరకనందున నామె తలచుకొన్నట్లు రత్నమాల దక్కినభాగములు ప్రచురించుటకు వీలుచిక్కినదికాదు. దైవమున కింతలోనే కన్నెర్రనయ్యెను. ఈమె 26వ డిశంబరు 20 తేదిన భర్తగారితో కాంగ్రెసు చూచుటకై బొంబాయినగరమునకేగి అదివరకే నచ్చటనున్న తమ్మునితోడను అమ్మాహాయుత్సవముజూచి 2వ జనవరికి బిలాసపురమునకు వచ్చిరి. అప్పటికి భర్తగారికి రాయపురమునకు బదిలీఅగుటచేత వారు 7వ తారీఖున చార్జి యిచ్చివేసిరి. 8వ తేది అచ్చమాంబగారికి బ్రహ్మాండమైన జ్వరము తగిలినది. అది 18వ తేదివరకు విడువలేదు. మొదటిమూడురోజులును అది ప్లేగుజ్వరమని భయబడిరట. అందుచేత బందుగులకుగాని మరియవరిగాని టెలిగ్రాం మొదలయినవీయలేదు. నాలుగవరోజున డాక్టర్లు అది నవజ్వరమని పేరుబెట్టిరి. అప్పుడామెకు జ్వరము హెచ్చె. స్మృతితప్పుటకూడ తటస్థింపగా నామెతమ్ములగు లక్ష్మణరావుగారికి తంతివార్త పంపిరి. 8వ తేది వుదయముకు గాశీయాత్ర శేవించివచ్చిన యామెతల్లిగారును తమ్ముడునురాగా వారిని చూచి గుర్తించి దుఃఖపడవద్దని చెప్పిరి. స్వదేశమునందు జేయబడిన వానివేగాని దాను స్వీకరించనను నియమమునామెనెంతో జాగ్రత్తగా జరుపుకొనుచుండుటవల్ల డాక్టరు రోగోపశాంతికి దొడుగుకొనవలసినదని చెప్పి తెప్పించిన మేజోళ్ళన్యదేశీయులు చేసినవని తనకక్కరలేదని యావలబారవయిచిరట హా! దేశాభిమానమన్న నిది గదా! ఇట్టియువతీరత్నము పోవుటదేశముయొక్క దౌర్భాగ్యముగాక మఱెమున్నయది. స్త్రీవిద్యయందును సంఘసంస్కరణవిషయములందును దక్కినయన్నివిషయములందును నాకుమార్గదర్శినియగు తోబుట్టువు పోవుటచే నాగతి రెక్కలులేని పక్షిగతియయ్యెనని లక్ష్మణరావుగారు వ్రాయుచున్నారు. ఇది సత్యమే అయినను ఆపత్తులు వచ్చినప్పుడే ధైర్యము పూనవలెను. ఈమె క్రోషాఅల్లిక ఊలుఅల్లికె రత్నమాల రెండవభాగము అను గ్రంథములు వ్రాయుచు మృతినొందినది. ఈమె మృతివలన లక్ష్మణరావుగారికి సోదరీవియోగమును మాధవరావుగారికి పత్నీవియోగమునేకాక సుందరీపత్రికకు మాతృవియోగముకూడఁగలిగినదని మేమెన్నుచున్నారము – ఆమె యాత్మకు భగవంతుడు సద్గతి కలుగచేయుగాత.

అచ్చమాంబగారు ప్రారంభించిన పుస్తకములు నిలిచిపోకుండ మీనాక్షమ్మగారు పూర్తిచేసి తల్లిగారికీ వృద్ధిసేతురని నమ్ముచున్నాము. ఆపత్సముద్రమునందున్న మామిత్రులగు మాధవరావుగారికిని మా పరామర్శలందించుచున్నారము. వారికాసర్వేశ్వరుడే మనోధైర్య మొసంగవలెను, గాని అస్మదాదులేమి ధైర్యము గరపశక్తులమగుదుము.

కాకినాడలో అచ్చమాంబ ఇచ్చిన ఉపన్యాసం

బాలికాపాఠశాలలలోనిలోపము – తన్నివారణోపాయము

మత్స్యఖీరత్నములారా!!

మన సఖియగు, శ్రీమతి పులుగుర్త లక్ష్మీనరసమాంబగారిని సందర్శించుటకై నేనీ గ్రామమునకు వచ్చితిని. సజ్జనుల సాంగత్యము వలన ననేక లాభములు కలుగుచుండును గాన శ్రీమతి పులుగుర్త నరసమాంబగారి యనుగ్రహమువలన మీబోటివారిని జూచియానందింపఁగలిగితిని. మిమ్ములఁజూచి ముచ్చటింప గలిగి నీయమూల్య కాలంబును సద్వినియోగము చేయుటకై యొకానొక విషయమును గూర్చి యుపన్యాసము వ్రాయుమని నానెచ్చెలి కోరినందువలన నాకత్యంతోపయోగకరమని తోఁచిన ఈ విషయమును గూర్చి వ్రాసి మీకు విన్నవించుచున్నదాన.

స్త్రీవిద్య పురుషవిద్యవలెనే అత్యంతావశ్యకమయినదనియు "విద్యలేనివాఁడు వింతపశువు" అనిన మాట పురుషులకువలెనే స్త్రీలకు జెల్లుననియు నిదివఱకందఱికిఁ దెలిసినవిషయమే. రెండునురెండునుగూడిన నాలుగగుననిన మాటయెంతస్పష్టమో పైసంగతులు కాక స్వతఃప్రమాణమయిన స్త్రీవిద్యనుగూర్చి నేను విశేషము చెప్పవొల్లను. ప్రస్తుతకాలమునందు బాలికాపాఠశాలలోనున్న లోపము అందువలన గలుగుచున్న నష్టమును ఈ లోపములను నివారించుటకుఁదగిన సదుపాయము నాకుఁ దోచినరీతినిదెలిపెద. ఆ గొప్ప లోపమేమియన బాలికలకుఁ బాఠశాలలో ఒకప్పుడును గృహనిర్వాహకత్వము నేర్పకుండుటయేయని నుడువవచ్చును.

స్త్రీవిద్యవలని లాభములనేకములుండినను బ్రస్తుతము మనకు గావలసినవియు సంసారసుఖమునకు నత్యంతావశ్యకమైనవియు ననేకజనులు కోరుచున్నవియు నుత్తమగృహనిర్వాహకపటుత్వముగల గృహిణులఁ చేయుటయేయని చెప్పుటకు సందియములేదు కాన ప్రస్తుతకాలపు దేశమునందలి స్త్రీవిద్యయొక్క ప్రథమోద్దేశ్యము మంచిపత్నులను నిర్మించుటయే గనుక వారికిఁజెప్పు విద్యలో గృహనిర్వాకత్వము ముఖ్యవిషయముగా నుండవలెను.

ప్రస్తుతము మనదేశమునందంతటను బహుస్వల్పముగా స్త్రీవిద్య వ్యాపించుచున్నది. ఇది కొంతవఱకు క్రైస్తవులవలనను మఱికొంత సంస్థానాధీశుల వలనను స్త్రీవిద్యాభిమానులగు స్వదేశబాంధవులవలనను వృద్ధినొందింపఁబడుచున్నది. ఇదియును బాలికలకు యుక్తమగురీతిని నేర్పబడుచుండుటలేదు. ఈ పాఠశాలలలోఁ జాలవఱకుఁ బురుషులే యుపాధ్యాయులయినందువలనను గొందఱు స్త్రీలైనను బరధర్మీయలైనందువలనను జదువుటవ్రాయుటతప్ప గృహనిర్వాహకమునుగూర్చిన సంగతులేవియు బాలికలకు నేర్పఁ బడవు. ఇందువలన మనదేశమునకుఁ గావలసినంత లాభము కలుగకున్నది. దీనింగని స్త్రీవిద్యాశత్రువులను మహానుభావులనేకులు తమకదియే లాభమని తలఁచి యబలలకు విద్యనేర్పిననిట్టినష్టములు కలుగునని వాదింపుచున్నారు. వారు చెప్పెడి సంగతియంతయు నిజముగాకున్ననను స్వల్పమైనను దానియందు వాస్తవముండుననుటకు సందియము లేదు. ఇట్టివారు ఆక్షేపించునాక్షేపణలేవియనఁగా–

"విద్యావతులగు యువతులు గొప్పగొప్పగ్రంథములు చదువుటా, వ్రాయుటా, ఉపన్యాసములిచ్చుటయుదప్ప సంసారమునందలి యావశ్యకములయిన సంతులఁగొన్నిటిని బొత్తిగా నెఱుఁగకున్నారు. ఇందువలన వారికనేకకష్టములు నష్టములును సంభవించుచున్నవి. ఆ నష్టములలో ననేకములు వారికి వంటరానందువలనఁ గలుగుచున్నవి. విద్యావతులయిన స్త్రీలు పాకము చేయనేరరు. విద్యనునేరని మాముద్దియలుపాక నివృత్తియందును ఇంటిపనులయందును విశేషదక్షురాండ్రై సంసారమును జక్కగా నడుపుచున్నారు. అట్టి నారిపుత్రికలు విద్యనేర్చినచో స్త్రీలకత్యంతావశ్యకమగు వంటనే చేయనేరరు గాన విద్యనేర్పి స్త్రీలనేల వృధాగా జెడగొట్టవలెను?"

స్త్రీవిద్యాద్వేష్టలుచ్చరించు నీవాక్యములన్నియు నబద్ధములని స్త్రీవిద్యాభిమానులెవ్వరును జెప్పఁజాలకయున్నారు. ఇది మనకు నిజముగా నగుపడుచుండిన లోపమెకాన స్త్రీలమగు మనమందఱమును జేరి యీ లోపమును నివారించుటకుఁదగిన ఉపాయమునాలోచింతము. ప్రస్తుతము బాలికాపాఠశాలలయందు బాలికలకు వట్టివిద్యమాత్రమే నేర్పఁబడుచున్నది. ఇందువలన బాలికలు తమ ముఖ్యకర్తవ్యము దెలిసికొనక కేవలము చదువను వ్రాయను మాత్రమే నేర్చుకొనుచున్నారు. దీనివలనవారికిఁ గలుగవలసిన జ్ఞానము సంపూర్ణముగాఁ గలుగకవారు మన స్త్రీవిద్యాశత్రువులనెదిరించి వారికి స్త్రీవిద్యవలనఁ గలుగు నమూల్యములైన అనేక లాభముల జూపఁజాలకయున్నారు. ఇందువలన విద్యనేర్పినవారును బ్రస్తుతము గృహకృత్యములఁజేయనేరక నిర్లక్ష్యముగా నున్నారని నాతాత్పర్యము కాదు. గృహనిర్వాహకపటిమ గలిగియుండిన విద్యావతులనేకులుండియే యున్నారు. ఇందులకునుదాహరణముగా జూపుటకు

నాయబలాసచ్చరిత్రరత్నమాలయందు వర్ణింపఁబడిన సౌభాగ్యవతి రఖమాబాయి కేళోకర్ గారును నామెకూతురగు సౌభాగ్యవతియగు కమలాకరమ్మగారును దగినవారుగానున్నారు. తల్లి లేడిసూపరిండెంటు అను గొప్ప ఉద్యోగములో నుండి యింటిపనులన్నియు చేసుకొనుచున్నది. పెద్దయింటిపనులను జక్కగా నిర్వహించుచు పరీక్షనిచ్చి వైద్యవిద్యనభ్యసింపుచున్నది. ఇంతియకాదు విద్యవలన స్త్రీలు గృహనిర్వాహకమునందు నధిక ..... కేవలవిద్య అగ్ని వంటిది దానికి అనుభవమను సమిధలుండినఁగాని చక్కగాఁ బ్రజ్వలింపనేరదు. పుస్తకములలో పాకశాస్త్రము చదివినంతమాత్రమున నావిద్యవచ్చునా? ఆయాగ్రంథములుచదువుట ఆయాశాస్త్రములు చక్కఁగాఁదెలియుటకుఁ దోడుపడుననుటకు సందేహములేదు కాని చదువునకుఁదోడుగా ననుభవము సహితముండవలయును ప్రస్తుతము బాలికాపాఠశాలలోఁ జదువు బాలికలకు ననుభవమనినమాటయే నున్నగానున్నది.

దీని నివారణ వివేకరాంధ్రగు మీబోటిసుదతులవలన గలుగునని నాకుఁ గొండంతయాసపొడమెడిని. ఐరోపాఖండమునందును నమెరికాదేశమునందును వర్తమానకాలమున స్త్రీవిద్యయత్యంతమైన యుచ్చదశ యందుండి యితర దేశములవారికిఁ గన్నులపండువుసేయుచు స్వదేశమున కపారములగు ననేక లాభములను గీర్తిని గలుగఁ జేయుచున్నది. అచట స్త్రీలకు విద్యఁగఱపుమార్గమే వేరుగానుండును. ఆదేశమునందు స్త్రీలుపురుషులకంటెను విశేషవిద్యనునేర్చి గొప్పగొప్పపరీక్షలయందుఁ గృతార్థతనుగాంచుచున్నారు. అచ్చటి సతులెంత విద్యనేర్చిననంత గృహకృత్యములయందు దక్షురాంధ్రై శిశుపాలనమునందు నేర్పుగలిగి సంసారమును నడుపుటలో సమ్మితచాతుర్యవతులై తమయుదాహరణ ములవలన నితరదేశములవారును నట్టిప్రవర్తన నేర్చుకొనునట్టులఁజేయుచున్నారు. ఇతరదేశములకు నింత లాభకారియైన స్త్రీవిద్యవలన మనదేశమునకు సహితమట్టిలాభముకలిగినప్పుడుగదా మనకువిశేషస్వాతంత్ర్యమును గౌరవమును గలుగును. ఇతరదేశములందు బాలికలకుఁ బాఠశాలలయందు చదువుతోఁ బాటుగా పాకశాస్త్రము, వృక్షశాస్త్రము, బాలవైద్యశాస్త్రము, గృహనిర్వాహకత్వము మున్నగు ననేకాంశములు స్త్రీలకత్యంతావశ్యకములగునవి నేర్పుదురుగాన వారి సంసారజ్ఞానము చక్కఁగాఁగలిగి వారు తాము నేర్చిన విద్యనుఁగాని తమకుగలిగినధనమునకుఁగాని గర్వించక విశేషవినయవిధేయలైయుండి స్వదేశోన్నతకొఱకుఁ బురుషులతో సమానముగాఁ బాటుపడుచున్నారు.

ఇంక మనదేశమునందన్ననో ప్రస్తుతము బాలికాపాఠశాలలో వాని తెలియుచున్న బాల్యవివాహములనుజేసి దేశమునకహితము చేయవలసినవారలగుచున్నారు. ఇట్టి దేశోపకారమునకంతకును స్త్రీలే మూలమని కొందఱని నప్పుడు నాకుఁగలిగెడి

వ్యసనమిట్టిదని నుడువఁజాల మన జ్ఞానాభివృద్ధికిని బాటుపడి మనకనేకమేళ్ళను జేయుచుండిన సత్పురుషులు సేయు సత్కార్యములకు మనము తోడుపడి మన కృతజ్ఞతను దెలుపవలెనేగాని వారుచేయఁదలఁచిన సత్కార్యములను జేయఁజాలకుండుటకుఁ బ్రయత్నించి కృతఘ్నురాంధ్రముకాకూడదుగదా? అయితే స్త్రీలందఱకును దమపురుషులు సేయుకార్యము సత్కార్యమని తెలియకుండుటవలననే వారు తమ భర్తలను నిరుత్సాహపఱచెదరనియు స్త్రీలకందఱకును బాల్యవివాహమువలన నష్టములు చక్కగా బోధపడినచో నీ సంస్కరణ మనదేశమున నతిత్వరితముగా జరుగుననియును నాకత్యధికయాసకలదు. దీనిని నా నెచ్చెలులందఱును దప్పక నెరవేర్తురని నమ్మియున్నదాన. బాల్యవివాహములవలన మనదేశమునందు గలుగుచున్న నష్టములను ముందు వివరించెద.

ఈ వివాహమువలనఁ గలుగుచుండిన గొప్పనష్టము దేశమునందలి ప్రజల దుర్బలత్వమేయని చెప్పవచ్చును. ఈ దుర్బలత్వము, మనదేశ ప్రజలకు స్వాభావికమని కొందఱు చెప్పుటయుగలదు. ఈ మాట సరియైనదికాదని యిదివఱకుఁ గొందరు వైద్యశాస్త్రజ్ఞులు వక్కాణించియేయున్నారు. పిల్లలకుఁ జిన్ననాఁటనే వివాహములుచేసి వారు యుక్తవయస్కులుకానప్పుడే కలిగిన సంతానమునకు నిర్బలములగు బీజములఁ జల్లియందుద్భవించిన యల్పసత్త్వముగల ధాన్యములఁగని యది యాధాన్యమునకు స్వాభావికమని చెప్పునట్టి వ్యవసాయకుని వాక్యముల వంటివని చెప్పవచ్చును. ఇట్లుచెప్పునట్టి వ్యవసాయకు లరుచుగానుందురు. యిట్టి విద్యావిహీనులయినను నేలపదునుచేసి విశేషసత్వముగల బీజములనే చల్లిన మంచిధాన్యము లభించునని యనుభవమువలన దెలిసికొనగలడు. అదే ప్రకారము మనుష్యులలో సహితము అపరిపక్వములగు క్షేత్రబీజములవలననే సత్త్వహీనులగు ప్రజలుద్భవిల్లెదరని మనము సాధారణముగాఁ దెలిసికొనగలము. మనమెల్లప్పుడు కేవలము బలహీనులనేచూచుచుండినందున పూర్వుల జవసత్త్వములను గ్రంథములలోఁ జదివి యద్భుతపడి వానిని నమ్మఁజాలక యవి కవికల్పనలనియు నతిశయోక్తులనియు నుడువుచున్నాము. కాని ప్రస్తుతకాలము బాల్యవివాహములులేని యూరపు మొదలగు ననేక దేశవాసులలోఁగల దేహమనోబలములను బ్రత్యక్షముగా గనులచూచుచునేయున్నాము. వీనినిసహితమును మనము సంభవములనఁ జాలముగదా. వారివలెనే మనుజ జన్మమునెత్తినమనమేల యధికబలహీనతఁ గలిగియుండవలెను. దీనికంతకును జిన్నతనమునందు మనవారుచేయుచున్న వివాహములే కారణములు. బాల్యవివాహములు చేసినను వధూవరులకు యుక్తవయసువచ్చినఁగాని సంతానము కలుగదుగదా? అట్టిసమయమునఁ బుట్టినపిల్లలేల దుర్బలులైయుండవలెనని కొందఱడుగవచ్చును. కాని, బాల్యవివాహములవలననే మనపిల్లలకు యుక్తకాలమునకంటెను

ముందే యౌవనము వచ్చుచున్నదని కొందరు నుడువుచున్నారు. ఈమాట విని మీలోఁ గొందఱు వివాహమునకును యౌవనమునకును సంబంధమేమనియనుకొనుటయును నవ్వుటయుఁగలదుకాని వేగిరింపక విచారించినచో నది సత్యమేనని తెలియకపోదు. వివాహానంతర మాడుపిల్ల యత్తింటికి నప్పుడప్పుడు పోవుచుండుట తటస్థించుచుండును. గాన, నింటియందల్పప్రాయులగు దంపతులు మాటలాడుకొనుటవిని కవి యీ బాలదంపతులకు సయితము తామును వారివలె మాటలాడవలెనను నిచ్చ కలుగుచుండుట సహజము. వారెప్పుడును దామెన్నడీతరులవలె నొకరితోనొకరు ముచ్చటలాడఁగలమాయని చింతింపుచుందురు. ఈ చింతనమువలననే బాలికలతి యల్పప్రాయముననే రజస్వలలగుట తటస్థించుచున్నది. ఇట్టి మనోవాంఛితంబులు గృహమునందుఁగాని గ్రామమునందునఁ గాని జూచినకొలదిని హెచ్చుచుండుఁగాన పల్లెలయందుండు బాలికలకంటెను పట్టణములోనుండు బాలికలకును విభక్త కుటుంబములోని యాడుబిడ్డలకంటె నవిభక్తకుటుంబములోని యాడపిల్లలకును నతిస్వల్పప్రాయముననే రజోదర్శనమున కారంభమగుచున్నటుల మనమిదివఱకు వినుచున్నాము.

ఇట్లనుటవలన పట్టణములనెల్ల పల్లెలగను అవిభక్తకుటుంబాలనెల్ల విభక్తకుటుంబములుగను మార్చిన బాగుండునని నాయభిప్రాయము కాదు. మనదేశమత్యుష్ణదేశమగుటవలన స్త్రీపురుషులకల్పప్రాయముననే యవ్వనముసంప్రాప్తించును గాన వారికి వివాహములు త్వరగా చేయకుండినవారు చెడునడువడులలోనికిఁ దిరుగుదురని కొందరందఱుగాన అది దేశమునందలి గుణముకాదనియు సమాజములోనియుఁ గొన్నిగ్రామాదులలోనియు నాచారములవలననే వచ్చుచున్నదనియుఁ జెప్పితిని గాన మనము మన సమాజములో గొన్ని మార్పులు కలుగఁ జేయవలెను. మనదేశమునందలి బాల్యవివాహములవలన స్త్రీలధికదుర్బలులుగను వ్యాధిగ్రస్తులుగను నుండుచున్నారు. ఇది యిచ్చటనున్న వారికనేకులకు ననుభవైకవేద్యముగానేయున్నది. పండ్రెండుసంవత్సరముల బాలికలు వ్యక్తురాండ్రై సంతానవతులగుటయేకాని యాసంతానమువలన వారికిగాని యాసంతానమునకుఁగాని లాభముండదు. వారి సంతతి జీవించుటయే దుర్లభము. జీవించినను సదా దుర్బలమైనదిగానుండును. ఇట్టి దుర్బల సంతానమునకుఁ గలిగినసంతతి వారికంటెను మిక్కిలి శక్తిహీనమగుచున్నది. ప్రస్తుతమెవ్వరినిఁజూచినను దుర్బలులుగను రోగులగను గానుపించుచుండుట మనలోని గొప్పదురాచారమనఁబడు బాల్యవివాహమైయున్నది. మనతల్లులశక్తి మనకు లేకుండుటయు మనబలము మనసంతతివారికి లేకుండుటయు బాలసంభోగములవలని ఫలంబేకాన దానినిమాన్పుటకు మనము ముందుగాఁ సర్వవిధముల

బాటుపడవలెను. దీనిని మాన్పుటవలన నిప్పుడేమనమనేక జవసంపన్నులగు ప్రజలఁ జూడలేకుండినను కాలాంతరమునందిప్పటి స్థితినిబట్టి చూడగా నిప్పుయోజనులై యుందురనుకొనిన ప్రజలు కొందఱు సత్త్వసంపన్నులయి దేశమునకనేక మేళ్ళశతములను గావింపసమర్థులైయుండును. ముందెన్నడో పుట్టువారు బలయుతులై మనదేశహితము సేయఁగలరనినమ్మి మనపూర్వాచారములగు బాల్యవివాహములను మాననేలయని కొందఱికిఁదోచవచ్చును. కాని మనకు సద్యఃఫలములభింపకుండినను మనముందువారికాఫలము లభించుననిన యాస వలన మనమనేక కార్యములను జేయుచున్నారము. అదేప్రకారము దీనినిసహితమాచరించి కొంత సంతసింపవచ్చును. మనము విచారించి చూచినచో నీయాచారము మనదేశమున పూర్వములేక మధ్య కల్పింపఁబడినదని తెలిసికొనఁజాలుదుము. అయితే యిది యీ సమయమున ప్రారంభమైనదని నిశ్చయముగాఁ జెప్పుటకుఁ దగిన కారణములు లేకుండినను బాల్యవివాహములు మనదేశమునకుఁ దురకప్రభుత్వమురాకమునుకంగురించి యాప్రభుత్వమునందుఁ జక్కగానాటుకొని వేళ్ళు బారినదని మాత్రము తెలియుచున్నది. అంతకు బూర్వమనఁగా వేదికకాలమునందుగాని పురాణకాలమునందుగాని ఈ యాచారము కానరాకున్నది. యుక్తవయసుక్కలైన వారి వివాహములనే మనము సాధారణముగాఁ బురాణములలోఁ జదువుచుందుము గాన నిదిమనబూర్వాచారమును సహితము కాదు.

ఇంక మనలోఁ గొందఱు బాల్యవివాహములు శాస్త్రానుకూలముల నియును మనకెన్ని కష్టములు కలిగినను ధర్మశాస్త్రవిరుద్ధములగు వానినాచరింప

అయినను గొందఱికి గావలసియుండిన శాస్త్రానుకూలము సహితము తెలుపవచ్చును. ధర్మశాస్త్రము చాలవఱకు సమాజహితములగు ధర్మములనే చెప్పునుగాని తద్విరుద్ధముగా నుడువదు. అయితే వానిలోని సంగతులు కొన్ని మనకిప్పుడననుకూలములయి యుండుటయును గలదు. అట్టివి యాకాలదేశములకనుకూలమని వారు చెప్పియుందురు. మనకాలమునకు మనదేశమునకును నవి సరిపడవు కాన నట్టిధర్మములను మనము దేశకాలానుగుణములుగా మార్చుకొనవచ్చును. చలిదేశమునందుండు వారియాహారపదార్థములఁ దినుటవలన నుష్ణప్రదేశవాసులకు నష్టమే కలుగును కాని వానిలోఁగొన్ని యందఱికును భుజియింపయోగ్యములయి యుండునటువలన వానినిసకలదేశీయులును ననుభవింపవచ్చును. అదే ప్రకారము ధర్మశాస్త్రజ్ఞులును గొన్ని సర్వగ్రామములయందును గ్రాహ్యములని చెప్పవచ్చును.

మనదేశమునందు ప్రామాణికములని చెప్పఁబడు వానిలో నెల్లవేదములు ముఖ్యములు. వానియనంతరము స్మృతులని చెప్పుచున్నారు. శ్రుతి స్మృతులలో విరుద్ధము సంభవించిన శ్రుతినే నమ్మవలెనని మనవారిదివఱకేర్పాటుచేసియే యున్నారు. గాన,

మనము, మొట్టమొదలు వివాహములనుగూర్చి వేదమునందేమియున్నదో విచారించి చూతము. వేదమునందేకార్యముగాని ఇట్లు చేయుఁడని యుండదు. ఈ ప్రకారము జరుగుననికాని జరిగెననికాని యుండును. అట్టివాక్యములనే మనవారు వేదాజ్ఞలని గ్రహించుట కలదు. అన్ని వేదములలో మొదటిదగు ఋ॥ అరా అ3 శ్లో॥ సోమో

అర్థము. సోమునకు వివాహేచ్ఛ కలిగెను. అశ్వినీకుమారులును వరులయ్యెయుండిరి. అప్పుడు యౌవ్వనయగు ..... సోమునకామె యింకను ..... తెలిసికొని సోమునికిచ్చెదనని యొప్పుకొనెను.

ఇందుపతినిగోరుచున్నట్టి సూర్యయనియుండినందునఁ గొందఱు మనలో నెనిమిదిసంవత్సరములబాలికలకు గూడ పతికావలయునని కోరికయుండునని యనుటకలదు. అతిబాల్యవివాహ ప్రపూరితమగు మానమాజమునందుండి పిల్లకుమాటలువచ్చిన వెంటనే అమ్మా! నీవు పెండ్లి చేసుకొనెదవా లేదాయని దానిచే పెండ్లి చేసికుందువనియు నీకెటువంటిమగడుకావలెననియడిగి చక్కనివాడని యాముద్దుబాలికచే వ్రేళ్ళుతిప్పించుచుండు తలిదండ్రులకీ శంకకలుగుటసహజము. ఇందువలననే "పతింకామాయమాన" అనఁగా పర్యాప్తమౌనయేయనఁగా సంపూర్ణమైన యౌవనము గలదని భాష్యకర్తయగు మాధవాచార్యులవారు వ్రాసియేయున్నారు. గాన, యౌవనముగల స్త్రీయనియే తేలుచున్నది. ఈ వేదవాక్యమువలన మనకు బాల్యవివాహములు వేదానుకూలములైనను కాకున్నను ప్రౌఢవివాహము వేదానుకూలమేయని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఇదేగాక యీ వాక్యములు సిద్ధాంతమునే స్థిరపరచునట్టి వాక్యములింకను గొన్ని వేదమునందు కలవు. వానిలోఁ గొన్నిటిని మాత్రమే తెలిపెదను.

తై సంహికాం ౮ ప్ర, ౩ అ ౧౧

వధజజానవగజ్జనిత్రీ.

అనఁగా క్రొత్తగా వివాహమైన వధువు ఏప్రకారము ఒకరివెంట నొకరినిగా బ్రజలనుత్పన్నముజేయునో అప్రకారమే యీసృష్టి సూర్యునితో గలసి యుత్పన్నము చేయుచున్నది.

ఈ వాక్యమునందలి క్రొత్తగావివాహమైన వధువను పదమును జూడగా మిక్కిలి చక్కగా నాకాలమునందలి వివాహములపద్ధతి తెలియుచున్నది. వివాహానంతరమనేక సంవత్సరములకుఁ బిల్ల రజస్వలయై సంతానమునుత్పన్నము చేయవలెనని బాల్యవివాహపద్ధతుల ననుసరించినచోఁ గ్రొత్త వివాహితయగు కాంతప్రజలనేప్రకారము కనఁజాలును? వేదకాలమునందు బాల్యవివాహములుండినచోఁ గ్రొత్త వివాహిత ప్రజలను గనునటులనను నుపమానమే కలుగకుండును.

ఋగ్వేదము. అ. ౮. అ. ౨. వ. ౧౧.

కమద్యువంవిమదాయోహధుర్యువం

కామోద్దీపనముచేయునట్టి వేనరాజుకూఁతును విమదఋషికి మీరిచ్చితిరి. ఈవాక్యమువలనను బిల్లలకుఁ జిన్నతనమునందుఁ బిడ్డలకు వివాహముచేయవలెనని సంగతి కానరాదు.

పురుషసంభోగేచ్ఛలేనిపిల్లకు సోముఁడుభర్తయగుననియు ఆచిన్నదానికిఁగొంచెము సంభోగేచ్ఛ కలిగిన వెంటనే సోముఁడాచిన్నదానిని విశ్వావసుఅనుగంధర్వునకిచ్చుననియు నాగంధర్వుఁడు వివాహకాలమునందాయువతిని అగ్నికి నొసంగుననియును నాహుతాశనుండావధువును మనుష్యునకు నిచ్చుచున్నాఁడని వేదవాక్యముకలదు. ఈ వేదమంత్రము వివాహకాలమునందుచ్చరింపఁబడును. ఇదియునుగాక.

ఋ. మం. ౧౦. సూ. ౮౫.

"ఉదీష్వాతోవిశ్వావసోనమ సోళామహేత్వాఅన్యామిచ్ఛ ప్రపవ్యాంస జాయాం పత్యావృజవా" ప్రక్కనుండి ఓ విశ్వావసు గంధర్వాలెమ్ము నిన్ను నమస్కార పురస్సరముగా మేము స్తోత్రము చేసెదము. నీవు శ్రోణీభాగము పెద్దగానయిన మఱియొక చిన్నదాని నిచ్ఛయింపుము. నిన్ను (పత్నిని) పతితో గలియనిమ్ము.

ఈఋచయందు శ్రోణిభాగమధికమైనయనగా సంభోగేచ్ఛస్వల్పముగా గలిగిన స్త్రీగంధర్వునకు భోగ్యమని తెలియుచున్నది. మొదట కన్యకు సోమగంధర్వాగ్నులు భర్తలైనఁ గాని మనుష్యునకు భార్యాకాజాలదనియుండఁగా గంధర్వభోగ్యకాని చిన్నదానికేమనవారు మనుష్యునితో వివాహము కావింపుచున్నారు. ఇదియునునొకధర్మవిరుద్ధకర్మమని నందు కన్యయుక్తవయస్కయైయుండవలెననియే యభిప్రాయము కలవారైయుండఁగా మనలోనన్ని శాఖలవారును బాల్యవివాహములే ముఖ్యములనినమ్మి చేయుచుండుట వింతగానున్నది.

ఇఁక స్మృతిపురాణములయందచ్చటచ్చటచూడగా బాలికలకు పండ్రెండు సంవత్సరములయనంతరము వివాహకాలమనియుఁ బురుషుల కిరువదియైదు సంవత్సరముల యనంతరము పెండ్లికాలమనియుఁ దెలియుచున్నది. మనుస్మృతియందు.

శ్లో॥ "త్రీణివర్షాణ్యుదీక్షేతకుమార్యంతుమతీసతీఊర్ధ్వంతుకాలాలేదే తస్మాద్విందత సదృశంపతిమ్" ఋతుప్రాప్తియైన పిదప మూఁడు సంవత్సరములవఱకు తండ్రిబిడ్డకు వివాహముచేయును. కూఁతురా మూఁడుసంవత్సరములుచూచి తండ్రివివాహము సేయకుండిన నామెతనకు నిష్టమగు భర్తను వరించి వివాహము చేసికొన వచ్చును. అని యాశ్లోకతాత్పర్యముగాన మనుస్మృతికర్తయు బ్రౌఢవివాహ ముత్తమపక్షమైనదనియే చెప్పినటుల దెలియుచున్నది.

పైనజెప్పినప్రకారము స్త్రీపురుషులు యుక్తవయస్కులై వివాహమాడవలెనని యింకను గొన్ని స్మృతులలోనున్నదిగాని వానిననిన్నిటినిందు విస్తరించుటకంత యావశ్యకము

లేదని తలఁచెదను. మనము బాల్యవివాహములుమాని ప్రౌఢవివాహములను ప్రారంభించుటకింతయే చాలియుండునని తలఁచెదను. ఈ ప్రౌఢవివాహములవలనఁ గలుగులాభములనేకములు గలుగును. అవియును వివరింపక బాల్యవివాహములవలన నష్టములడంగునని చెప్పినఁజాలి యుండును. బాల్యవివాహములడుగంటిన పిదప మనదేశమునందధికదుఃఖము ననుభవింపుచు దయనీయలైయున్న యనేకవేల బాలవితంతువులు లేకయుందురు. ఇది సామాన్యమైన లాభము కాదు. గాన, వివేకురాంద్రగు నాచెలులారా! మీరిఁకముందెన్నిపాట్లు వచ్చినను వెనుకఁదీయక బాల్యవివాహములనుమాన్పను ప్రౌఢవివాహముల నెలకొల్పను మీ భర్తలను బురికొల్పుచు మీరును సహాయులయి యుండెదరని నాకు గట్టిగా నమ్మకము కలదు. మీరిట్లు చేసిన యెడల మనదేశమునందు గల ప్రజల దుర్బలత్వముతగ్గి వారు సత్కార్యములఁ గావింప సమర్థులయ్యెదరు. దేశమునకంతకును నమితమగు నుపకారము చేసిన కీర్తికిఁ బాత్రురాంద్రయ్యెదరనుటకు సందియములేదు. గానునో యక్కలారా! మీకు మీకూఁ తురులకును గొమారులకును జిన్నతనముననే వివాహములను జేయుఁడని భర్తలను బీడించుటవలన మనబిడ్డలకే నష్టము కలుగునని తెలిసికొనుఁడు. నామాటలవలన మీలోఁగొందఱయినను ధర్మశాస్త్రవిరుద్ధమగు బాల్యవివాహముచేయుట యుడిగినచో నట్టివారియెడల నేను మిక్కిలి కృతజ్ఞురాలనయ్యెదను. నామతికిఁదోచినరీతిని నుడివిని యీ వాక్యములలోఁ దప్పులుగలవేని వానిని బరిహరించి యొప్పులనేగైకొనుడని యింతటితో నీప్రసంగము ముగించెదను.

(సంవత్సరం...)

బందరు, బృందావన సమాజ స్థాపన సందర్భంగా ఇచ్చిన ఉపన్యాసం

సద్విద్యాసంపన్నలారా!!

నేఁడు మీబోటి విద్యావతుల జూడగలభాగ్యము నాకబ్బెనుగాన నేనత్యధికానందమగ్ననైతిని ఆహా! మీవంటివారినిగాని సంభాషించుభాగ్యము కలుగుటకు నేనేమిపుణ్యముచేసితినో నేనెఱుఁగఁజాలకున్నాను. విద్యామృతమునధికముగ ద్రావియసంఖ్యాకములగు సద్గుణములచే నలంకరింపఁబడి లోకమునందలి సతులనందఱొక్క తల్లిపిల్లలుగా భావించి వారికనేకవిధసాయములఁజేయుచుండిన మనదేశమునందలి విద్వాంసులగు పురుషులనేకులు తమకన్నియంశములు విశదముగాఁ దెలిసియుండియు సమాజములనేర్పఱచి యందుమూలముననేకుల యభిప్రాయములఁ దెలిసికొనుచున్నారు. దానిఁగని స్త్రీలును సమాజములనేర్పఱచికొని యందుమూలమున గొన్నిలాభములబొందఁదలచుచున్నారు. విద్యవలనగలుగు లాభములు మీకు స్వానుభవములేగాన వానిని నేను జెప్పుట యనావశ్యకము. విద్యాలాభమును బూర్తిగానెఱిగినమీకు నన్నికర్తవ్యములును జక్కగా దెలియుననుటకు సందియములేదు. అయినను విశేషవిద్యావతినిగాని, నేనుదమవంటివిద్యావతులకేదేని క్రొత్తసంగతి దెలుపుదుననుట యబద్ధము. అదేలనన మీకు దెలియని విషయములుఁగలవా? దీనినెఱింగియుండియు నేడునేనుమీకొక్క విన్నపము విన్నవింపదలచితి. సుజ్ఞులగువారలు బాలుర మనవిని సహితము విని దానిలోఁగల సదుద్దేశ్యముల గ్రహించెదరు. మనమందఱు మిట్లొకచోటఁగూడుకొని నప్పుడొకరి మనోగతముల నొకరికిఁ దెలుపుకొనుట మన కర్తవ్యములలోనివేయనితలచినేనీ విన్నపము విన్నవింపఁదలచితిని. ప్రస్తుతము మనదేశమునందంతటను స్త్రీవిద్యాప్రోత్సాహకరములగు కృత్యములనేకములు జరుగుచున్నవి. కొందఱు పురుషులు తమవాక్పటుత్వమువలన సభలలోనందఱికిని స్త్రీవిద్య యందభిలాషను హెచ్చించుచున్నారు. మఱికొందఱుపకారవరులు ఇంటియందు

మూఢురాండ్రగానున్న తమ తల్లి, యక్క, భార్య, కూఁతురు మొదలగువారికి విద్యదామింటనేర్పియు బాఠశాలలకు బంపక నేర్పించియు జ్ఞానదానమొసంగి తమ స్త్రీవిద్యాభిమానమును మాటలతోఁడనే యడచియుంచక స్వకృత్యములవల్ల సహితము వెల్లడిచేయుచున్నారు. ఇంకను కొందఱు ధర్మాత్ములు ధనమునొకలెక్కగా గొనక వెచ్చించి బాలికాపాఠశాలలను స్థాపించి యందుమూలముననేక బాలికలకు విద్యనేర్పిన శాశ్వతకీర్తినిఁ బొందుచున్నారు. ఇట్లిందఱు పురుషులిన్నివిధముల ప్రయత్నములు సేయుచున్నను నిప్పటికింకను దగినంతలాభము కలుగుచుండలేదు. దీనికిఁగారణము విచారించగా స్త్రీలయుపేక్షయేయని తేలుచున్నది. త్రాటిచెట్టునెక్కువాని నితరులెంతవఱకు నెక్కింపఁగలరన్నసామెతవలెనే స్వవిషయమునను పేక్షగానున్న స్త్రీలను బురుషులెన్నియుపాయములచేతను నుచ్చదశకుఁ దేనేరకవిఫలమనోరథులగుచున్నారు. మనకనుచితములైన ఉపకారములను జేయదలంపుగల పురుషులనిట్లు విఫలమనోరథులఁ జేయుట మనకెన్నటికిని దగియుండదు. సత్పురుషులుసేయు ప్రయత్నములకు మనముసహితము కొంత సాయపడి వారు సేయఁదలచిన సత్కార్యములఁ బూర్ణముగానెంచి స్వార్థపరార్థముల రెంటిని సంపాదించు నుపాయము వెదకి కనిపెట్టి యట్లు వర్తించుట మన ముఖ్య కర్తవ్యములోనిదేయని మొట్టమొదట మనమెఱుఁగవలెను. పురుషులిందఱిన్ని విధముల బాటుపడుచుండినను దేశమునందలి స్త్రీవిద్యయభివృద్ధి పొందకుండుటకు మూలము స్త్రీలయుపేక్షయేయని మొదటనే చెప్పియుంటిని. దాన్నింక విస్తరించి తెలిపెదను. సాధారణముగా నీకాలమునందు పట్టణములలోనుండి బాలికాపాఠశాలలకుఁబోని బాలికలసంఖ్య యత్యల్పమైనదని యందఱికును దెలిసిన విషయమే. అయితే పాఠశాలకేగు బాలికలు పెద్దగా అయిన పిదప తాము చిన్నతనమున నేర్చిన విద్యను బొత్తిగా మఱిచిపోయి దానివలని లాభముల నెఱుఁగలేక తమబిడ్డలకే విద్యనేర్పవలదని భర్తలతో తగువులాడుచుందురు. ఇట్లనుటకువారికి జిన్నతనమున నేర్పిన విద్యవలనవారికే లాభమును కలుగకుండుటయే కారణము. పాపము! ఇందులో వారి దోషమేమున్నది. వారు బాల్యమున నల్లరిసేసెదరని తలఁచి తలిదండ్రులు పాఠశాలకు బంపినందున విశేషవిద్య నార్జింపనేరక అల్లరిసేయుకాలము కొంతతగ్గినవెంటనే పాఠశాలను విడువవలసినవారలగుచున్నారు. గాన నాస్వల్పవిద్యవలన వారికేలాభమును గానరాకనే తమపిల్లలనటుల శ్రమపెట్టుటకు సమ్మతింపరు. బాలికాపాఠశాలలోఁ దరుచుగాఁ బురుషులే యుపాధ్యాయులుగా నుండుటవలన మనవారలు వివాహానంతరము బాలికలను బాఠశాలల కంపుటకు సమ్మతింపరు. ఎంతటి స్త్రీవిద్యాభిమానులైనను బురుషులుపాధ్యాయులుగానుండినబడికి దమపిల్లలను బండ్రెండు సంవత్సరములు దాటినవెనుక పంపఁదలపఁరు.

మనలోని వివాహములన్ననో ఆఁడు పిల్లలకేడెనిమిది సంవత్సరముల ప్రాయమున తల్లిదండ్రుల యిష్టానుసారమే జరుగుచుండును. ఈలోపునను అనంతరమునందును గొందఱిపిల్లలకు వివాహములు జరుగుచుండుట కలదు. అయితే ఇట్టి వివాహములు తరుచుగా జరుగుచుండుట లేదు. ఆఁడుపిల్లలను సాధారణముగా నారుసంవత్సరము వచ్చినగాని, బడికిఁ బంపరు. ఆ బాలిక యొకటి రెండు పుస్తకములు చదివినతోడనే వివాహమై బడి విడువవలసినదగును. ఈయతిబాల్యవివాహములవలన గలుగుచుండిన యసంఖ్యాకములగు నష్టములలో బాలికలకు నదివఱకు నేర్చుచుండిన విద్యకు భంగము కలుగుచుండుట యొకటియని చెప్పవచ్చును. ఈ నష్టము వలననే మనదేశమున కనేకనష్టములు కలుగుచున్నవని యిదివఱకుఁ గొందరు చెప్పియున్నారు. అయితే పాఠశాలవిడిచినవెనుక విద్యాభివృద్ధి చేసికొనగూడదాయని కొందఱనుటయుఁగలదుకాని, స్వల్పకాలములోనేర్చిన యల్పవిద్యను బడివిడిచినపిదప నభివృద్ధి గావించుకొనను నిచ్ఛ యాచిన్నదానికిఁ గలుగుటకాచిన్నది యల్పవయస్కగానుండునుగాన సంభవింపదు, ఆమెతల్లి విద్యనేర్చినదికానందున బిడ్డకింటఁజదువుచెప్పుటకు సమర్థురాలుకాదు. ఆమె తాను సమర్థురాలైనను దనకూఁతునకితరులచేఁ జదువుచెప్పించుటకైనను సమ్మతింపదు. తండ్రి గృహస్థాశ్రమమునకు నధికావశ్యకమగు ధనము సంపాదించునిమిత్తముద్యోగముచేయు చుండుటవలన దీరికలేక స్త్రీవిద్యాభిలాషియయ్యును దనబిడ్డకు విద్యనేర్పనేరదు. గాన, బాలికలు పాఠశాలయందు నేర్చినవిద్యను అత్తింటికి నరుగువఱకుఁ బూర్ణముగా మఱిచి యక్షరజ్ఞానమే లేనివారగుచున్నారు. బడియందు నాలుగైదుసంవత్సరములు చదివిన వెనుక వివాహమైనపిల్ల లక్షరజ్ఞానహీనలుకాకుండినను గద్య, పద్య, గ్రంథములను జదువుట మఱిచి చదువుకొనియు విద్యావిహీనలగుచున్నారు. బడియందు నాలుగైదుతరగతులలోఁ గృతార్థతనుగావించితిమని చెప్పువారలు కొందఱు తాముచదువు సులభశైలిగల వచనప్రబంధములకే యర్థము తెలిసికొనలేకుండుటనుగనినప్పుడు నాకధికాశ్చర్యముగలిగెను. ఇట్టివారిని మీరును జూచియేయుందురు. గాని, వారలు పాఠశాలవిడిచిన పిదప విద్యను గూర్చి యింటనెవ్వరికిని శ్రద్ధలేనందునఁ దాము నాటపాటలలోఁ గాలముగడపి పుస్తకములను మరలఁజదువలేదని చెప్పగావిని వారికర్థజ్ఞానములేకుండుట యొకవింతకాదని నాకుఁదెలిసెను. మనదేశమునందలి ప్రస్తుతస్థితినిబట్టి చూడగా కేవలము బాలికాపాఠశాలలో జదివిన స్త్రీలు విద్యావతులగుట మిక్కిలి కష్టముగానున్నది. ఏ విద్యయైనను గొంచెము నేర్చియుండినచో నదిజ్ఞాపకముండదు. సాధారణముగా మనమేదేని పాటనేర్చినపిదప దానిని మఱలమఱలఁ బాడకుండిన దానిని మనము బొత్తిగా మఱిచిపోదుము. ఇది మనదేశమునందలి స్త్రీలకందఱకును

ననుభవైకవేద్యమే. ఇంతటి శుభములును మనోరంజకములునునగు పాటలే పునఃపఠనీయములు కానందున జ్ఞాపకముండకుండగా కఠినములును, గహనములునునగు గణితవ్యాకరణాది శాస్త్రములు వాడుకలోలేకుండిన నెట్లు మఱువకుండనుండనగు. ఈ విషయములలో గొప్ప గొప్ప పరీక్షలిచ్చి మెప్పొందినపురుషులే యటుపిమ్మట వానియుపయోగములేకుండినచోఁ గొంతమఱుతురనగా నిఁకయల్పవయసునందీ విషయములత్యల్పములుగా నేర్చిన బాలికలు వానిని బొత్తిగా మరచిపోవుట యొకవింతకాదు. స్త్రీవిద్యాభివృద్ధి కిట్టియాటంకము లనేకములున్నను వెనుకఁదీయక విశేషవ్యయ ప్రయాసములకు నోర్చి కొందఱు పురుషులు తమ స్త్రీలను విద్యావతులను జేయుచుండుటవలననే మనదేశమునందిపుడు కొందఱువిద్యావతులగు యువతులు కానిపించుచున్నారు. ఇట్లు మనలోఁ గొందఱినైనను జ్ఞానవతుల గావించినందునకై మనమాపురుషాగ్రగణ్యులయెడ మిక్కిలి కృతజ్ఞతఁగలిగియుండవలెను.

ఇంతవఱకును మనదేశమునందలి పాఠశాలలో బాలికలు విశేషవిద్యనార్జింపలేకుండుటయునార్జింపఁగలిగిన అల్పవిద్యను సహితము బెనుచుకొనుటకుఁ దమరల్పవయస్కులగుటవలనను, విద్యాలాభములనెఱుగని తల్లులయుపేక్షవలనను సామర్థ్యముచాలనివారగుటను జెప్పితిని. ఇఁక ముందువిద్యనేర్చిన స్త్రీలీబాలికలను, వారి తల్లులను విద్యావతులఁ గావించుటకునుపాయము విచారింతము. విద్యావతులగు వనితలు దానిలాభమును దామెఱిఁగినవారయినచోనట్టి లాభము తమ సోదరీమణులకును గలుగవలెనని వారిచ్ఛయించుటకలదు. కానివారుతమరు స్త్రీలనందఱను విద్యావతులనుగావింప సమర్థులమనుకొని దానికిఁదగు ప్రయత్నములేవియుఁజేయక మిన్నకుండిరి. వారిట్లు నిరుత్సాహముదాల్పక నుత్సాహయుక్తులై తమజాతివారికి జ్ఞానదీపకాంతిని జూప నిశ్చయించినచో వారాప్రయత్నమున దప్పకసఫలమనోరథులగుదురని నాకు నిశ్చయముగాఁ దోచుచున్నది. నేనిట్లనుటవలన విదుషీమణులగు వారలు మేము దేశమునందలి పాఠశాలలన్నిటిలోనుపాధ్యాయినులను నియమింపగాగాని మనదేశమునంది జనులకందఱకును బోధించువారు బాలికలను వివాహానంతరమున సహితము పాఠశాలలకంపి విద్యనేర్పునటులగాగాని, బాలికల విద్యాభ్యాసము పూర్తియగువఱకుఁ దల్లిదండ్రులువారికి వివాహములు చేయకుండునటులఁగాని సేయగలమా? ఇట్లు చేయకుండిన మనదేశమునందలి స్త్రీవిద్యయెట్లు వృద్ధియగునని నన్నడగవచ్చును. వారనునటుల సంస్కరణములన్నియుఁ జేయుటకిప్పుడు స్త్రీలు సామర్థ్యహీనలయ్యేయున్నారు. ఏ దేశమయినను హీనస్థితియందుండు సమయమున దానినొక్కసారిగా శ్రేష్ఠదశకు దెచ్చుటయే వారికిని సాధ్యముకాదు. ఇట్టికార్యములు క్రమక్రమముగా వృద్ధిపొందినచో

లోకమునకుఁ గొంతయధికలాభము కలుగునని కొందఱు పెద్దలనియెదరు. ఒక వ్యక్తికిఁ గాని గ్రామమునకుఁగాని దేశమునకుఁగాని మేలుసేయఁదలచువారులు మొట్టమొదట నామేలే రూపమున నెటులజేయవలసినది చక్కగాఁనాలోచించుకొనవలెను. దీర్ఘాలోచనచేసి చేయఁబూనిన కార్యమునందుఁ దప్పక వాంఛితంబులొనగూడునని మనము కొందఱి జీవితముల జదివి కనుగొనుచున్నారము. దేనిచేయఁదలచినను దీర్ఘాలోచనకుఁదోడు దృఢనిశ్చయము సహితముతోడుపడవలయును. దృఢనిశ్చయము కలవారలు ఎన్నికష్టములకైననోర్చి తాముతలచిన సత్కార్యమును బూర్తిగావింతురు. కాన సకలసంస్కరణములు క్రమక్రమముగానే వృద్ధిఁబొందుటకుఁ దగినయుపాయమునే విద్యావతులగు మీబోటివారలు యోచింపవలెను. కొందఱు విద్యావతులు తాము మాత్రమే విద్యనభ్యసించి సత్ప్రవర్తనపరులైయున్నారు. వారలు తమ విద్యను సత్ప్రవర్తనమును దమతోడివారికి సహితము కలిగింపఁదలచినచో వారికదియొక యసాధ్యములోనిదికాదు. సంస్కరణలన్నియుజేయుటకు స్త్రీలసమర్థులని యనుటకుఁ గారణమువారికిఁగల యవిద్యయేయని చెప్పవచ్చును. స్త్రీలందఱును విద్యావతులైనపిదప నిపుడు పురుషులు చేయతలచుచున్న సంస్కరణములన్నియు నప్రయత్నముగానే వారివలన గాగలవని నేను నమ్మెదను గాన సంస్కరణలన్నియునైన పిమ్మట స్త్రీవిద్య తనంతనే వృద్ధియగునని తలఁపక మొట్టమొదట స్త్రీవిద్యనేయధికముచేయుటకై మీరందఱు పాటుపడుట అత్యుత్తమయినదని వేరుగఁజెప్పనక్కరలేదు. ఒకానొకమూఢస్త్రీకి బాల్యవివాహములవలని నష్టములనేకములు దెలిపియు నామెకూఁతునకు జేయునతి బాల్యవివాహమును మనముమాన్చుటదుస్తరము ఆమెయే విద్యావతియైనచో మనము చెప్పనక్కరలేకయే యానష్టములను దెలిసికొని తనబిడ్డ కుహితకరమగు బాల్యవివాహముచేయుట మానును. ఒకానొకసమయమునందామె పొరపడినను నితరులు తెలుపుటకనుకూలముగానుండును. స్త్రీస్వాతంత్ర్యము మొదలయిన యితరములగు ననేకసంస్కారములనుగూర్చియు విద్యావిహీనల యభిప్రాయములలోను విద్యావతులయభీష్టములలోను భేదముండుచుండును. విద్యాహీనయగు సతినిగలిగియుండు విద్వాంసుడే సత్కార్యమును సాధారణముగాఁ జేయనేరడు. గాన మొదలు స్త్రీవిద్యాభివృద్ధి సేయ గోరవలెను. విద్యాభివృద్ధికిఁదగిన యుపాయమువిచారింపగా విదుషీ స్త్రీలందఱును గలిసి కులస్త్రీలకొఱకు నొకపాఠశాలను స్థాపించుటయేయని నామనంబునకుఁ దోచెడివి. ఇట్లనుటవిని నా చెలులు కొందఱు అబ్బో యింతటికార్యము మనచేనెటుల జరుగగలదు ఇట్టి కార్యములఁజేయుటకుఁ బురుషులేజంకెదరని యనెదరేమోకాని యే కార్యముసేయుటకైనను గొందఱొకజట్టుగా గూడిననది సులభసాధ్యమగునని మీకుముందు అనుభవమువలననే తెలియును. స్త్రీలందఱు స్వేచ్ఛగా విద్యనార్జింపగల అమెరికాదేశమునందలి స్త్రీలు జట్టులుగానుండి తమదేశమునందలి యనేక దురాచారములను

రూపుమాపి సదాచారములను నెలకొల్పియున్నారు. వారందఱును గలిసికొని తమభర్తల నాశ్రయించి శరీరద్రవ్యముల నొందింపుచున్న సురాపానమగు బెనుభూతమును జెరవఁ దలఁచి యా ప్రయత్నమున గొంత సఫలమనోరథులైనటుల మనము గ్రంథములలోఁ జదివెదము. వారు గుంపుగాఁగూడి పురుషులకెంతయుఁ బ్రాణసమానముగానుండిన సురాదేవినే దేశమునుండి వెడలగొట్టఁగలిగినపుడు మనము కొందఱము జతగానేర్పడిన పురుషులయికష్టమైన అవిద్యాభూతమును బారదోలయత్నించుట కేమికష్టము? ఇట్లుచేయుటకు ధనవ్యయమక్కరలేదు.

సాధారణముగానాఁడువారికి పగలురెండుగంటల నుండియు సాయంత్రము నాలుగైదుగంటలవఱకుఁ దీరికయుండునుగాన నా పాఠశాలనాసమయమునందె స్థాపించుట యుక్తము. విద్యావంతులగు స్త్రీలు కొందఱుకలసి యొంతులప్రకారముపాధ్యాయినిత్వము సేయుటకు సమ్మతించి తమనియమిత దినములలో నియమిత సమయమున పాఠశాలకువచ్చిన విద్యార్థినులకు విద్య నేర్పుచుండినచో నీభారమంతయు నొక్కరేవహింపనక్కరలేక శ్రమతోఁడనే పరోపకారము చేసిన కీర్తి సహితమందఱు సమముగాఁ బంచుకొనెదరు. పాఠశాల నియమింపఁబడు సమయము స్త్రీలకందఱకునుదీరికకాలమైనందునను నుపాధ్యాయినులు విద్యావతులగు కులసతులగుటవలనను నిట్టిబడికివచ్చుటకు బాలికలుగాని స్త్రీలుగాని సంశయింపరు. వారినిబంపుటకువారి సంరక్షకులును శంకింపరు. తీరికగల సమయమున స్త్రీలు సాధారణముగానొకచోట కూడినటువలె పాఠశాలలో గూడి కాలము వ్యర్థపుచ్చక జ్ఞానసంపాదనమునను జ్ఞానదానమునను గరిపెదరు. ఈ పాఠశాల స్థాపించుటకు స్త్రీలందఱొక జట్టుగాఁగూడి తమలోవొకరియింటదానినిస్థాపించి యచటికేయందఱునుపోయి నేర్పునట్టును మనలోనొకరికొకయిబ్బంది కలిగినప్పుడు వారిపనినిగడమ వారందఱు కలిసి నిర్వహించునట్టును దమలోఁదాము నియమించుకొని తప్పక పనిచేయుచుండిన చేసినట్టి స్త్రీలు స్త్రీవిద్యనభివృద్ధిగావింపఁ గలిగితమకాలమును జన్మమును సార్థకములగునటులంజేసెదరు. ఇట్లు చేయబూనిన కార్యము సాగుచుండిన పాఠశాలకనేక సాయములు కలిగి యభివృద్ధి పొందుటయొక వింతకాదు. ఇట్లు చేయబూనుట కిప్పుడు విద్యావతుల కొక్కసదిచ్ఛ తప్ప మరేమియునక్కరలేదు. ప్రప్రథమమునందిట్టి పాఠశాలను నిర్మించి దానివలనంగలుగు విశేషలాభములను జనులకుఁగనుపఱచినచో వారివలనఁ గొంత ధనసాయము కలుగవచ్చును. ఇదే ప్రకారము విద్యావతులగు సుందరులుగల ప్రతిగ్రామమునందును బాఠశాలలు స్థాపింపఁబడినచో దేశమంతటను నతియల్పకాలములోనే స్త్రీవిద్య ప్రబలును. ఇందుకు ముందుగానొకపట్టణమునందలి స్త్రీలు మార్గదర్శినులై దీనినిదమరనుష్టించి కడమవారికి దీని లాభములఁ గనుపఱువవలెను.

ఇట్టి పాఠశాలలో నేర్పు వారందఱును నుపకారబుద్ధి కలవారేయైయుందురు. కాన విద్యను గరపునపుడు విశేషశ్రద్ధను వహించి పాఠములు నేర్పుదురు. విద్యార్థినులను బాలికాపాఠశాలలో నేర్చుకొనునపపటికంటెను హెచ్చుగా గణితము, వ్యాకరణము, దేశచరిత్రలు, భూగోళము మొదలయిన యనేక శాస్త్రీయ విషయజ్ఞానము కలిగివానియందభిరుచి యధికమగునుగాన నాయాగ్రంథములింకను చదివి వారలానందింపగలరు. స్త్రీలు శాస్త్రీయ విషయిక జ్ఞానము కలవారలైనచో నలువురొకచోటఁ కలిసికొనినప్పుడు సయితము ఇప్పటివలెవారలు పరులదోషముల నెన్నుమాటలతోఁ గాలము వ్యర్థపుచ్చకతమకుఁగల శాస్త్రీయ విషయములనే ముచ్చటింపుచుందురు. అట్టి ప్రసంగములను వారి సమీపమునందుండి వినుచుండినవారి సంతతివారికి సహితమాయావిషయములు సులభముగా దెలియుచుండును. విద్యావతులచే నేర్పరుపఁబడు నీపాఠశాలలవలన నింకనుబెక్కులాభములు కలుగునుగానీ కాలమునందుతమరభ్యసించినవిద్యవలన దామేయానందింపుచుండినలాభమెంత మాత్రమునులేదు. మనమేదేనిగ్రంథము చదువునప్పుడు వినువారికి దాని యర్థము తెలిసినప్పటికి మన యానందమునకును వారికి మనమేయర్థమంతయుఁ దెలుపవలసినప్పటి మన మనోసుఖమునకు భేదముండుట మనకుననుభవమువలననే తెలియుచున్నది. కాన ఒక యూరియందుండు పదివేలమంది స్త్రీలలోఁ బరుగురు విద్యాసంపన్నులైయుండి తక్కినవారందఱువిద్యాహీనులైయుండగాఁజూచి యట్టివారికి విద్యగరుపఁ బ్రయత్నింపకుండుట పండితాగ్రగణ్యులనంబరగిన మీబోటివారికిఁ దగియుండదు. విద్యానంపద ధననంపదవలె దానముచేఁ దగ్గునదికాక మీదుమిక్కిలియభివృద్ధినేగాంచునని నేనుమీకువేరుగాఁ జెప్పనక్కరలేదు. ఇతర దానములెవ్వి యిచ్చినను బుచ్చుకొనువారికి సర్వార్థసాధనంబులుగావు. విద్యాదానమన్ననో పరిగ్రహించినవారినెన్నండును విడువకవారికి సర్వసుఖసాధనమై యొప్పుచుండును. ఈ దానమువలన నిచ్చినవారికిని బుచ్చుకొనినవారికిని గొరతలేక యానందమే కలుగును. గాననోయక్కలారా! మీరు మీ తోడివారినందఱను విద్యావతులను గావించినచో మీరే మీయానందమునుసహితము వెచ్చించికొనిన వారగుదురు. ఇట్లు స్వపరార్థము లొక్కకార్యములోనే సమకూడునట్టి సత్కార్యమును జేయకయుపేక్షించు నాయనబెదవికిఁ దాకినతే నియమమియుటయే యనవచ్చును. గానవిద్యానంపన్నులగు వారావిద్యాధనమునంతను తామేయనుభవించి యూరకుండక దానిని స్త్రీజాతివారికందఱకును బంచిపెట్టుటకై పాటుపడెదరని నేనునమ్మెదను. నాయల్పబుద్ధికిఁ దోచినటుల జెప్పిన యీవాక్యములను వృథాపుచ్చక నాసోదరీమణులందఱు దీనినిగూర్చి ప్రయత్నముచేసినచో నేను వారందఱియెడల మిక్కిలి కృతజ్ఞురాలనై వారికనేకవందనము లాచరించెదను.

ఈ పుస్తక రచనకు ఉపకరించిన గ్రంథాలు, వ్యక్తులు

1. ఆంధ్ర కవయిత్రులు– ఊటూకూరు లక్ష్మీకాంతమ్మ
2. నూరేళ్ళ పంట, రచయిత్రుల కథాసంకలనం – డా. భార్గవీరావు
3. 20వ శతాబ్దంలో తెలుగు రచయిత్రుల రచనలు (సంకలనం) అబ్బూరి ఛాయాదేవి
4. హిందూ సుందరి పత్రికలు
5. తెలుగు జనానా పత్రికలు – సంపాదకులు– రాయసం వెంకటశివుడు
6. తెలుగు–జనానా–సతీహితబోధిని – సంపాదకులు – రాయసం వెంకటశివుడు, కందుకూరి వీరేశలింగం పంతులు.
7. మనకు తెలియని మన చరిత్ర– ప్రచురణ : స్త్రీ శక్తి సంఘటన
8. శ్రీమతి భండారు అచ్చమాంబ జీవితం – నిడదవోలు వెంకట్రావు (అముద్రితం)
9. లక్ష్మణ రాయవర్ధంతి సంచిక – తెలుగు తల్లి పత్రిక సంపాదకులు : రాచమళ్ళ సత్యవతీదేవిసహసంపాదకులు : అడవి బాపిరాజు, వెల్దుర్తి మాణిక్యరావు, వట్టికోట ఆశ్వారు స్వామి
10. తొలి తెలుగు కథా రచయిత్రి భండారు అచ్చమాంబ – కొండవీటి సత్యవతి
11. జండర్ స్పృహ – ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రతిఫలనాలు – యుజిసి జాతీయ సదస్సు 2003
12. Women Writing in India 600 BC to the present ,Volume 1, 600 BC to the early 20th century, edited by Susie Tharu and K. Lalitha

తెలుగు సాహిత్యంలో చిరకాలంగా విమర్శకుల విస్మరణకు గురైన తొలి స్త్రీవాది భండారు అచ్చమాంబ.

తెలుగులో తొలి కథ రాసి, తొలిసారి స్త్రీల చరిత్రను స్త్రీవాద దృక్పథంతో దండ గుచ్చిన ఘనత కూడా అచ్చమాంబదే. స్త్రీల కోసం సంఘాలు నిర్మించడంలోనూ ఆమె అద్యురాలుగా నిలిచింది. వివిధ రంగాల్లో ప్రసిద్ధులైన భారత స్త్రీల చరిత్రలను అనేక భాషల నుంచి సేకరించి, అనువదించి 1903 లోనే అబలా సచ్చరిత్ర రత్నమాలను రాసింది.

వైదిక పౌరాణిక, బౌద్ధ స్త్రీల చరిత్రలను గ్రంథస్తం చేయాలనే మెగా ప్రణాళికను సిద్ధం చేసుకున్న అచ్చమాంబను అది పూర్తికాకముందే మృత్యువు కబళించడం మహా విషాదం.

వందేళ్ల క్రితమే స్త్రీల స్థితిగతుల గురించి ఎంతో అత్యాధునికంగా ఆలోచించి, స్త్రీల అభ్యున్నతి కోసం అహరహం కలవరించి, పలవరించిన అచ్చమాంబ అనాటి స్త్రీల పరిస్థితి పట్ల తన ఆవేదనను, అంతరంగ ఘోషను కథలుగా, వ్యాసాలుగా, చరిత్రగా, ఉపన్యాసాలుగా మలుచుకున్న తీరు అమోఘం, ఆశ్చర్యకరం కూడా. దాన్ని సవివరంగా చర్చించిందీ పుస్తకం.

కొండవీటి సత్యవతి ఫెమినిస్ట్, జర్నలిస్ట్, రైటర్.

ముప్పై సంవత్సరాలుగా స్త్రీల ఉద్యమంతో మమేకమయ్యారు. తెలుగులో వస్తున్న ఏకైక స్త్రీవాద పత్రిక 'భూమిక' వ్యవస్థాపక సభ్యులే కాక ఇరవై సంవత్సరాలుగా సంపాదకురాలు. సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం భూమిక హెల్ప్‌లైన్ నడపడంతో పాటు స్త్రీలకు సకల సహాయాలూ అందిచాల్సిన ప్రభుత్వ శాఖలు జండర్ స్పృహతో పని చేసేలా కృషి చేస్తున్నారు.

ఇప్పటివరకు ఆమె 'కల, మెలకువ' 'సందర్భం' పేర్లతో రెండు కథా సంపుటాలు వెలువరించారు. అంకితం, భూమి హక్కులు (ఆర్‌డిఐ) సంకలనాలు, గృహ హింస చట్టం మీద సంక్షిప్తపుస్తకం, భూమిక సంపాదకీయాలు, ప్రయాణ అనుభవాలు మొదలైన పుస్తకాలు వెలువడ్డాయి.